5

ASDS

వ్యవసాయక మరియు సాంఘిక అభివృద్ధి సంస్థ


# పయనంలో గత ఐదేళ్ళు




2008-2013

ఎ.ఎస్.డి.ఎస్. 25 వసంతాల సుదీర్ఘ పయనంలో గడచిన ఐదేళ్ళ ప్రగతి నివేదిక

**A.S.D.S. 5 Years Activity Report**




## ఏ.ఎస్.డి.ఎస్. పనిచేస్తున్న ప్రాంతం




సంకలనం : **ఎల్. మల్లిక్**

Copy right @ ASDS 2013

# తొలిపలుకు



1985 సంవత్సరంలో ప్రారంభమైన మా యీ సుదీర్ఘ ప్రయాణంలో గత ఐదు సంవత్సరాల కాలం చాలా ముఖ్యమైనది. ఈ ఐదు సంవత్సరాలలో ఆదివాసీ ప్రజల, గ్రామాల సంక్షేమం మరియు ఉన్నతి కొరకు వ్యవసాయక మరియు సాంఘిక అభివృద్ధి సంస్థ (ASDS) చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమాలు, ఫలితాలను గూర్చి ఈ నివేదిక వివరిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధిపరంగా బాగా వెనుకబడిన ప్రాంతం ఖమ్మం జిల్లా. ఇందులో ఆదివాసీ ప్రాంతాల పరిస్థితి ఇక వేరే చెప్పనక్కరలేదు. సంస్థ చాలాకాలం నుండి ఆదివాసీ ప్రాంతాల, ప్రజల అభివృద్ధికి పనిచేస్తున్నప్పటికీ, గత ఐదు సంవత్సరాల కాలాన్ని ఎంతో కీలకమైన సమయంగా మేము భావించడానికి బాహ్య కారణాలతో పాటు అంతర్గతమైన కారణాలు కూడా చాలానే ఉన్నాయి. బహిర్గత కారణాల్లో శరవేగంతో దూసుకొస్తున్న ప్రపంచీకరణ అనే పెను తుఫాను, దీని కారణంగా రాజకీయ, ఆర్థిక విధానాల్లో చోటు చేసుకొన్న మార్పులు ముఖ్యమైనవి. ఇవి ప్రకృతిపైన, ప్రకృతిపై ఆధారపడి బ్రతుకుతున్న అల్ప సంఖ్యాక (బలహీన) వర్గాలు ముఖ్యంగా ఆదివాసీ ప్రజలపై చూపుతున్న ప్రభావం అంతా ఇంతా కాదు. ఫలితంగా స్థానిక ఆదివాసీల సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థికస్థితి గతుల్లో వస్తున్న మార్పులు, ముఖ్యంగా యువతరం ఆలోచనా విధానంలో మార్పు, బయటి ప్రపంచంలో పెరుగుతున్న సంబంధాలు మొదలైనవి ముఖ్యమైన అంతర్గత కారణాలు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని, గత ఐదేళ్ళలో సంస్థ ఎన్నో క్రొత్త క్రొత్త విధానాలను, కార్యక్రమాలను, పథకాలను, వ్యూహాత్మకంగా అమలు జరిపింది. వీటిలో ఎన్నో విజయాలతో పాటు కొన్ని సవాళ్ళను కూడా ఎదుర్కొనవలసి వచ్చింది. నిజానికి ఈ ఆటుపోటుల నుండి నిలదొక్కుకొనే క్రమంలో పొందిన అనుభవమే, ఎప్పటికప్పుడు మా భవిష్యత్తు ప్రణాళికకు నాంది పలికింది. అలాగే మరింత నేర్పుతో ముందుకు సాగడానికి మాకు ఎంతో ధైర్యాన్నిచ్చింది.

మేము ఎప్పటి నుండో కొనసాగిస్తున్న మా ఈ ప్రయత్నంలో మానవ హక్కుల పరిరక్షణ, సహజ (ప్రకృతి) వనరుల దోపిడీని అరికట్టడం, ఆదివాసీ స్త్రీల అస్థిత్వం, ఆత్మగౌరవం కాపాడడం, సాంస్కృతిక సంరక్షణ అనేవి కీలకాంశాలుగా ఉన్నాయి. ఆదివాసీల సంక్షేమం మరియు సుస్థిర అభివృద్ధి కొరకు వ్యవసాయం, అటవీ ఫలసాయం, ఇతర జీవనోపాధుల అభివృద్ధి, ఆరోగ్యం, బాలల వికాసం, ఆదివాసీ స్త్రీల సాధికారత వంటి అంశాల్లో మేము ఒక నిరంతర కృషిని అంతకంతకూ బలోపేతం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాము. వీటికి సంబంధించి జాతీయస్థాయిలో ప్రభుత్వ విధానాల్లో అనుకూలమైన మార్పులు, పథకాల రూపకల్పనకు కృషి చేస్తున్నాము. అలాగే వీటి అమలు విషయంలో అధికారులపై ఒత్తిడితో పాటు, అవసరమైన చోట్ల పరస్పరం సహకారం, సత్సంబంధాలను కొనసాగిస్తూ, లక్ష్యాలు సాధిస్తున్నాం. గ్రామస్థాయి కార్యకర్తల దగ్గర నుండి సంస్థ ప్రధాన నిర్వాహకుల స్థాయి వరకూ క్రమం తప్పక పాల్గొనే వివిధ సమీక్షాసమావేశాలు, ప్రణాళికా రచనలు, వ్యూహాలు, కార్యక్రమ మూల్యాంకనలు మొదలైనవాటి మూలంగా మా కార్యక్రమాలన్నింటి మధ్య ఒక సమన్వయం సమకూరడమే కాకుండా తద్వారా సిబ్బంది ఆలోచనా విధానం, వ్యూహాత్మక రచన, అమలు విధానం అన్నింటా ఒక ఐక్యత, సామీప్యత సాధ్యమవుతుంది. మా కలలు, కాంక్షలు, ఆలోచనల సాకారం వాటి ఆచరణ, కార్యశీలత, కార్యక్రమాల సాఫల్యత వెనుక ఎందరో భాగస్వాములు వెన్నుదన్నుగా వున్నారు. మేధోపరంగా సలహా, సూచనలిచ్చే మిత్రులు, అవసరమైన సహకారాన్ని అందించే అధికారులు, నైతికంగా ధైర్యాన్ని, భౌతికంగా బలాన్నిచ్చే తోటి సామాజిక సేవకులు, ఎల్లప్పుడూ అండగా మా వెన్నంటి నిలిచే ప్రజలు, వీటన్నింటికి మించి దాతల సహకారం మాకు పుష్కలంగా వున్నాయి. వారందరికీ మా హృదయపూర్వక ధన్యవాదములు.



**(వి. గాంధిబాబు)**

డైరక్టర్

వ్యవసాయక మరియు సాంఘిక అభివృద్ధి సంస్థ (ఎ.ఎస్.డి.ఎస్.) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకార సంఘాల నమోదు చట్టం (సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్), 1860 (ప్రస్తుతం ఎ.పి.ఎస్.ఆర్.ఎ., 2011) క్రింద చట్టబద్ధంగా నమోదు కాబడిన ఒక స్వచ్ఛంద సేవాసంస్థ. అలాగే విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ చట్టం, (ఫారన్ కాంట్రిబ్యూషన్స్ రెగ్యులేషన్ యాక్ట్) 1976 క్రింద కూడా గుర్తింపు పొందివున్న, ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తున్న ఒక సేవా సంస్థ.

## మా కల

సమానత్వం మరియు సమగ్రత (హుందాతనం)ల యొక్క ఒక సువిశాల ప్రాతిపదికపై మెరుగైన జీవన ప్రమాణాలు మరియు ఒక మంచి సామాజిక స్థితిని కలిగిన ఆదివాసీ సాధికార సముదాయాలు నెలకొనడం.

## సంకల్పం

హేయమైన పేదరికం, కొందరిని ఎల్లప్పుడూ అణగద్రొక్కి వుంచే కుల, వర్గ, ఇతర వివక్షత, మానవ హక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా తమ హక్కుల సాధన కొరకు నిరంతరంగా పోరాడే ఆదివాసీ బృందాల (సంఘాల)ను ఒక సామాజిక మూలధనంగా అభివృద్ధి చేయడం ద్వారా సాముదాయిక వ్యవస్థాపన (కమ్యూనిటీ ఆర్గనైజేషన్)ను చేపట్టడం.

## ప్రధాన లక్ష్యాలు

★ ఆదివాసీ సముదాయాల సమగ్ర అభివృద్ధిని, సాధికారతలను సాధించడం మరియు అందుకు అవసరమైన నాయకత్వ లక్షణాలను పెంపొందించడం.

★ తమ వనరులపై ఆదిపత్యము హక్కుల పరిరక్షణకు అవసరమైన న్యాయసహాయాన్ని ఆదివాసీలకు అందించడం ద్వారా ప్రకృతి వనరుల సంరక్షణ, అభివృద్ధికి కృషి చేయడం.

★ వివిధ తరగతుల ఆదివాసీ ప్రజల ముఖ్యంగా పిల్లలు, యువత మరియు స్త్రీల సంరక్షణ, సాధికారతలను సాధించడం ఇందుకోసం మారుమూల ఆదివాసీ ప్రాంతాలలో బాలికల విద్యపై దృష్టి కేంద్రీకరించి, వివిధ రకాల నియత మరియు అనియత విద్యా కార్యక్రమాలను చేపట్టడం, తద్వారా బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించడం.

★ ప్రకృతి విపత్తుల నివారణ మరియు పునరావాసం మరియు విపత్కర పరిస్థితుల్లో అవసరమైన సేవలు అందించడం.

★ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు విజ్ఞానము, సాంస్కృతిక జీవన విధానాలను పరిరక్షించుట.

★ ఆదివాసీల అభివృద్ధి కొరకు పనిచేసే ఇతర స్వచ్ఛంద ప్రభుత్వ సేవా సంస్థలు, సమాఖ్యలతో వ్యూహాత్మక సహకార సంబంధాలను కొనసాగించుట.

# ముందుమాట



అభివృద్ధికి దూరంగా మారుమూల అడవులలో జీవిస్తూ వారిదైన ప్రత్యేక సాంప్రదాయాలు, సంస్కృతి, నాగరికతలు కల్గిన గిరిజనులను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపించడానికి వ్యవసాయక మరియు సాంఘిక అభివృద్ధి సంస్థ (ఎ.ఎస్.డి.ఎస్.) చేస్తున్న కృషి శ్లాఘనీయం. మానవీయ కోణంతో ఆదివాసీలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని వారికి అవసరమైన అన్ని అంశాలను పరిశీలించి, వారికి కావలసిన సహాయం అందించుట కొరకు వీరు చేస్తున్న కృషి సర్వదా అనుసరణీయం, అభినందనీయం.

భూమి సమస్యల పరిష్కారం, అటవీ హక్కుల చట్టం అమలు, మహిళల సమస్యల పరిష్కారం మరియు అంతర్గత నిర్వాశితుల సమస్యల పరిష్కారానికి సంస్థ అందిస్తున్న న్యాయ సహాయ సూచనలు, సహజ వనరుల నిర్వహణ మరియు యాజమాన్య పద్ధతులు గిరిజనులకు ఆత్మస్థైర్యాన్ని, స్వావలంభనను పెంపొందిస్తున్నాయి. రసాయన పురుగు మందులు వాడకుండా మంచి దిగుబడి సాధించి చూపించిన వ్యవసాయ పద్ధతులు గిరిజనుల సహజ సిద్ధ జీవన విధానం, వారి పూర్వం పద్ధతులకు తార్కాణాలు. నాట్‌వాన్ సంఘాల ద్వారా మహిళల సాధికారత, మహిళా హక్కులపై అవగాహన, వారి జీవనోపాధి నైపుణ్యాల అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయం.

అభివృద్ధిలో అత్యంత కీలక అంశాలుగా భావించే పిల్లల విద్యపై వీరి శ్రద్ధ, కృషి నిజంగా వీరి గిరిజన అభివృద్ధి కాంక్షకు తార్కాణం. బడి పిల్లలకు ఆరోగ్య శిబిరాలు నిర్వహణ, పాఠశాలలో వారి కొనసాగింపుకు స్నేహపూరిత వాతావరణం కల్పించే దిశగా కృషి, పిల్లలలో పరిశుభ్రత, ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహనతో పాటు పిల్లలకు నిత్యావసర సామాగ్రి కిట్ల సరఫరా, విదేశీ దాతల ద్వారా సేకరించిన విరాళాలతో నిర్వహించే స్పాన్సర్‌షిప్ ప్రోగ్రాం వీరు గిరిజన పిల్లల విద్యాభివృద్ధి కొరకై చేస్తున్న పరిణితీయ కార్యక్రమాలుగా గుర్తించి సంతసించటం జరిగింది. వికలాంగుల సంక్షేమాన్ని వీరు సామాజిక బాధ్యతగా గుర్తించటం, వారి కొరకు జీవనోపాధి అభివృద్ధి కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించటం మానవ సేవగా చెప్పాలి.

చత్తీస్‌ఘడ్ వలస బాధితుల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో సహాయ పునరావాస శిబిరాలు చాలా మెచ్చదగిన, గుర్తించదగిన అంశాలు. క్రమబద్ధమైన ఆర్థిక సామాజిక కార్యక్రమ నిర్వహణ సర్వదా వీరి అభివృద్ధికి నిదర్శనం.

ఇన్ని రకాలుగా గిరిజనుల అవసరాలను వారి సమస్యలను గుర్తించి వారికి సంబంధించిన అన్ని పార్శ్వాలను స్పృశిస్తూ ఎ.ఎస్.డి.ఎస్. వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించి వారిని అభినందించడం మన విధి.

వారు ఇదే ప్రస్థానాన్ని రాబోయేకాలంలో దిగ్విజయంగా కొనసాగించాలనీ ఆశిస్తూ, వారి కార్యక్రమ నిర్వహణకు కావలసిన అధికారిక సహాయ సహకారాలను అందించడానికి ఐ.టి.డి.ఎ. నిత్యం ముందుంటుందని తెల్పుతూ, అభినందిస్తూ

శుభాకాంక్షలతో......

మీ

30/12/2013

(జి. వీరపాండియన్)

ప్రాజెక్టు అధికారి

ఐ.టి.డి.ఎ. భద్రాచలం

## సంకేతపదాల వివరణ (ACRONYMS)

ఎ.ఎస్.డి.ఎస్ = వ్యవసాయక మరియు సాంఘిక అభివృద్ధి సంస్థ (Agriculature and Social Development Society)

ఎ.ఎల్.సి. = ప్రత్యామ్నాయ విద్యా కేంద్రాలు (Alternative Learning Centres)

ఎ.ఎన్.ఎం. = అక్సలరీ నర్స్ మిడ్‌వైవ్స్ (Auxilary Nurse Midwives)

ఎ.డబ్ల్యు.సి. = అంగన్‌వాడీ కేంద్రాలు (Anganwadi Centres)

సి.బి.ఒ. = గ్రామస్థాయి సంఘం (Community Based Organisation)

సి.బి.పి. = నైపుణ్యాల అభివృద్ధి దశ (Capacity Building Phase)

సి.హెచ్.డబ్ల్యు = గ్రామ ఆరోగ్య కార్యకర్త (Community Health Worker)

సి.ఆర్.పి.ఎఫ్. = కేంద్ర రిజర్వు పోలీసు దళం (Central Reserve Police Force)

డి.పి.ఎ.పి. = వరద నివారణ కార్యక్రమం (Drought Prone Area Programme)

డి.ఐ. = అభివృద్ధి కార్యక్రమం (Development Intiative)

డి.ఎం.& హెచ్.ఒ. = జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి (District Medical & Health Officer)

డి.ఆర్.డి.ఏ. = జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (District Rural Development Agency)

డ్వామా = జిల్లా నీటి యాజమాన్య సంస్థ (District Water Management Agency)

ఇ.సి.హెచ్.ఒ. = ఐరోపా మానవాభివృద్ధి సహాయక సంఘం (European Committee for Humantarian Aid)

ఎఫ్.ఆర్.ఏ. = అటవీ హక్కుల చట్టం (Forest Rights Act)

జి.సి.సి. = గిరిజన సహకార సంస్థ (Girijan Co-operative Corporation)

ఐ.సి.డి.ఎస్. = సమగ్ర శిశు అభివృద్ధి పథకం (Integrated Children Development Scheme

ఐ.డి.పి. = అంతర్గత నిర్వాసిత ప్రజలు (Internally Displaced People)

ఐ.కె.పి. = ఇందిరా క్రాంతి పథకం (Indira Kranthi Padham)

ఐ.ఎం.ఆర్. = శిశు మరణాల రేటు (Infant Mortality Rate)

ఐ.పి.ఎ.పి. = అంతర్జాతీయ భాగస్వాముల ఒప్పంద కార్యక్రమం (International Partners Agreement Program)

ఐ.టి.డి.ఏ. = సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (Integrated Tribal Development Agency)

ఎల్.ఆర్.పి. = స్థానిక హక్కుల కార్యక్రమము (Local Rights Programme)

ఎం.డి.ఒ. = మండల అభివృద్ధి అధికారి (Mandal Development Officer)

ఎం.ఎం.ఆర్ = ప్రసూతి మరణాల రేటు (Meternity Mortality Rate)

ఎం.పి.టి. = ఇంకుడు గుంతలు (Mini Perculation Tank)

ఎం.ఆర్.ఒ. = మండల రెవెన్యూ అధికారి (Mandal Revenue Officer)

నాబార్డ్ = జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ (National Bank for Agriculture and Rural Development)

ఎన్.డి.సి.సి. = పోషకాహార సరఫరా కేంద్రం (Nutritional Day Care Centre)

ఎన్.పి.ఎం. = పురుగు మందులువాడని వ్యవసాయ విధానం (Non Pest Management)

ఎన్.ఆర్.ఎం. = సహజ వనరుల యాజమాన్యం (Natural Resouce Management)

ఎన్.ఆర్.సి. = పౌష్టికాహార పునరావాస కేంద్రం (Nutritional Rehabilitation Centre)

ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. = జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం (National Rural Employment Gaurantee Scheme)

ఎన్.టి.ఎఫ్.పి. = కలపేతర అటవీ ఉత్పత్తులు (Non - Timber Forest Products)

పి.డి.ఎస్. = నిత్యావసర వస్తువుల సరఫరా కేంద్రం (Public Distribution System)

పి.ఇ.ఎస్.ఎ = షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయితీరాజ్ విస్తరణ చట్టం (Panchayats Extention to the Scheduled Areas)

పి.హెచ్.సి = ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (Primary Health Centre)

పి.ఓ. = ప్రాజెక్టు అధికారి (Project Officer)

ఆర్.బి.సి. = బడి బయట పిల్లలకు ఆశ్రమ విద్య (Residential Bridge Course)

ఆర్.ఎం.పి. = గుర్తింపు పొందిన వైద్యుడు (Registred Medical Practioner)

ఆర్.టి.ఇ. = విద్యాహక్కు (Right to Education)

ఆర్.టి.ఐ. = సమాచార హక్కు (Right to Information)

ఎస్.హెచ్.జి. = స్వయం సహాయక సంఘం (Self Help Group)

ఎస్.ఎస్.ఎ. = సర్వ శిక్ష అభియాన్ (Sarva Siksha Abhiyan)

ఎస్.టి. = షెడ్యూల్డ్ ట్రైబ్ (Scheduled Tribe)

యు.ఎన్. = ఐక్యరాజ్య సమితి (United Nations)

వి.ఎస్.ఎస్.ఎస్. = గ్రామ శ్రమ శక్తి సంఘాలు (Village Srama Sakthi Sangam)

డబ్ల్యు.డి.ఎఫ్. = వాటర్‌షెడ్ అభివృద్ధి నిధి (Watershed Development Fund)



## విషయ సూచిక


| | | పేజీ సంఖ్య |
|---|---|---|
| **I.** | **సందర్భం** | 06 |
| **II.** | **తక్షణావసరాలపై అవగాహన** | 11 |
| **III.** | **సంస్థ కార్యక్రమాలు** | 13 |
| 1. | న్యాయసలహా, సహాయం | 14 |
| 2. | సహజ వనరుల నిర్వహణ | 17 |
| 3. | మహిళా సాధికారత | 26 |
| 4. | అంతర్గత నిర్వాసితులు / దేశీయ శరణార్థులు | 33 |
| 5. | బాలల వికాసం | 45 |
| 6. | వికలాంగుల సంక్షేమం | 50 |
| 7. | ప్రకృతి విపత్తుల నిర్వహణ | 53 |
| 8. | అవగాహన, ప్రచార, శిక్షణా సలహా, సమన్వయ కార్యక్రమాలు | 55 |
| 9. | క్రొత్తగా ప్రారంభించిన కార్యక్రమం – ఆటలబడి | 59 |
| 10. | ఐక్య సంఘటనలు | 61 |
| **IV.** | **పరిపాలన మరియు ఆర్థిక వనరుల నిర్వహణ** | 64 |



# I. సందర్భం (Context)

## (చుట్టూ మారుతున్న పరిస్థితులు)

రెండు దశాబ్దాలకు పైబడిన మా ఈ సుదీర్ఘ ప్రయాణంలో సాధించిన విజయాలు ఎన్నో ఉన్నట్లే, ఎదురైన సమస్యలకు, నేర్చుకొన్న పాఠాలకు కూడా కొదువలేదు. ప్రారంభించిన పనిలో ఫలితం అనుకూలమైనా లేక ప్రతికూలమైనా, ప్రతీ ఒక్కదాని నుండి ఎంతోకొంత నేర్చుకుంటూ వచ్చాము. వాటిలోని క్రొత్త కోణాలు, సరిక్రొత్త విషయాలను తెలుసుకుంటూ, ఆ అనుభవాలను ఎప్పటికప్పుడు నెమరువేసుకొంటూ, మా మార్గాన్ని సుగమం చేసుకొంటున్నాము. సామాజిక మార్పును ఒక నిరంతరమైన, సహజసిద్ధమైన మరియు అనివార్యమైన మార్పుగా అంగీకరిస్తూనే, దానిలో ఆదివాసీ సముదాయాల ఉనికి, గుర్తింపు, సమగ్రతలు కొట్టుకొని పోకుండా కాపాడడం కోసం మా సంస్థ తగు కార్యక్రమాలు, ప్రణాళికలు వ్యూహాలను రచించుకొని అమలుపరుస్తుంది. ఈ సామాజిక మార్పులో భాగంగా ఆదివాసీల ఉనికికి చేటు తెస్తున్న పరిస్థితులు, మార్పులు చాలానే ఉన్నాయి. టూకీగా కొన్ని వివరాలు :

ఇక్కడి రాజకీయ, ఆర్థిక, సామాజిక, వాణిజ్య రంగాలన్నింటిలోనూ ఆదివాసేతర ఉన్నత వర్గాల ప్రాబల్యం గత కొంతకాలంగా పెచ్చు మీరిపోయింది. ఇందుకు స్వాతంత్ర్యానికి పూర్వమే అంటే వలసపాలకుల పాలనలోనే బీజం పడినప్పటికీ, ఈమధ్య కాలంలో వస్తున్న నూతన ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణలతో ఇది మరింత తారాస్థాయికి చేరింది. ఈ అంతర్గత, బహిర్గత శక్తుల ప్రాబల్యం మూలంగా స్థానికంగా చోటు చేసుకుంటున్న వివిధ పరిణామాలను ముందుగా పరిశీలిద్దాం.

**1. స్థానికంగా ఎదురవుతున్న పరిస్థితులు (సమస్యలు) :** స్థానిక సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల కారణంగా ఆదివాసీ ప్రజలకు ప్రధాన జీవనాధారాలైన రెండు వనరులు కలపేతర అటవీ ఫలసాయం మొత్తం దళారీల చేతుల్లోకి, అలాగే వ్యవసాయం మొత్తం గిరిజనేతర రైతుల చేతుల్లోకి పోయాయి. ఈ ప్రాంతంలో సాగు యోగ్యమైన భూమిలో ఎక్కువ భాగం, ఆదివాసేతరుల ఆధీనంలో ఉండడం చాలా దారుణం. ఎందుకంటే, నిజానికి ఇదంతా చట్టబద్దంగా ఆదివాసీలకు చెందిన భూమే. రాజకీయ పక్షాలు తమ ఓటు బ్యాంకు రాజకీయాలతో ఈ పరిస్థితిని తమ ప్రయోజనాలకు అనుకూలంగా మలచుకోవడానికి చూస్తున్నాయే తప్పా, ఒక న్యాయబద్ధమైన పరిష్కారంనకు ఏమాత్రం ప్రయత్నించడం లేదు. ప్రభుత్వ పథకాలలో లబ్దిదారులను గ్రామసభ ద్వారా ఎంపిక చేయాల్సి ఉండగా, వాస్తవంగా అది అమలు జరగడం లేదు. ఆదివాసీలు సాధారణంగా ఏ పథకంలో లబ్ది పొందాలన్నా స్థానికంగా ఉండే ధనిక వర్గాల, రాజకీయ నాయకుల, దళారీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బ్రతకాల్సి వస్తుంది.

గిరిజనుల ప్రయోజనాల కొరకు రూపొందించబడిన ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు, చట్టాలు అభివృద్ధి పథకాల గురించి ఉదాహరణకు **ఆదివాసీ ప్రాంతాలకు పంచాయితీరాజ్ విస్తరణ చట్టం (పెసా) 1994, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం, 2005, అటవీహక్కుల గుర్తింపు చట్టం, 2006, వంటివి** గిరిజనులకు ఏమాత్రం తెలియకపోగా, అవన్నీ స్థానిక

ఉన్నత వర్గాల ప్రాబల్యంతో దుర్వినియోగం అవుతున్నాయి. ఒకటి వారి అమాయకత్వం, రెండు పేరు ప్రతిష్టలు గల వ్యక్తుల ప్రాబల్యం ఈ రెండింటి వల్లే ఇవి అనర్హుల పాలవుతున్నాయి. ఆదివాసేతర ప్రజల ప్రాభల్యం ఫలితంగా ఆదివాసీల వైఖరిలో వస్తున్న మార్పుల మూలంగా అధికారులకు వీరిపై నమ్మకం పోవడమే కాకుండా ఆదివాసీలకు, అభివృద్ధి సంస్థలకు మధ్య దూరం బాగా పెరిగిపోయింది. ఇందుకు గిరిజనేతరుల ప్రాబల్యమే కారణం. ఎవరైనా వీటిని నివారించే ప్రయత్నం చేస్తే, ఇక్కడి పెత్తందారి వర్గం వారిని బెదిరించడానికి, దాడి చేయడానికి కూడా వెనుకాడని పరిస్థితి.




సాధారణంగా ఆదివాసీ సంస్కృతీసంప్రదాయాలు స్నేహభావానికి, సోదరప్రేమకు, ఆత్మీయతానురాగాలకు, సత్సంబంధాలకు మారుపేరు. వీరిది సామరస్యపూర్వకమైన సామాజిక వ్యవస్థ. ఎవరినైనా ఇట్టే నమ్మడం, ఆదరించడం, తమలో కలుపుకోవడం వీరి నైజం. సరిగ్గా ఇవే గుణాలు వీరు ముఖ్యంగా ఆదివాసీ యువతులు ఆదివాసేతర పురుషుల చేతిలో సులభంగా మోసపోవడానికి, దోపిడీకాబడడానికి ముఖ్య కారణాలయ్యాయి. ఎక్కువమంది స్థానిక ఆదివాసీ యువతులు గిరిజనేతర లారీ డ్రైవర్లు, క్లీనర్లు, వలస రైతులు, కూలీలు, అలాగే వీరికి అతి సమీపంలోవున్న భద్రాచలం కాగితపు పరిశ్రమ (పేపరుమిల్లు) లో పనిచేయడానికి వచ్చే ఉద్యోగులు, వర్కర్లు మొదలైనవారి చేతుల్లో మోసపోవడం ఒక సర్వసాధారణ విషయంగా మారింది. వీరు ఈ ఆదివాసీ స్త్రీలతో ఏర్పరచుకొనే ఈ అక్రమ, మోసపూరిత సంబంధాలు వారికి ఇక్కడి వనరుల దురాక్రమణ, దోపిడీకి, ప్రభుత్వ పథకాల్లో లబ్ధి, స్థానికంగా రాజకీయ ప్రాబల్యం పొందడానికి ఒక మంచి సాధనంగా ఉపయోగపడుతున్నాయి. చాలా సందర్భాలలో వీరు తమ ప్రయోజనాలను పూర్తిచేసుకున్న తరువాత ఈ స్త్రీలను విడిచిపెట్టిపోతుంటారు. ఇలా మోసపోయిన గిరిజన యువతులు గ్రామ, మండలస్థాయి పంచాయితీలను, కులపెద్దలను, ఎవరిని ఆశ్రయించినప్పటికీ ఫలితం ఉండడంలేదు.

అంతర్గత నిర్వాసిత మరొక సమస్య. ప్రక్క రాష్ట్రమైన చత్తీజ్‌ఘడ్ నుండి వేల సంఖ్యలో ఆదివాసీలు ఇక్కడకు వలసలు రావడం మరో కీలకమైన సమస్య. ఆ రాష్ట్రప్రభుత్వం అక్కడ ఆదివాసీలకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న సామాజిక, రాజకీయ బహిష్కరణ విధానాల మూలంగా 50,000 లకు పైగా ఆదివాసీలు మన ఆంధ్ర రాష్ట్రంలోని సరిహద్దు ప్రాంతమైన ఖమ్మం, వరంగల్ జిల్లాకు పారిపోయి వచ్చారు. ఇటు నక్సలైట్లు, అటు ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడిన ప్రైవేటు సైన్యం **'సాల్వాజుడుం'** మధ్య ఈ కుటుంబాలు అడకత్తెరలో పడ్డ పోకచెక్కలా నలిగిపోయి, చివరకు బ్రతికితే చాలని తలోదిక్కుకు పోయి తలదాచుకుంటున్నాయి. అయితే ఇక్కడ కూడా వీరి పరిస్థితి అంత సుఖంగా ఏమీలేదు. స్థానిక ప్రజలు, అధికారుల నుండి తీవ్రమైన ప్రతిఘటన, వేదింపులను ఎదుర్కొనవలసి వస్తుంది. వీరి సమస్య మిగిలిన సమస్యల కంటే ఎంతో భిన్నమైంది.

అటవీ వనరుల విషయానికొస్తే, వివిధ అభివృద్ధి పథకాల పేరుతో ప్రైవేటు, ప్రభుత్వాలు సంస్థలు చేపట్టిన అనేక కార్యక్రమాల మూలంగా ఇవి ఆదివాసీలకు పూర్తిగా దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. మరోప్రక్క అడవుల క్షీణత ఫలితంగా వాతావరణపరంగా ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్పులు వ్యవసాయ సంక్షోభం, కరువులు, వరదలు వంటి ప్రకృతి విపత్తులకు కారణం అవుతున్నాయి. అందువల్ల జీవనోపాధి మార్గాలను పూర్తిగా కోల్పోయిన ఎంతోమంది ఆదివాసీలు నెలల తరబడి సుదూర ప్రాంతాలకు వలసపోక తప్పడంలేదు. దీంతో వీరి కుటుంబాల సామాజిక జీవనం, సంస్కృతీ సంప్రదాయాలు అస్తవ్యస్తం అవుతున్నాయి.

పోలవరం నిర్వాసిత మరో పెద్ద సమస్య. ఈ ప్రాంతంలోని చాలావరకూ ఆదివాసీ గ్రామాలు పోలవరం ప్రాజెక్టు క్రింద ముంపుకు గురికానున్నాయి. గత 30 సంవత్సరాలుగా వారు మునగక, తేలక త్రిశంకు స్వర్గంలో వేల్రాడుతున్నారు. దీని చుట్టూ తిరుగుతున్న రాజకీయాలు అన్నీ ఇన్నీ కావు. దీని సాకుతో ఇన్నేళ్ళుగా ఇక్కడ ఏవిధమైన నిర్మాణాత్మక/అభివృద్ధి

కార్యక్రమాలు చేపట్టకపోగా, ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ఆదివాసీలను అణచి వేయడానికి ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒక ప్రక్క ఈ హింస, మరో ప్రక్క రాజకీయ నాయకుల అవకాశవాదం, అసంబద్ధ వాగ్దానాలతో ఆదివాసీలు విసిగిపోయారు.

బాధితుల్లో మరో కీలకమైన వర్గం పిల్లలు. పైన చెప్పిన అనేక కారణాలరీత్యా అనాథబాలలు, నిరాశ్రయులైన బాలల శాతం అంతకంతకూ పెరుగుతుంది. వికలాంగులైన పిల్లల పరిస్థితి సరేసరి. మిగిలిన ఆదివాసీ పిల్లల విషయంలో కూడా ఆహారం, ఆరోగ్యం, విద్య వంటి కనీస ప్రాథమిక అవసరాలు ఏవీ వీరికి అందడంలేదు. ఇక్కడ పిల్లలో 50%కి మించి తీవ్ర పౌష్టికాహారలోపం, రక్తహీనత, అంటురోగాలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా వలసలు, ప్రకృతి విపత్తులు, అంతర్గత నిర్వాసిత, కరువులు, ఆహార భద్రత కొరత వంటి సమస్యలు భావి భారతాన్ని ఎటువైపు తీసుకుపోతాయో తెలియనిస్థితి.

ప్రకృతి విపత్తుల్లో వరదలు ఇక్కడ ఒక సర్వసాధారణ విషయమైంది. రాష్ట్రంలో ప్రవహిస్తున్న అతి పెద్ద నది గోదావరి. ఇది ఖమ్మం జిల్లాలో ఇంచుమించు అన్ని ప్రాంతాలను కలుపుకొంటూ పోతుంది. కాబట్టి ఈ గోదావరికి ఇరువైపులా ఎన్నో వేలమంది ఆదివాసీలు నివాసం ఉంటున్నారు. వీరంతా ఋతుపవనాలు, తుఫాన్లు ఏవి వచ్చినా తరచూ ముంపుకు గురవుతుంటారు. ఈ మధ్యకాలంలో ఈ వరదల తాకిడి మరింత ఎక్కువైంది. వీరు ప్రతీ 3 లేక 4 సంవత్సరాలకొకసారి ఒక భారీ వరదను ఎదుర్కొనాల్సిన పరిస్థితి. ఫలితంగా గిరిజనులు తమ ఆవాసాలు, పంటలు, సర్వం కోల్పోయే దుస్థితి తరచూ ఎదురవుతుంది. ఇవి సంభవించినప్పుడల్లా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని ప్రయత్నాలు చేసినా పూర్తి ఫలితం ఉండడం లేదు. నష్టతీవ్రత, అత్యవసర పరిస్థితి ఏ సంవత్సరానికా సంవత్సరం పెరుగుతుందే తప్పా తగ్గడం లేదు. 1956 తరువాత ఈమధ్య 1986, 1990, 1992, 2005, 2006 మరియు 2013 సంవత్సరాల్లో తీవ్రమైన తుఫాన్లు, వరదలు ముంచెత్తాయి. అలాగే ఇక్కడ అగ్ని ప్రమాదాలు ఇండ్లు తగలబడడం, అటవీ దహనం జరిగే అవకాశం కూడా చాలా ఎక్కువే.

**2. జాతీయ పరిస్థితులు :**

ఆదివాసీ ప్రజలు వనరులపరంగా ఎంతో సమృద్ధికరమైన ప్రదేశాల్లో నివశిస్తున్నప్పటికీ, తీవ్రమైన దోపిడికీ గురవుతూ, అంతకంతకూ అణగద్రొక్క బడుతున్నారు. వీరిపై రోజురోజుకూ పెరుగుతున్న ఈ దోపిడికీ, బహిర్గత శక్తుల ప్రభావానికి మూల కారణం. వీరి ఆవాసాల చుట్టూ నెలకొనివున్న సహజ వనరులకు బయటి ప్రాంతాలలో పెరుగుతున్న డిమాండు, వాణిజ్య ప్రయోజనాలే. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు, ప్రపంచీకరణ పేరుతో మార్కెట్లు వీరి జీవన భద్రత, బ్రతుకుతెరువు, చివరకు అస్థిత్వానికి కూడా పెద్ద సవాలుగా మారాయి. వీరి జీవన విధానంలోని ప్రతీ అంశంలో నేడు బయటవారి జోక్యం పెరిగిపోవడంతో సముదాయపరమైన సంస్కృతీ, సంప్రదాయాలకు, వారి సాముదాయక విలువలకు తూట్లు పడుతున్నాయి.

బహిర్గత ఏజంటులుగా మార్కెట్లు మరియు ప్రభుత్వం రెండూ కలసి ఆదివాసీల బ్రతువుతెరువుపై చూపుతున్న తీవ్ర దుష్ప్రభావానికి, క్రమేపి అంతరిస్తున్న వీరి బ్రతుకుతెరువు మార్గాలు, సాముదాయిక విలువల వ్యవస్థ, సాముహిక కట్టుబాట్లే ప్రబల నిదర్శనం. నిజానికి ఈ దోపిడీ విధానం లేక అందినంత మట్టుకు నొల్లుకుపోయే ధోరణికి బ్రిటీష్ వలస పాలకులే నాంది పలికారు. వీరి పోషణలో పెరిగిన ఆదివాసేతర భూస్వాములు స్వాతంత్ర్యానంతరం కూడా అదే ధోరణిని ఆదివాసీ ప్రాంతాలపై కొనసాగించారు. ఆదివాసీలను రక్షించే చట్టాలను కొన్నింటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించినప్పటికీ కొంతమంది అధికార్ల నిర్లక్ష్యం, అవినీతి, స్వార్థ రాజకీయాలు, స్వప్రయోజనాల మూలంగా అవి అంతగా అమలు కావడంలేదు. ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో, ప్రత్యేకించి షెడ్యూల్డ్ ప్రాంతాలుగా గుర్తించబడిన ఆదివాసీ ప్రాంతాల్లోనే నేడు 48 శాతం జనాభా, 56 శాతం భూములు ఆదివాసేతరులవిగా ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



ఎప్పుడైతే ప్రభుత్వం తన పరిపాలనా విధానంలో ఆర్థిక ప్రయోజనాలకు పెద్దపీట వేస్తుందో, అప్పుడే సామాజిక న్యాయం, పేద బలహీన వర్గాల సంక్షేమం, వారి మనుగడ అన్నీ ప్రశ్నార్థకం అవుతాయని చరిత్ర చెబుతుంది. దీంతో ఆదివాసీలలాంటి అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం, ఆదర్శాలు, సామాజిక, సాంస్కృతిక విలువలకు వేటికీ స్థానం ఉండదు సరికదా, వీరు తమ ఆవాసాలు, వనరుల నుండి కూడా భౌతికంగా దూరమవుతారు. అభివృద్ధి పేరుతో ప్రవేశపెట్టే ప్రాజెక్టుల మూలంగా నిర్వాసితులవ్వడమే కాకుండా, భూపరాయీకరణ, అటవీ నిర్మూలన, సహజ వనరుల క్షీణత వల్ల కూడా వీరు బాధితులుగా మిగులుతారు. ప్రస్తుతం ఆదివాసీ ప్రాంతాల్లో నెలకొనివున్న భూమి సమస్యలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం.

**3. అంతర్జాతీయ పరిస్థితులు – మార్కెట్టు ప్రభావం :**



ప్రస్తుత ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలు దేశంలోకి బయటి మార్కెట్ల ప్రవేశానికి తలుపులు బార్లా తెరవాలని చెబుతున్నాయి. అంటే ఉత్పత్తి, కొనుగోలు, వినియోగం, వస్తుసేవలు మొదలైనవాటిపై ఏవిధమైన ప్రభుత్వ నియంత్రణ, ఆధిపత్యం ఉండకూడదనేది దీని ముఖ్య సూత్రం. సప్లయ్, డిమాండులే (మార్కెట్టే) వీటన్నిటినీ నిర్ణయిస్తాయని, వర్తకానికి ప్రాంతాలు, రాష్ట్రాలు, దేశాలు అనే హద్దులను చెరిపెయ్యాలని, ఈ భూమిపై ఎవరు ఎక్కడికైనా వెళ్ళి వ్యాపారం చెయ్యవచ్చని ఇవి చెబుతున్నాయి. అంతటా నేడు ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ రాజ్యం ఏలుతుంది. అయితే ఈ విధానాలన్నీ కలసి ఆదివాసీ సముదాయాలపై అత్యంత ప్రతికూల ప్రభావాలను చూపుతున్నాయి.

మార్కెట్టుకు అవసరమైన మొత్తం ముడిసరుకు (సహజవనరులు) ఆదివాసీ ప్రాంతాల్లోనే నెలకొని వుండడం ఇందుకు ముఖ్య కారణం. వ్యాపారస్థులు (మార్కెట్లు) లాభాపేక్షతతో వీటిని దోపిడీ చేయడానికి చూస్తారు. కానీ ఆదివాసీలకు ప్రకృతితోవున్న సంబంధం విడదీయరాని తల్లీబిడ్డల సంబంధం. అయితే ప్రతీదాన్ని ఆర్థిక దృష్టికోణంతో చూసే మార్కెట్లు, సహజవనరుల చుట్టూ పెనవేసుకొనివుండే వీరి బంధాలను, సంస్కృతిసంప్రదాయాలను, అస్థిత్వాన్ని ఉనికిని కూకటివ్రేళ్ళతో పెకలించడానికి కూడా వెనుకాడవు. ఇప్పుడు ఖచ్చితంగా అదే జరుగుతుంది. ఇక్కడి అటవీ సంపద, గనులు, భూమి, జలవనరులు మొదలైన వాటన్నింటిని తరలించుకుపోవడానికి మార్కెటు ఒక విధంగా వీరిపై యుద్ధన్నే ప్రకటించిందని చెప్పాలి. ఆదివాసీలు భూమిని తల్లిగా, ఉమ్మడి సొత్తుగా, తరతరాలకు ఒక సుస్థిర జీవన వనరుగా భావిస్తే, మార్కెట్టు దీన్ని కేవలం ఉత్పత్తికి ప్రధాన సాధనంగా చూస్తూ, దీనిపై వ్యక్తిగత యాజమాన్య హక్కుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తుంది. ఇది ఆదివాసీ ప్రాంతాల్లో చౌకగా లభిస్తుంది కాబట్టి, ఇక్కడే సాధ్యమైనంత ఎక్కువగా భూమిని ఆక్రమించుకొంటుంది, అలాగే ఇతర వనరులను కూడా. మైదాన ప్రాంతాల్లో జనాభా మరియు వనరుల వినియోగం బాగా పెరిగిపోవడంతో, ఆదివాసీ ప్రాంతాల్లో వీటికి ముఖ్యంగా భూమికి డిమాండు పెరిగిపోతుంది. దీంతో ఆదివాసేతరుల ప్రవేశం, ఆదిపత్యం పెరిగిపోయాయి. ఫలితంగా ఇక్కడ ఉమ్మడి వనరుల సంస్కృతి పోయి, వ్యక్తిగత ఆస్తులు, హక్కుపట్టాలు, వాటికి సంబంధించిన చట్టాలు, తగవులు, కోర్టు వ్యవహారాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.



**4. ప్రభుత్వాల పాత్ర :**




ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానం ఆశించనంతగా ఫలితాలను ఇవ్వడం లేదు. గతంలో వచ్చిన పాలనాపరమైన చట్టాలు, విధానాలు, రాజ్యాంగ సూత్రాలు చాలావరకూ ఆదివాసీల అభిష్టాలను గౌరవించేవి, రక్షించేవే అయినప్పటికీ, వాటిని అమలు చేయాల్సిన యంత్రాంగం అంతగా శ్రద్ధ చూపడం లేదు. పాలనా వ్యవస్థకు ఆదివాసీ సముదాయాల పట్ల ఒక ఉదాసీనత నెలకొని ఉంది. పాఠశాలల నుండి కాలేజీల వరకూ, ఆదివాసేతర ఉపాధ్యాయుల దగ్గర నుండి తోటి ఆదివాసీ ఉద్యోగుల వరకూ చాలామందిలో వీరిని గురించి వెనుకబడ్డవారు, నిరక్షరాస్యులు, అనాగరికులు అనే మూస అభిప్రాయం ఉండడంతో, వీరిని తక్కువగా చూడడం పరిపాటి అయ్యింది. అందువల్లనే ఈమధ్య కాలంలో విద్యావంతులవుతున్న ఆదివాసీ యువత తమ విలువైన సంస్కృతీ, సంప్రదాయాల నుండి దూరం అవుతున్నారు. పాఠశాలల్లో బోధించబడేదేదీ వీరికి సంబంధం వున్నది కాదు. ప్రభుత్వం కూడా వీరిని ప్రధాన స్రవంతిలో కలపడానికే ప్రయత్నిస్తుంది తప్పితే, వారి సొంత సంప్రదాయ విజ్ఞానాన్ని విలువలను కాపాడడానికి, దాన్ని వీరి విద్యా విధానంలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నించడం లేదు.

ఇంకా విచారించదగ్గ విషయం ఏమిటంటే ఆదివాసీ వనరుల సంరక్షణకు ఉద్దేశించబడిన చట్టబద్ధమైన రక్షణలను తొలగించమని వ్యాపార వర్గాలు ప్రభుత్వాలపై రాజకీయంగా ఒత్తిడిని రోజురోజుకు పెంచుతున్నాయి. ఫలితంగా జాతీయ స్థాయి విధాన నిర్ణయాలన్నింటిలోనూ, అలాగే అభివృద్ధి ప్రాజెక్టులలో ఆదివాసీ ప్రజల ఆకాంక్షలకు, అభిష్టాలకు తిలోధకాలివ్వడానికి ప్రభుత్వాలు సన్నద్ధమవుతున్నాయి. తదనుగుణంగానే భూసేకరణ విషయంలో ఆదివాసీలకు గల చట్టపరమైన రక్షణ తొలగించి, ఆదివాసేతర వ్యాపార వర్గాలకు ప్రయోజనాలు చేకూర్చడానికి నేడు ఇవి ప్రయత్నిస్తున్నాయి. అందువల్ల ఆదివాసీ ప్రాంతాలు (ప్రజలు) రాజ్యాంగపరంగా, చట్టపరంగా కలిగి ఉన్న ప్రత్యేక హక్కులను ముందు ముందు కోల్పోయే పరిస్థితి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కూడా కన్పిస్తుంది.

ఈవిధంగా చుట్టుప్రక్కల పరిస్థితులు, మార్కెట్టు శక్తులు, ప్రభుత్వాలు, ఇతర శక్తులన్నీ బయటి వారికే అధిక ప్రాధాన్యతను, విలువను ఇవ్వడంతో క్రమేపీ అంతర్గతంగా కూడా అదే విధమైన మార్పులు సంభవిస్తున్నాయి. ఆదివాసీ యువత తమ సంస్కృతీ, సంప్రదాయాలు, ఆటపాటలు, వేషభాషలు, సంప్రదాయ విజ్ఞానం, కట్టుబాట్లు, మానవత్వ విలువలతో కూడిన తమదైన ప్రత్యేక జీవన విధానాన్ని విడనాడి, వాణిజ్య ప్రధానమైన, స్వార్థపూరిత, వ్యక్తిగత ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యతనిచ్చే ప్రధాన స్రవంతిలోని సంస్కృతి వైపుకు నెమ్మదిగా అడుగులు వేస్తుంది. ఇది తరాల మధ్య అంతరాన్ని పెంచుతుంది. దీంతో ఆదివాసీ యువత ఆకాంక్షలకు, సాముదాయక అవసరాలకు మధ్య ఒక పెద్ద అగాధం ఏర్పడుతుంది. ప్రస్తుతం ఆదివాసీ ప్రాంతాల్లో ఈ రెండు సంస్కృతుల మధ్య ఒక సంఘర్షణ, సందిగ్ధ వాతావరణం నెలకొనివుంది. యువత ఎటువైపు పోతుందో తెలియని స్థితి. ఇటువంటి అనేక ప్రతికూల పరిస్థితులను చక్కదిద్ది ఆదివాసీ సముదాయాల అస్థిత్వాన్ని, సుస్థిర అభివృద్ధిని సాధించడానికి ఒక వ్యవస్థీకృత ప్రయత్నం జరగాల్సిన ఆవశ్యకత ఎంతో వుంది. ఈ సందర్భాన్ని, పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయక మరియు సాంఘిక అభివృద్ధి సంస్థ రూపుదాల్చింది.



## II. తక్షణావసరాలపై అవగాహన (Awareness on Felt Needs)


25 వసంతాల సుదీర్ఘ అనుభవంలో సంస్థ ఆయా పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ, ఆదివాసీల తక్షణ అవసరాలను గుర్తించ గలుగుతుంది. అవి :

- ✤ ముందు చర్చించిన, బహిర్గత సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా అంతర్జాతీయ వాణిజ్య ప్రయోజనాల రీత్యా ఆదివాసీ సముదాయాలు ముందు ముందు మరింత అణచివేతకు గురికాబడే అవకాశం ఎక్కువగావుంది. కాబట్టి ఈ పరిస్థితులపైన వీరికి అవగాహన కల్పించి, చైతన్యపరచవలసిన అవసరం ఎంతైనా వుంది.
- ✤ ప్రత్యేకించి భూమి హక్కులపై అవగాహన కల్పించడం ముఖ్యం. ఇందులో భాగంగా సంబంధిత అధికారుల నుండి భూమి రికార్డులను పొందడం, చట్టవిరుద్ధమైన ఆక్రమణదారులపై కేసులు పెట్టి చట్టబద్ధంగా భూమిని తిరిగి రాబట్టకోగలగడంపై ఆదివాసీలకు అవగాహన తక్షణ అవసరం. అందుకు వీరికి న్యాయవిద్య (లీగల్ ట్రైనింగ్స్)లో శిక్షణ ఇవ్వాల్సి వుంది.
- ✤ ప్రభుత్వ అధికారులు, ఋణదాతలు (సంఘాలు, బాంకులు) మొదలైనవారికి, ఆదివాసీలకు మధ్యవున్న అంతరాన్ని తగ్గించి, వారి మధ్య సత్సంబంధాలు, సుహృద్భావ వాతావరణం (స్నేహభావం) నెలకొల్పాలి. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల సక్రమమైన అమలుకు గ్రామస్థాయిలో సమర్ధవంతమైన వేదికలను ఏర్పాటు చేయాల్సిన అవసరం చాలా వుంది.
- ✤ మహిళా సాధికారత మరో తక్షణ అవసరం. ఆదివాసేతర మరియు ఆదివాసీ పురుషుల చేతిలో మోసపోయిన ఆదివాసీ స్త్రీలకు సంబంధించి సమగ్ర సమాచారం సేకరించి, వారందరి మధ్య ఐక్యతను, వారికి ఒక ఉమ్మడి వేదికను ఏర్పాటు చేయాలి. వీరి పునరావాసానికి అవసరమైన మానసిక స్థైర్యం, ఆర్థిక తోడ్పాటును అందించడానికి వ్యూహాత్మకంగా ఒక గట్టి ప్రయత్నం జరగాలి.
- ✤ సుస్థిర గిరిజనాభివృద్ధికి ముఖ్యంగా వ్యవసాయం, (వాటర్‌షెడ్) అటవీవనరులు, ఇతర జీవనోపాదుల అభివృద్ధికి కృషి జరగాలి. కరువులు, వరదలు, ఇతర ప్రకృతి విపత్తులను ఎదుర్కొనడానికి దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పనిచేసే సంస్థాగత, వ్యవస్థీకృతమైన ఏర్పాటు ఒకటి కావాలి. ప్రకృతి విపత్తుల నివారణకు ప్రత్యేకించి నిధుల ఏర్పాటు (సమీకరణ) జరిగాలి.
- ✤ అభివృద్ధి పేరుతో దేశీయమైన లేక అంతర్గతమైన కాందిశీకుల (శరణార్థుల) సమస్య (ఇతర రాష్ట్రాల నుండి ఆదివాసీలు

వలసలు రావడం) అంతకంతకు పెరుగుతూ వుందే తప్పా, తగ్గడంలేదు. ముఖ్యంగా చత్తీజ్‌ఘడ్ నుండి ఇక్కడకు వచ్చిన ఆదివాసీల పరిస్థితి చాలా దయనీయంగా వుంది. ఇది ఇంకా ఎన్నో ఇతర సమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి ఈ సమస్య పరిష్కారానికి తప్పనిసరిగా ప్రయత్నించాల్సి వుంది.

- అభివృద్ధి కార్యకలాపాల క్రింద ముఖ్యంగా పోలవరం వల్ల సంభవించబోయే భారీ నిర్వాసిత ఫలితంగా వచ్చే ప్రత్యక్ష, పరోక్ష సమస్యలను నివారించుకోవడానికి, అలాగే ఆదివాసీలు తమ అస్థిత్తత్వాన్ని కాపాడుకోవడానికి ఒక బలమైన ప్రతిఘటన అవసరం. అందుకు ప్రజా ఉద్యమం ఒక్కటే మార్గం.

- ప్రభుత్వ గిరిజనాభివృద్ధి పథకాలు, అలాగే చట్టాలు, అటవీ హక్కుల గుర్తింపు చట్టం, పంచాయితీ రాజ్ (PESA), జాతీయ ఉపాధిహామి చట్టం (NREGA) వంటివి సక్రమంగా అమలు జరిగి, వాటి ప్రయోజనాలు నిజమైన లబ్దిదారులకు చేకూరాలంటే యువతకు శిక్షణ, గ్రామస్థాయి సంఘాల ఏర్పాటు, ప్రజా చైతన్యం, వీటి కొరకు ప్రచార కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం చాలా ఎక్కువగా వుంది. లేదంటే ఇవేవీ ఇక్కడ అమలు జరిగే అవకాశం ఎంతమాత్రం లేదు.



- బాలల సంరక్షణ మరొక కీలకమైన అంశం. ముఖ్యంగా వికలాంగులు, అనాధలు, నిర్వాసిత, వలస బాధిత కుటుంబాల పిల్లలు, ఏ విధమైన ఆదరణకు నోచుకోక, తగిన పౌష్టికాహారం లభించక బాధపడుతున్నారు. నిరాశ్రయులవుతున్న ఈ బాలల సంక్షేమం ఎంతో ముఖ్యం. భావి భారత వారసత్వ సంపద అయిన ఈ బాల భారతాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపైన ఖచ్చితంగా వుంది. ఈ అవగాహనతోనే సంస్థ తన లక్ష్యాలను ఏర్పరచుకొని, తగిన ప్రణాళికలను, కార్యక్రమాలను రూపొందించుకొని అమలు జరుపుతుంది.





## III. సంస్థ కార్యక్రమాలు (Activities)

ఆదివాసీల ప్రస్తుత పరిస్థితులు తక్షణ అవసరాల దృష్ట్యా సంస్థ వివిధ రకాల కార్యక్రమాలను ప్రారంభించి, గ్రామస్థాయి నుండి అమలు పరుస్తుంది. కాలక్రమంలో ఎదురైన అనుభవాలు మారుతున్న పరిస్థితుల ఆధారంగా ఎప్పటికప్పుడు వీటికి అవసరమైన మార్పులు చేస్తూ వస్తుంది. అయితే వేరు వేరు సమస్యల పరిష్కారానికి వేరు వేరు కార్యక్రమాలు చేపట్టినప్పటికి వీటన్నింటి మధ్య ఒక అంతర్లీనమైన సంబంధం కలిగి వుండి, ఇవి ఆదివాసీల సమగ్ర అభివృద్ధిని, సుస్థిర జీవన విధానమును పెంపొందించగలిగేవై ఉంటాయి. అలాగే కొన్ని సమస్యలకు సంబంధించి దీర్ఘకాలిక ప్రయత్నాలను చేపడితే, మరికొన్ని సమస్యల పరిష్కారానికి వాటి విస్తృతి, ప్రవృత్తులను బట్టి నిర్ధిష్ట కాలానికి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. సంస్థ వీటి అమలుకు తగిన ప్రణాళికలను, వ్యూహాలను ఎప్పటికప్పుడు మెరుగుపెట్టుకొంటూ ముందుకు నడుస్తుంది.

**సంస్థ చేపడుతున్న ముఖ్య కార్యక్రమాలు :**

1. న్యాయసలహా సహాయం
2. సహజ వనరుల నిర్వహణ
3. మహిళా సాధికారత
4. అంతర్గత నిర్వాసితుల (దేశీయ శరణార్థులు) సంరక్షణ
5. బాలల వికాసం
6. వికలాంగుల సంక్షేమం
7. ప్రకృతి విపత్తుల నిర్వహణ
8. అవగాహన, ప్రచార, శిక్షణా, సలహా, సమన్వయ కార్యక్రమాలు
9. ఆటలబడి
10. ఐక్య సంఘటనలు

ఆయా కార్యకలాపాల వివరాలను, ఫలితాలను ఒక్కొక్కటిగా పరిశీలిద్దాం.


# 1. న్యాయ సలహా సహాయం (LEGAL ADVOCACY)

'ఆదివాసీలకు న్యాయసహాయాన్ని అందించడం' సంస్థ ప్రారంభం నుండి ఒక కీలకమైన కార్యక్రమంగా కొనసాగిస్తుంది. ముఖ్యంగా ఆదివాసీలు తమ వనరులపై హక్కులను సాధించుకొనేందుకు, ప్రభుత్వ సేవలను సక్రమంగా అందిపుచ్చుకునేందుకు, ఇతరుల దోపిడీ, అన్యాయాలు, హింస, దౌర్జన్యాల నుండి తమను తాము కాపాడుకొనేందుకు, అలాగే ఆదివాసీ యువతులు, స్త్రీలు ఆదివాసీ, ఆదివాసేతర పురుషుల మోసం, వంచన, దోపిడిల నుండి రక్షణ పొందేందుకు, అంతర్గత నిర్వాసితులు తమ హక్కులను పరిరక్షించుకొనేందుకు తగిన న్యాయ సహాయాన్ని సంస్థ నిరంతరంగా అందిస్తుంది. ఈ సమస్యలకు సంబంధించిన న్యాయ పోరాటంలో గత ఐదు సంవత్సరాల కాలంలో సంస్థ ఎంతో కృషి చేసింది.

**1.1. భూమి సమస్యలు – పరిష్కారం :** సంస్థ ప్రారంభదశలోనే భూమి సంబంధమైన సమస్యలపైన దృష్టి కేంద్రీకరించ వలసి వచ్చింది. ఇది యాధృచ్చికమే అయినా, సమస్య యొక్క తీవ్రతకు దీన్ని ఒక నిదర్శనంగా కూడా మనం భావించవచ్చు. స్థానికంగావున్న భూమి, అందులోనూ వ్యవసాయ యోగ్యమైన భూమి చాలా వరకు ఆదివాసేతరుల ఆధీనంలో వుంది, దీనిలో ఎక్కువ భాగం వారు చట్టవిరుద్ధంగా ఆక్రమించుకొన్నదే. ఈ ఆక్రమణ దారులను గుర్తించిన వెంటనే సంస్థ వారిపై నేరుగా కేసులు వేసింది. ఆ తరువాత ఆదివాసీల అభీష్టాలను, ప్రయోజనాలను, సంక్షేమాన్ని కాపాడేందుకు ఉద్దేశించబడిన చట్టాలు, న్యాయపరమైన విషయాలు ప్రత్యేక నిబంధనలపై స్థానిక ప్రజలకు అవగాహనను పెంచవలసిన అవసరాన్ని గుర్తించిన సంస్థ వెంటనే ఆ దిశగా ప్రయత్నాలను ప్రారంభించింది. ముఖ్యంగా యువతకు ఈ విషయాలపై అవగాహనను పెంచేందుకు న్యాయవిద్యపై శిక్షణా కార్యక్రమాన్ని (కెపాసిటీ బిల్డింగ్) ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తుంది. ఇలా శిక్షణ పొందిన వీరు క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా కేసులను గుర్తించి, న్యాయస్థానాల్లో సవాలు చేసి, కొన్ని భూములను తిరిగి రాబట్ట గలిగారు. ప్రారంభ దశలోనే 230 ఎకరాల భూమిని తిరిగి గిరిజన రైతులు పొందగలిగారు. దీనికి కొనసాగింపుగా ఈ ఐదుసంవత్సరాల కాలంలో అడంగల్, ఇతర భూమి రికార్డులపై అవగాహన, భూమి కొలతలు, కేసులు పెట్టడం వంటి అంశాలపై ఎన్నో శిక్షణలు, సదస్సులు నిర్వహించింది.



**1.2. అటవీ హక్కుల చట్టం (ఎఫ్.ఆర్.ఎ.) అమలు :** రెవిన్యూ భూములని, అటవీ భూములని ఇటువంటి వర్గీకరణలేవీ రాకముందు నుండే ఆయా భూముల్లో గిరిజనులు ఆవాసం ఉంటూ, వాటిలో శతాబ్దాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ మూలవాసులుగా, ఆదిమవాసులుగా పేరుపొందినప్పటికి, వారికి వాటిపై ఏవిధమైన హక్కులు లేవు.


అటవీహక్కుల చట్టంపై గ్రామస్థాయి సమావేశం

అయితే ఇన్నాళ్ళకు (2006లో) వారి హక్కులను గుర్తించే అటవీ హక్కుల చట్టం ఒకటి వచ్చింది. అదే అటవీ హక్కుల చట్టం. (ఎఫ్.ఆర్.ఎ.) దీన్ని అనుసరించి 2008, ఫిబ్రవరి 16 నాటికి అటవీ నివాసులు సాగుచేసుకొంటున్న మొత్తం పోడు భూములను గుర్తించి, వాటన్నింటినీ చట్టబద్ధం (రెగ్యులరైజ్) చెయ్యాలి. జిల్లా అధికారులందరికీ ముఖ్యంగా అటవీ సిబ్బందికి సంబంధిత శాఖల నుండి ఆ విధమైన ఆదేశాలు అందినప్పటికీ భద్రాచలం అటవీ విభాగంలో కదలిక అంతగా కన్పించకపోవడంతో, స్థానిక ఆదివాసీల ప్రయోజనాలను కాపాడడం కోసం సంస్థ తన ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రజలకు మార్గనిర్దేశం చేసి, వ్యక్తిగత పట్టాల కోసం 'ఎ' ఫామ్స్ (దరఖాస్తులను) ఉమ్మడి వనరుల (భూముల) గుర్తింపునకు 'బి' ఫామ్స్‌ను ఆదివాసీలచే నింపించి, సంబంధిత అధికారులకు సమర్పించేలా చేసింది. అలాగే కొంతమంది గ్రామస్థులు కలసి ఐ.టి.డి.ఎ. ప్రాజెక్టు అధికారి మరియు సబ్ కలెక్టర్ల వద్దకు వెళ్ళి గ్రామసభల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చెయ్యమని, వాటిని సక్రమంగా నిర్వహించేలా తగిన చర్యలను తీసుకోమని వారిని కోరేలా ప్రోత్సహించింది.

ఫలితంగా స్థానిక అధికారులు ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించడం మొదలుపెట్టారు. వీరికి తోడు సంస్థ కూడా గ్రామస్థాయి సంఘాలు మరియు నాట్‌వాన్ సంఘం ప్రతినిధులకు 'ఎ' మరియు 'బి' ఫామ్స్ ద్వారా ధరఖాస్తు చెయ్యడం, హక్కు పత్రాలు పొందడమెలాగో శిక్షణల ద్వారా తెలియజెప్పింది. గోడ పత్రికలు, సమావేశాలు, ఇతర కీలక ప్రచార పద్ధతుల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయగలిగింది. అలాగే గ్రామల్లో ఏవిధమైన వివాదాలు రాకుండా భూముల గుర్తింపు, సర్వే, సరిహద్దుల ఏర్పాటు వంటి అంశాల్లో ప్రజలకు అవగాహన కల్పించింది. పరస్పర సంప్రదింపులు ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగం ద్వారా చాలా సమస్యల పరిష్కారానికి తోడ్పడింది.

**ఫలితాలు :** సంస్థ కృషి మూలంగా 87 గ్రామాల్లో చట్టం క్రింద మొత్తం 3,760 వ్యక్తిగత మరియు గ్రామస్థాయి అర్జీలను (క్లైమ్స్) (ఉమ్మడి వనరులు) గుర్తించబడడమే కాకుండా, అవి డాక్యుమెంట్ చేయబడ్డాయి. 'బి' ఫామ్ క్రింద 239 ఉమ్మడి అర్జీలను సంస్థ ఫైలు చేయించింది. దీనికి సంబంధించి సమాచార హక్కు చట్టాన్ని (ఆర్.టి.ఐ.ను) ఉపయోగించుకోవడంపై ప్రజలలో అవగాహన కల్పించింది.

**1.3 అంతర్గత నిర్వాసితులకు న్యాయసహాయం :** చత్తీజ్‌ఘడ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లా నుండి మన రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాకు వలస వచ్చి, చింతూరు, చెర్ల, బూర్గుంపహాడ్, ములకలపల్లి, మణుగూరు, కుకునూరు మండలాల్లో ఆవాసాలను ఏర్పరచుకొన్న అంతర్గత నిర్వాసిత ఆదివాసీలకు సంస్థ గత ఐదు సంవత్సరాలుగా న్యాయసహాయం అందిస్తుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ పోలీసులు, అటవీశాఖ అధికారులు, స్థానిక ప్రజల నుండి ఎదురయ్యే దాడులు, ఇబ్బందుల నుండి కాపాడడానికి సంఘీభావ కమిటీలు, ఏర్పరచడం, మానవ హక్కుల సంఘాలను ఆశ్రయించి, తద్వారా వారికి రక్షణ కల్పించడం చేస్తుంది. దేశపౌరులుగా వారికి గల జీవించే హక్కు, ఆవాసహక్కు, ప్రభుత్వ సహాయాన్ని పథకాలను పొందే హక్కుల పరిరక్షణకు అన్నిరకాల న్యాయపరమైన చర్యలను తీసుకొంటుంది. ఐ.టి.డి.ఎ., ఐ.సి.డి.ఎస్., పి.హెచ్.సి. మొదలైన వ్యవస్థల ద్వారా విద్య, వైద్య సదుపాయాలు, నిత్యావసర వస్తువుల సరఫరా, కనీస ఆవాసం, ఉపాధిహామి వంటివి వీరికి కూడా అందేలా చూడడానికి న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగిస్తూ, ఎన్నో ఫలితాలను సాధించింది. (ఈ సమస్యకు సంబంధించి మరిన్ని వివరాలు ముందు అధ్యాయంలో చూడవచ్చు.)




**సమస్యలను అధికారులకు వివరిస్తున్న బాధితులు**

**1.4 మహిళా హక్కుల సాధన** : గిరిజనేతర మరియు గిరిజన పురుషుల చేతిలో మోసపోయిన మహిళలకు సంస్థ నాట్‌వాన్ సంఘం ద్వారా తగిన తక్షణ సహాయాన్ని అందించి, తరువాత అవసరమైన న్యాయసహాయాన్ని అందిస్తుంది. వారిచే న్యాయస్థానాల్లో కేసులు వేయిస్తుంది. అందుకు అవసరమైన సలహా, సహకారాలతో పాటు వారికి న్యాయవాదులను ఏర్పాటు చేస్తుంది. తద్వారా వారికి మనోవర్తిని లేక నష్టపరిహారాన్ని ఇప్పించడం, పెళ్ళి చేసుకొనేలా లేక కాపురానికి తీసుకొని వెళ్ళేలా చెయ్యడం లేక కోర్టు ద్వారా శిక్షలు వేయించడం చేస్తుంది. పురుషుల చేతిలో మోసపోయిన గిరిజన యువతులు గతంలో ఎక్కువ మంది మౌనంగా ఆ బాధను అనుభవించేవారే తప్పా, నోరు విప్పేవారు కాదు, కానీ ఇప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి సంస్థ సహకారంతో కోర్టుల్లో కేసులు వేసి, చాలా వరకూ న్యాయం పొందగలుగుతున్నారు.

**గత 5సం॥కాలంలో నాట్‌వాన్ సంఘం ద్వారా నడిపిన వివిధ రకాల మహిళా కేసుల వివరాలు**

| కేసు వివరము | 2007 | 2008 | 2009 | 2010 | 2011 | 2012 | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| భర్త వదిలేసిన కేసులు | 14 | 08 | 05 | 04 | 01 | 02 | 34 |
| కుల పంచాయితీ ద్వారా పరిష్కరించిన కేసులు | 06 | 03 | – | 02 | 01 | 02 | 14 |
| వివిధ సమస్యలపై కోర్టులో వేసిన కేసులు | 15 | 09 | 01 | 03 | 01 | – | 24 |
| మనోవర్తి పొందిన కేసులు | 04 | 05 | 04 | 04 | 02 | – | 19 |
| బాలికల హాస్టల్స్‌లో గుర్తించిన సమస్యలు | – | 02 | 03 | 04 | – | 01 | 10 |
| అమ్మాయిల వేధింపులు కేసులు/మోసం కేసులు | 08 | 02 | 04 | 03 | – | 01 | 18 |
| పోలీస్‌స్టేషన్‌లో వివిధ రకాల ఫిర్యాదులు | 10 | 03 | 08 | 04 | 03 | 02 | 30 |



**సమస్యలపై ఆదివాసీ యువతుల చర్చావేదిక**





## 2. సహజ వనరుల నిర్వహణ (NATURAL RESOURCE MANAGEMENT)

సంస్థ ఆదివాసీల జీవనోపాధికి, సంస్కృతీ సంప్రదాయాలకు ఆలవాలం, ఇంకా చెప్పాలంటే వీరి జీవన విధానంలోనే ఒక కీలక భాగమైన సహజ వనరుల నిర్వహణకు ఎంతో ప్రాధాన్యతను ఇవ్వడమే కాకుండా దీనిలో ఎంతో ప్రగతిని సాధించింది. వరద నివారణ కార్యక్రమం (డి.పి.ఎ.పి.) క్రింద వి.ఆర్.పురం మండలంలో ప్రజల సంపూర్ణ భాగస్వామంతో నీటివనరుల (వాటర్ టేబుల్) ను సమృద్ధిగా అభివృద్ధి చేసింది. **వాటర్‌షెడ్ కార్యక్రమం** క్రింద ఎంతో కృషి చేసింది.

**వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమం :** ఏదైనా ఒక వర్షాభావ ప్రాంతంలో భూఉపరితల జలవనరుల అభివృద్ధికి, వృక్ష, జంతు జాతుల పరిరక్షణ, పునరుద్ధరణ మరియు నిర్దిష్ట లబ్దిదార్ల ఆదాయ అభివృద్ధికి కృషి చేసే ఒక ఆదర్శవంతమైన కార్యక్రమమే వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కార్యక్రమం. దీని ఉద్దేశ్యాలు ప్రధానంగా నాలుగు

1. పంటలు మరియు పశుసంపదపై కరువు ప్రభావాన్ని సాధ్యమైనంత మేరకు తగ్గించడం.
2. ఏదైనా ఒక ప్రాంతాన్ని ఎడారి కాకుండా కాపాడడం.
3. పర్యావరణ సమతౌల్యాన్ని పెంపొందించడం.
4. గ్రామీణ ప్రజల ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడం.

**స్థానిక వాతావరణ పరిస్థితి :** ఇక్కడ వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమం ఎంతో అవసరం. ఎందుకంటే ఇక్కడ సగటు వార్షిక వర్షపాతం 1350 ఎం.ఎం. ఉన్నప్పటికీ కూడా, భూమి వాలు 40 ఎం. – 60. ఎం. మధ్య ఉండడం వల్ల తేమ నిలబడే అవకాశం తక్కువ. అలాగే నేల బాగా గట్టిగా వుండి, రాళ్ళతో కూడిన ఇసుక పొర ఉండడంవల్ల నీరు భూమిలోకి ఇంకకుండా సాధ్యమైనంత మేరకు వాలుకి, నదిలోకి పోతుంది. అలా పోయేటప్పుడు పైనున్న మట్టిపొరను కూడా నీటితో పాటు తీసుకొనిపోతుంది. అందువల్ల వర్షాకాలం తప్పించి, మిగిలిన కాలాల్లో ఇక్కడ సాగునీటి వసతికి అవకాశం లేదు. అవసరమైన సాగునీరు గొట్టపు బావులు (బోర్‌వెల్స్) ద్వారానో లేక మరొకదాని ద్వారానో అందించడం కూడా కొద్దికాలమే సాధ్యమవుతుంది. వర్షాకాలం తరువాత కేవలం నవంబరు నెల వరకూ మాత్రమే భూమిలో నీరు (తేమ) వుంటుంది.



ఈ పరిస్థితిని గమనించిన సంస్థ గత 15 సంవత్సరాలుగా ఖమ్మంజిల్లాలోని చాలా ప్రాంతాల్లో వాటర్‌షెడ్ కార్యక్రమాలను అమలుచేస్తుంది. ప్రస్తుతం నాబార్డు (NABARD) యొక్క డబ్ల్యు.డి.ఎఫ్. (WDF) కార్యక్రమం క్రింద, జిల్లా ప్రధాన కేంద్రానికి 160 కి.మీ. దూరంలో వున్న దుమ్ముగూడెం మండలంలో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తుంది. ఇక్కడ మొత్తం నాలుగు వాటర్‌షెడ్‌లు నడుస్తున్నాయి. అవి 1) మహాదేవపురం, 2) కమలాపురం, 3) చిన్నార్లగూడెం, 4) మరాయ్‌గూడెం. ఈ నాలిగింటి క్రింద మొత్తం ఆయకట్టు ప్రాంతం 5,407 హెకార్లు కాగా సి.బి.పి. క్రింద మొత్తం సాగవుతున్న ప్రాంతం 382 హెకార్లు.

వివిధ సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా అదనపు ప్రమాణాలను, నేలలో తేమ శాతాన్ని పెంచడంలో సంస్థకు తగినంత ప్రావీణ్యత వుంది. అలాగే కలపేతర అటవీవనరుల పునరుత్పత్తికి తోడ్పడడం, తద్వారా ఆదివాసీల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో సంస్థకు ఎంతో అనుభవం కలదు. ఈ కార్యక్రమం విషయంలో సంస్థ తన మానస పుత్రిక 4300 మందికి పైగా సభ్యులను కలిగి ఉన్న మహిళా సమాఖ్య 'నాట్‌వాట్ సంఘం' భాగస్వామ్యంతో గ్రామస్థాయిలో ఒక కీలక భూమిక వహిస్తుంది. ప్రత్యేకించి హక్కుల ప్రాతిపదికన (Right based) స్థానిక ప్రజలను అటవీవనరులపై హక్కుల సాధికారత దిశగా సంస్థ నడిపించ గలుగుతుంది.

**మహిళల పాత్ర :** అన్ని వాటర్‌షెడ్ కార్యక్రమాల్లోనూ మహిళా సంఘాలే కీలకపాత్ర నిర్వహిస్తున్నాయి. వానపాముల ఎరువు, ఇతర సేంద్రియ ఎరువులకు గుంటల త్రవ్వకం, వాటి నిర్వహణ, ఎరువు పంపిణీ నుండి పండ్లతోటల పెంపకానికి మొక్కల సరఫరా, పశుగ్రాసం కొరత నివారణకు రైతులకు గడ్డి విత్తనాలను పంచడం వరకూ అన్ని కార్యక్రమాల్లోనూ వీరు ఎంతో చురుగ్గా పాల్గొంటున్నారు. కార్యక్రమాలన్నీ కమిటీ ద్వారా నిర్వహింపబడతాయి.


మహిళ కమిటీ సమావేశము

**కమిటీ ఏర్పాటు :** ఆయాగ్రామాల్లోని కేవలం మహిళాసభ్యులతోనే ఈ కమిటీ రూపొందించబడింది. దీనిలో ఒకే ఆదివాసీ తెగకు చెందిన మొత్తం 16 గ్రామాల మహిళలు ఉన్నారు. ఇక్కడి వ్యవసాయం మరియు వ్యవసాయ అనుబంధ కార్యక్రమాల్లో ముఖ్యంగా ఆదివాసీ సముదాయాల్లో మహిళలే కీలకపాత్ర నిర్వహిస్తారు. కాబట్టి, మహిళల భుజాలపైనున్న ఈ భారాన్ని కొంత తగ్గించడం, కార్యక్రమంలో భాగంగా ఇతర బ్రతుకు తెరువు మార్గాలను పెంపొందించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచడమనేది సంస్థ యొక్క ఒక ప్రధాన ఉద్దేశ్యం. మహిళలతోనే కమిటీని ఏర్పరచడం వెనుక వ్యూహం కూడా ఇదే. గ్రామప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే ఒక ప్రాథమిక కార్యక్రమంగా దీన్ని రూపొందించడం, గ్రామ స్థాయిలో స్థానికులతో సహజవనరుల నిర్వహణా సంఘాలను నెలకొల్పడం, పొదుపు సంఘాలు, ఇతర పేదప్రజల సమాఖ్యలు ఏర్పాటు చేయడంతో పాటు మహిళల ఆరోగ్యం పెంపొందించడం, కాలుష్య నియంత్రణ, ఇంధన వనరుల ఆదా (ఉదా॥కు అనిల పొయ్యిల ఏర్పాటు) మొదలైన అనేక లక్ష్యాలు దీనిలో అంతర్గతంగా వున్నాయి. వాటర్‌షెడ్ సాధారణసభ (జనరల్‌బాడీ) కు ఈ కమిటీయే కార్యనిర్వాహక వర్గంగా వ్యవహరిస్తుంది. అలాగే కార్యక్రమ రోజువారీ పనులన్నింటినీ ఇదే చూస్తుంది. సంస్థ వాటర్‌షెడ్ బరువుబాధ్యతలు, అది నిర్వహించాల్సిన పాత్రపై కమిటీ సభ్యులకు మంచి శిక్షణనిచ్చి, ఈ కమిటీని గ్రామస్థాయిలో ఒక కీలకమైన వ్యవస్థగా నిలబెట్టగలిగింది.

లబ్ధిదార్ల స్పందన - 1

### నా బీడు భూమి సాగులోకి వచ్చింది

"మాది మహాదేవపురం, నా వయస్సు 52 సంవత్సరాలు. చాలాకాలంగా వ్యవసాయం చేస్తున్నాను. నాకు రోడ్డు ప్రక్కనే 3 ఎకరాల మెట్టభూమి ఉంది. దీనిలో ఒక అర ఎకరం జామాయిల్ (యూకలిప్టస్) చెట్లు వేసి, మిగిలింది ఖాళీగా వదిలిపెట్టేశాను. అయితే 2007లో సంస్థ ద్వారా మా ఊరికి వాటర్‌షెడ్ పనులు వచ్చాయి. శ్రమదానానికి పనులను ఎంపిక చేస్తున్నప్పుడు గ్రామస్థులు నా పొలాన్ని కూడా ఎంపిక చేశారు. ఖాళీగావున్న నా పొలంలో ఒక ఎమ్.పి.టి.ని తవ్వి, నా భూమికి నీటి సదుపాయం కల్పించాలనుకొన్నారు. ఏప్రియల్ 2008లో 60 మీటర్ల ఎమ్.పి.టి. తవ్వారు. దీంతో గత రెండేళ్ళనుండి నేను నా మొత్తం భూమిని సాగు చేసుకోగలుగుతున్నాను. గత సంవత్సరం ఒక అర ఎకరంలో వరి, మిగిలిన దానిలో ప్రత్తి వేసాను. బాగానే పండింది. సంస్థ పుణ్యమా అని ఇప్పుడు తిండి గింజలకు ఇబ్బంది లేదు. పత్తి ద్వారా నా అవసరాలకు సరిపడా డబ్బు కూడా వస్తుంది. నేను ఇప్పుడు కాస్త ధైర్యంగా బ్రతుకగలుతున్నాను".

**- మడలి పెంటయ్య**

**కార్యక్రమ అమలు దశలు :** నాలుగు దశల్లో ఈ కార్యక్రమం అమలవుతుంది. ఆయాదశలు, వాటి నిర్వహణను టూకీగా పరిశీలిద్దాం.

**1. అవసరమైన శ్రమదానం :** గ్రామస్థులు (లబ్ధిదారులు) ప్రతి ఒక్క కుటుంబం నుండి సగటున 4 గురు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా రూ. 25,75,000 విలువచేసే పనిని శ్రమదానం రూపంలో అందించాలి. వాటర్‌షెడ్‌ను అమలుచేసే ప్రాంతంలో కనీసం 75% మంది ప్రజలు స్వచ్ఛందంగా ఈ శ్రమదానంలో పాల్గొనడం తప్పనిసరి.

**2. నైపుణ్యాల అభివృద్ధికి నిధుల మంజూరు :** ప్రజలు సరిపడినంత శ్రమదానం చేసారని తనిఖీలో తేలిన వెంటనే వారి నైపుణ్యాలు లేక సామర్థాల పెంపు (Capacity Building) నకు అవసరమయ్యే నిధులు మంజూరు అవుతాయి. నిధుల జారీ అనేది సంబంధిత సంస్థల ప్రతినిధుల తనిఖీ, పర్యవేక్షణల ఆధారంగా జరుగుతుంది. కార్యక్రమం చేపట్టడానికి ప్రణాళిక తయారీ మరియు అమలు కొరకు కమిటీల ఏర్పాటు ఈ దశలోనే జరుగుతుంది. ప్రణాళికలోని వివిధ అంశాల ఆధారంగా కమిటీ సభ్యులకు వారి వ్యక్తిగత అభివృద్ధికి, అలాగే వాటర్‌షెడ్ పనుల నిర్వహణకు కావలసిన అనేక రకాల శిక్షణలు మరియు సమాచారం అందించబడతాయి.



ప్రత్యామ్నాయ ఆదాయ అభివృద్ధి

**3. పూర్తి అమలు దశ :** కమిటీల ఆధ్వర్యంలో వ్యక్తిగత, సమూహా (గ్రూపు), గ్రామ స్థాయిల్లో అభివృద్ధి ప్రణాళికలను గ్రామస్థులతో జరిపే వివిధ రకాల చర్చల ఆధారంగా రూపొందించి, వాటిని అమలు చేయడం జరుగుతుంది. దీనిపై ఆయా కమిటీ సభ్యుల, సంస్థ యొక్క పరవేక్షణ నిరంతరంగా ఉంటుంది. ఋణాల రూపంలో ప్రజలకు వ్యక్తిగతమైన, సమూహపరమైన తోడ్పాటు అందించబడుతుంది. నిధులు మొత్తం ప్రజా సంక్షేమం కొరకు మాత్రమే వినియోగించబడతాయి.

**4. కార్యక్రమం ముగింపు దశ :** కార్యక్రమం యొక్క కాలవ్యవధి పూర్తయ్యే నాటికి ప్రణాళికల్లో ప్రతిపాదింపబడిన పనులన్నీ పూర్తయ్యి ప్రత్యక్షంగా కళ్ళకు కనిపిస్తాయి. నిధుల వినియోగం, ఫలితాలు ప్రజల సమక్షంలో సమీక్షించబడతాయి.

✧ డి.ఆర్.డి.ఎ., డ్వామా (DWAMA) రెండింటి ఆర్థిక సహాయంతో సంస్థ మొత్తం 27 వాటర్ షెడ్లు నిర్మాణం చేపట్టి తద్వారా 13,500 హెక్టార్ల భూమిని సాగులోకి తెచ్చింది. ఈ ప్రాంతాల్లో సగటున భూగర్భజల మట్టం 4.7 మీటర్లు పైకి పెరిగినట్లుగా గుర్తించబడింది.

✧ వాటర్‌షెడ్ ప్రాంతం చుట్టూ కిత్తనార (Agave) మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా భూమి కోత నివారణకు కృషి చేయడమే కాకుండా, లబ్ధిదార్లుకు ఏటా రూ. 1000/– నుండి 5000/– అదనపు ఆదాయం సమకూరేలా చేసింది.

✧ వాటర్‌షెడ్ కార్యక్రమం సక్రమంగా అమలుపరచేందుకు ప్రాంతాల వారీగా గ్రామ స్థాయిలో నాయకులను (కమ్యూనిటీ లీడర్స్) తయారు చేసింది. ఆ తరువాత వీరే ఆయా ప్రాంతాలకు ప్రతినిధులుగా ఎంపిక అయ్యారు.



అనిల పొయ్యిలపై అవగాహన

లబ్ధిదార్ల స్పందన - 2

**మారిన పంట విధానం**

**"నా పేరు పర్మిక చిట్టిబాబు.** ఖమ్మంజిల్లా, దుమ్ముగూడెం మండలం, కమలాపురం శివారు గ్రామం వర్సవారి గూడెం. వయస్సు 40 సంవత్సరాలు. నాకు ఇదే గ్రామంలో 3 ఎకరాల మెట్ట భూమి ఉంది. దీనిలో కేవలం వర్షాధారంపై నువ్వులు, కందులు, జొన్నలు వంటి మెట్ట పంటలు పండించేవాడిని. సంవత్సరాల తరబడి పండిస్తున్నా, తగిన నీటి వసతిలేక అంతగా దిగుబడి, ఆదాయం వచ్చేవి కాదు. కార్యక్రమంలోని కెపాసిటీ బిల్డింగ్ దశలో (డిశెంబర్ 2009లో) నా పొలంలో ఒక సాగు నీటి చెరువు / కుంట (15/20 sqm) త్రవ్వాము. దీంతో నేను పంట రకాలను మార్చుకొన్నాను. ఇప్పుడు ఒక ఎకరాలో వరి, మిగిలిన భూమిలో కంది, జొన్న సాగుచేస్తున్నాను. ఫలితంగా కుటుంబం అంతటికీ సరిపడా తిండి గింజలు పొందగలుగుతున్నాను. కొంత ఆదాయాన్ని కూడా పెంచుకోగలిగాను. ఈ ఫామ్ పాండ్‌తో నా పంట రకాలు, నా తలరాత రెండూ మారాయి".

**చేపట్టిన పనులు :** ఈ కార్యక్రమం క్రింద చేపట్టబడిన వివిధ రకాల పనులు, ముఖ్యాంశాలను పరిశీలిద్దాం.

| | యూనిట్లు | మహాదేవపురం | చిన్నార్లగూడెం | కమలాపురం | మరాయ్‌గూడెం |
|---|---|---|---|---|---|
| దీని క్రింద లబ్ధిపొందిన కుటుంబాలు | సంఖ్య | 435 | 292 | 387 | 622 |
| గట్లువేయడం పూర్తయిన క్రొత్తపొలాలు (NFB/TCB) | సి.యు.ఎం. | 7796 | 12375 | 8533 | 3024 |
| రాతికట్టడాలు (Stone Outlets) SGP, RFD | సంఖ్య | 17 | 13 | 13 | 46 |
| పెబల్ బండ్ (PB) | సి.యు.ఎం. | 0 | 0 | 0 | 1654 |
| సాగుబడి చెరువులు (FP) | సంఖ్య | 14 | 8 | 9 | 17 |
| మిని పెర్క్యులేషన్ టాంక్స్ (MPT) | సంఖ్య | 16 | 19 | 12 | 10 |
| అటవీ పెంపకం (Artificial Bund Plantation) | సంఖ్య | 2179 | 2157 | 2735 | 2478 |
| డ్రైలాండ్ హార్టికల్చర్ (DH) | సంఖ్య | 2035 | 3144 | 2145 | 2050 |
| నాటిన కిత్తనార అంట్లు (Agave Slips) | సంఖ్య | 3000 | 2400 | 2040 | 1200 |
| వేరువేరు చోట్ల చల్లిన గడ్డి విత్తనాలు (GS) | కేజీలు | 245 | 116 | 257 | 98 |
| వానపాము ఎరువుకు (వర్మీకంపోస్టు) త్రవ్విన గుంటలు | సంఖ్య | 9 | 9 | 9 | 9 |
| చేపల చెరువులు | సంఖ్య | 2 | 0 | 0 | 0 |
| బైరొడ్లు (Birodlu) పంపిణీ చేయబడిన కుటుంబాలు | సంఖ్య | 4 | 0 | 0 | 0 |
| కూరగాయల పెంపకం యూనిట్లు | సంఖ్య | 20 | 20 | 20 | 25 |
| పెరటి తోటల పెంపకం యూనిట్లు | సంఖ్య | 100 | 280 | 200 | 100 |
| శ్రీవరి సాగు చేసిన కుటుంబాలు | సంఖ్య | 4 | 0 | 0 | 0 |
| జీవనోపాధి (Livelihood) కొరకు ఇచ్చిన ఋణాలు | రూ. లక్షల్లో | 18.83 | 12.9 | 9.13 | 6.1 |
| పంపిణీ చేయబడిన పొగరాని పొయ్యిలు | సంఖ్య | 200 | 65 | 0 | 0 |
| పశువుల పెంపకం చేపట్టిన కుటుంబాలు | సంఖ్య | 3 | 2 | 2 | 4 |
| **శిక్షణలు :** | | | | | |
| తాటాకు అల్లికలపై ఏర్పాటు చేసిన శిక్షణలు | సంఖ్య | 5 | 5 | 5 | 7 |
| తాటిపీచు వినియోగంపై శిక్షణలు | సంఖ్య | 5 | 5 | 5 | 7 |
| పూలతోటల పెంపకంపై శిక్షణలు | సంఖ్య | 2 | 2 | 2 | 2 |

**తాటాకు అల్లికలు మరియు మార్కెటింగ్‌పై శిక్షణ**





**2.1 తోటల పెంపకం :** తూర్పుగోదావరి జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాలైన మారేడుమిల్లి, రంపచోడవరం చుట్టుప్రక్కల భూములు నిమ్మజాతి (సిట్రస్) మొక్కల పెంపకానికి చాలా అనుకూలం. గత 20-30 సంవత్సరాలుగా ఇక్కడి ఆదివాసీ కుటుంబాలు వీటిని సాగు చేస్తూ తమ పంటను వ్యాపారస్థులకు అమ్ముకొంటున్నారు. అయితే ఇది సీజనల్ పంట కావడం వల్ల పంటకాలం ముగిసిన తరువాత వీరికి వేరే జీవనాధారం ఏమీ లేకుండా పోవడమే కాకుండా, ఇవి చాలా కాలం క్రితం నాటినవి కావడం వల్ల దిగుబడి కూడా అంతకంతకూ తగ్గిపోవడం కూడా ఒక సమస్య అయ్యింది. సమస్యకు పరిష్కారంగా ఈ ఆదివాసీ కుటుంబాలకు సుస్థిరమైన, నిరంతర ప్రయోజనాన్ని సమకూర్చడంలో వాడి (WADI) పద్ధతి ఒక మంచి ప్రత్నామ్నాయంగా పనికి వస్తుందని సంస్థ గుర్తించడమైంది.


మొక్కల పంపిణి

ఫలితంగా సంస్థ ఈ రకం తోటల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. దీని క్రింద మొత్తం 325 కుటుంబాలు ప్రయోజనం పొందాయి. తొలిదశలో నాటిన 175 ఎకరాల్లో నిమ్మ మరియు ఉసిరి జాతి తోటల పెంపకంతో పాటు చుట్టూ సరిహద్దు గట్లపైన గమ్‌కరయా మొక్కల పెంపకాన్ని, అలాగే మలిదశలో 150 ఎకరాల్లో మామిడి, జీడిమామిడి తోటలతో పాటు చుట్టూ గట్లపై గమ్‌కరయా, కిత్తనార (Agave) మొక్కల పెంపకాన్ని స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి సంస్థ ప్రోత్సహించింది. 17 గ్రామాల్లో నాలుగు రకాల పండ్లతోటలను, ఒక్కొక్క రకం 300 మొక్కలు చొప్పున పంపిణీ చేసింది.

**2.2. విత్తన బ్యాంకులు**

విత్తనాలను కొనుక్కుని నాట్లు వేసుకొనగలగే ఆర్థిక స్థోమతలేని ఆదివాసీ రైతులకు విత్తన సహాయం అందించాలన్నది సంస్థ ఉద్దేశ్యం. వీరిలో స్పాన్సర్‌షిప్ పిల్లల తల్లిదండ్రులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. వీరిలో చాలామంది రైతులు ఎన్.పి.ఎం. (పురుగుమందులు వాడని వ్యవసాయం) పద్ధతిని ఎక్కువగా అవలంభిస్తున్నారు. సంప్రదాయబద్ధమైన, విలువైన స్థానిక రకాలకు చెందిన విత్తనాలను రక్షించుకోవడం, విత్తన కొరతను నివారించడం, మంచి విత్తనాలు అందుబాటులోకి తేవడం లాంటివి ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యాలు. 10 కొండరెడ్డి గ్రామాల్లో సంస్థ విత్తన బ్యాంకులు ఏర్పాటు చేసింది. వీటిలో నాలుగు రకాల విత్తనాలు నిల్వ చేయబడ్డాయి. అవి 1. జొన్నలు, 2. మినుములు 3. పెసలు, 4. నువ్వులు. వీటి సేకరణ, నిల్వ, పంపిణీ, వసూలు మొదలైన కార్యక్రమాలన్నీ గ్రామస్థాయి కమిటీలు నిర్వహిస్తాయి.


విత్తన పంపిణి

**2.3 రసాయనిక పురుగు మందులు వాడని (ఎన్.పి.ఎం.) సుస్థిర వ్యవసాయము :**

ప్రస్తుత వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారమార్గంగా గత కొంతకాలంగా సంస్థ ఈ సుస్థిర వ్యవసాయ పద్ధతిని గ్రామాల్లో బాగా ప్రచారం చేసి, ప్రోత్సహిస్తుంది. గతంలో ఈ ప్రాంతంలో రైతులు భారీస్థాయిలో విచక్షణారహితంగా పురుగుమందులు, రసాయనిక ఎరువులు వాడటం వలన పెట్టుబడులు పెరిగి, తగు దిగుబడులు రాక అది రైతు ఆత్మహత్యలకు దారితీసింది. పురుగుమందుల విషప్రభావం వలన పర్యావరణ కాలుష్యం జరుగి, అనారోగ్యం పెరిగిపోయింది. సహజంగా కోట్లాది సూక్ష్మజీవులు, వానపాముల (ఎర్రలు)ను కలిగివుండే జీవనేల ఈ రసాయనాల వలన నిర్జీవంగా మారింది. నిజానికి భూమిలో కావలసిన అన్నిరకాల పోషకాలు సూక్ష్మజీవుల ద్వారా అందుబాటులో వుంటాయి. మొక్కలకు బయటి నుండి వేరే



ఎన్.పి.ఎమ్.పై రైతులకు శిక్షణ

పోషకాలను అందించవలసిన అవసరం లేదు. పురుగుమందులు, ఎరువులకు అధికంగా పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేకుండా, కేవలం ఒక ఆవు సహాయంతో 30 ఎకరాల సుస్థిర వ్యవసాయాన్ని సాగు చేయవచ్చు. దీనినే ఎన్.పి.ఎం. పద్ధతి అంటాము.

ఆవుపేడ, ఆవు మూత్రంలో అనేకరకాల సూక్ష్మజీవులు వున్నాయి. ఇవి మొక్కకు కావలసిన అన్నిరకాల పోషకాలతో పాటు, రోగ నిరోధకశక్తినిచ్చి క్రిమి సంహారిణులుగా పనిచేస్తాయి. పేడ ఎంత తాజాగా వుంటుందో అంత ఎక్కువగా ఫలితముంటుంది. అలాగే గోమూత్రం ఎంత పాతదిగా వుంటుందో దాని ప్రభావం అంత ఎక్కువగా ఉంటుంది. పెట్టుబడి లేకుండా సహజ వనరులను ఉపయోగించి చేయబడే ఈ సుస్థిర వ్యవసాయం. 3 అంశాలపై ఆధారపడి వుంటుంది.

**1. భూసారాన్ని పెంచడం :** పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులు, జీవ ఎరువులు, ద్రవ, ఘన, జీవామృతం వాడటం, చెరువు మట్టి తోలటం, అంతర పంటలు పండించడం ద్వారా సూక్ష్మజీవులను అభివృద్ధి పరచుట

**2. ఆచ్ఛాదన (మల్చింగ్) :** ఎ) మృధాచ్ఛాదన (దున్నుట), బి) కాష్టాచ్ఛాదన (పంట వ్యర్థాలతో కప్పడం), సి) సజీవ ఆచ్ఛాదన (మిశ్రమ పంటలు, అంతర పంటలు, పలు అంతస్తుల పంటలు) ల ద్వారా సూక్ష్మజీవులను రక్షించడం.

**3. సహజవనరులతో కషాయాల తయారి :** నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం, బీజామృతం, పుల్లటి మజ్జిగ, సొంటి పాలకషాయాలతో చీడపీడల నివారించడం అనేవి ఎన్.పి.ఎం. పద్ధతిలో ప్రధానమైన అంశాలు.

పురుగు మందులు వాడని ఈ వ్యవసాయ విధానంపై చదువుకొనే పిల్లలలో అవగాహన కల్పించడానికి 5 హాస్టల్స్‌లో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి 450 విద్యార్థినులకు ఈ


**రైతు అభిప్రాయం**

“గత సంవత్సరం ఐ.టి.డి.ఎ. నుండి రాయితీపైన విత్తనాలు తీసుకొన్నాము. వారు సీజన్ అయిపోయిన తరువాత విత్తనం ఇచ్చారు. వీటికి టౌను నుండి పురుగుమందులు, ఇతర రసాయనాలను తెచ్చి వాడాల్సి వచ్చింది. వీటి ఖరీదు, రవాణా అన్నీ కలసి చాలా ఖర్చు అయ్యింది. పెట్టుబడి కూడా రాక నష్టపోయాము. ఇలాంటి అనుభవాలు ఇంతకు ముందు కూడా చాలా ఉన్నాయి.

కానీ ఈ సంవత్సరం మా పొలం నుండి ఎక్కువ దిగుబడి సాధించాము. అందుకు కారణం ఈ సంవత్సరం సంస్థ దేశవాళి (స్థానిక) విత్తనాన్ని అదునుకు (సరియైన సమయంలో) అందించడం, అలాగే పురుగు మందులు వాడాల్సిన అవసరంలేని వ్యవసాయ పద్ధతి (NPM) పై మాకు శిక్షణ ఇవ్వడంతో పాటు మమ్మల్ని తీసుకువెళ్ళి ప్రత్యక్షంగా చూపించడం కారణం. ఫలితంగా ఈ సంవత్సరం ఖర్చు తక్కువ అయ్యింది, గతంలో ఎప్పుడూ లేనంత దిగుబడి వచ్చింది. వీరు స్పాన్సర్ చేసిన మా బిడ్డ కూడా తనకు ఖాళీ వున్నప్పుడల్లా ఈ చేలో కలుపు తీయడం, ఇతర పనులు చేసేది”.

**– సోడే నాగులు,** వాల్మూరుగొంది గ్రామం

**ఎన్.పి.ఎమ్. రైతు (రామిశెట్టి, వాల్మూరుగొంది)**



## సేంద్రియ వ్యవసాయ విధానం (NPM) లో వాడే ఎరువులు మరియు పురుగు మందులు

**బీజామృతం :** – ఇది విత్తనశుద్ధి మరియు భూమి నుండి వ్యాపించే అన్నిరకాల తెగుళ్ళ నివారణకు ఉపకరిస్తుంది. 5 కిలోల ఆవుపేడను పలుచటి గుడ్డలో మూటకట్టి 200 లీటర్ల నీటిలో వేలాడ దీయాలి. ఇందులో 5 లీటర్లు ఆవు మూత్రం, 50 గ్రా॥ సున్నం కలిపి, 12 గంటల వరకు అలాగే వుంచాలి. రోజుకు 2 సార్లు కర్రతో కలపాలి. బీజామృతం తయారవుతుంది. విత్తడానికి సిద్ధంగా వున్న విత్తనాలపై బీజామృతాన్ని చల్లి నీడలో ఆరబెట్టిన తరువాత విత్తుకొంటే, విత్తనం బాగా మొలకెత్తుతుంది. విత్తనం నుండి సంక్రమించే వ్యాధులను ఇది నియంత్రిస్తుంది. అరటిపిలకలను లేదా చెఱుకు కణుపులను వరి, ఉల్లి, మిరప, టమాటో, వంగ మొదలైన విత్తనాలను బీజామృతంలో ముంచి నాట్లు వేసుకోవచ్చు.

**ఘన జీవామృతం :** పంటకు కావలసిన అన్ని సూక్ష్మ మరియు స్థూల పోషకాలనిస్తుంది. ఆవుపేడ 10 కిలోలు, గోమూత్రం తగినంత, బెల్లం 2 కిలోలు, పప్పుదినుసుల పిండి 2 కిలోలు, గుప్పెడు పొలం గట్టు చివరి మట్టి లేదా అడవి మట్టిని సేకరించి, వీటిపై కొద్దికొద్దిగా ఆవుమూత్రాన్ని చల్లుతూ, ఈ మిశ్రమాన్ని ముద్దలుగా తయారు చేసుకొంటే అదే ఘనజీవామృతం. ఈ మిశ్రమాన్ని నీడలో పలుచగా పరచి 7 రోజులు ఎండబెట్టాలి. ఇది 6 నెలల వరకు నిల్వ ఉంటుంది. 20 కిలోల ఘనజీవామృతాన్ని 100 కిలోల మాగిన పశువుల పేడతో కలిపి దుక్కిలో వేసుకోవాలి. 1–2 నెలల తరువాత పైపాటుగా ఘనజీవామృతం కలిపిన పశువుల పేడను సాళ్ళ మధ్యలో వేసుకోవాలి.

**ద్రవ జీవామృతం :** పంటకు కావలసిన అన్ని సూక్ష్మ మరియు స్థూలపోషకాల కొరకు ఆవుపేడ 10 కిలోలు, గోమూత్రం 10 లీటర్లు, బెల్లం 2 కిలోలు, గుప్పెడు పొలం గట్టు చివరి మట్టి లేదా అడవి మట్టిని 200 లీటర్ల నీటిలో వేసి కర్రతో రోజు 3–4 సార్లు కలుపుతూ, ఈ ద్రావణాన్ని 4 రోజులు పులియబెట్టి ఎకరం పొలానికి వాడవచ్చు. నీటి కాల్వలలో కలిపి లేదా డ్రిప్ ద్వారా దీన్ని వాడవచ్చు. పైరు మీద ప్రతి 15 రోజులకు పిచికారి చెయ్యవచ్చు. నెల పైరుకు 5 లీటర్లు 2 నెలలు పైరుకు 10 లీటర్లు, 3 నెలల పైరుకు 15 లీటర్లు చొప్పున పిచికారి చేయాలి.

**నీమాస్త్రం :** రసం పీల్చే మరియు ఇతర చిన్న చిన్న పురుగుల నివారణ కొరకు 10 కిలోలు వేపాకును మెత్తగా రుబ్బి 200 లీటర్ల నీటిలో (ప్లాస్టిక్ డ్రమ్ము / ఇనుప డ్రమ్ము / సిమ్మెంట్ డ్రమ్ము) కలిపి, దానికి 10 లీటర్ల గోమూత్రం కలపాలి. ఇందులో 2 కిలోల ఆవుపేడను వేసి కర్రతో బాగా కలియబెట్టి 48 గంటల వరకు డ్రమ్మును మూసి వుంచాలి. రోజు మూడుసార్లు (ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం) కర్రతో దీన్ని కలుపుతూ ఆ తరువాత పలుచని గుడ్డతో వడగట్టాలి. ఇలా తయారయిన నీమాస్త్రాన్ని పంట మీద చల్లుకోవాలి. ఈ విధంగా 2–3 సార్లు ఎకరానికి 200 లీటర్ల చొప్పున తయారు చేసుకొని పంట విత్తిన 20 రోజులకు, 45 రోజులకు, 60 రోజులకు చల్లుకుంటే, అన్నిరకాల పురుగుగుడ్ల, తెగుళ్ళ నివారణకు ముందు జాగ్రత్త చర్యగా బాగా పనిచేస్తుంది.

**బ్రహ్మాస్త్రం :** పెద్ద పెద్ద పురుగుల నివారణ కొరకు వేపాకులు 3 కిలోలు, సీతాఫలాకులు 2 కిలోలు, ఆముదం ఆకులు 2 కిలోలు, గానుగాకులు 2 కిలోలు, అత్తాకోడలు/కత్తెరాకులు 2 కిలోలు, బొప్పాయి ఆకులు 2 కిలోలు, ఉమ్మెత్తాకులు 2 కిలోలు, జామాకులు 2 కిలోలు, కాకరాకులు 2 కిలోలు, వయ్యారిభామ (పార్థీనియం) 2 కిలోలు వీటిలో ఏవైనా 5 రకాల ఆకులను తీసుకొని విడివిడిగా మెత్తగా నూరి, ఒక పాత్రలో 10–15 లీటర్ల గోమూత్రం తీసుకుని అందులో ఇవి కలపాలి. ఈ మిశ్రమాన్ని కర్రతో కలిపి ఆ తరువాత పాత్రపై మూతపెట్టి బాగా ఉడికించాలి. (5 సార్లు పొంగు వచ్చే వరకూ) ఆ తరువాత పాత్రను కిందకు దించి 48 గంటల వరకు చల్లారనివ్వాలి. ఈ బ్రహ్మాస్త్రాన్ని ఆరునెలల వరకు నిల్వ ఉంచవచ్చు. దీన్ని ఎకరానికి 2 లేక 2.5 లీటర్లు, 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**అగ్ని అస్త్రం :** కాండం తొలచు, కాయ తొలుచు మరియు ఇతర తొలుచు పురుగుల నివారణ కొరకు ఒక మట్టికుండలో 10–15 లీటర్ల గోమూత్రం తీసుకుని, అందులో ఒక కిలో పొగాకు ముద్ద, 5 కిలోల వేపాకుల ముద్ద, 1/2 కిలో పచ్చిమిర్చి ముద్ద, 1/2 కిలో వెల్లుల్లి ముద్ద వేసి పాత్రపైన మూతపెట్టి 4 సార్లు పొంగు వచ్చేవరకు బాగా ఉడికించి, తరువాత పాత్రను క్రిందకు దించి 48 గంటలు చల్లారనివ్వాలి. చివరగా దీన్ని ఒక గుడ్డతో వడగట్టి ఒక డబ్బాలో వేసి 3 నెలల వరకు నిల్వ వుంచవచ్చును. అవసరమైనప్పుడు ఎకరానికి 2–3 లీటర్ల ఈ అగ్నిఅస్త్రం, 100 లీటర్ల నీటిలో (6 ఒంపులు) కలిపి పంటపై పిచికారి చేయాలి.

**పుల్లటి మజ్జిగ :** అన్నిరకాల ఆకుమచ్చ, కాయమచ్చ, బూజు తెగుళ్ళు నివారణ కొరకు ఎకరానికి 100 లీటర్ల నీళ్ళలో 6 లీటర్ల పుల్లటి (3రోజుల పాటు పులిసిన) మజ్జిగను కలిపి పంటపై పిచికారి చెయ్యాలి. పుల్లటి మజ్జిగ బదులుగా 2 లీటర్ల కొబ్బరినీళ్ళు ఉపయోగించవచ్చు. పుల్లటి మజ్జిగ అన్నిరకాల తెగుళ్ళ నివారణలో ఉపయోగపడుతుంది. ముందు జాగ్రత్త చర్యగా పంట వేసిన 20 రోజులకు, 45 రోజులకు దీన్ని చల్లాలి.

**సొంటిపాల కషాయం :** అన్నిరకాల తెగుళ్ళ నివారణ కొరకు మెత్తగా పొడిచేసిన సొంటి 200 గ్రాములు, 2 లీటర్ల నీటిలో కలిపి, అది 1 లీటరు అయ్యేటట్లుగా మూతపెట్టి మరిగించాలి. తరువాత చల్లార్చాలి. మరొక గిన్నెలో 5 లీటర్ల పాలు/మజ్జిగ వేసి ఒక పొంగు వచ్చేవరకు మరిగించి చల్లార్చాలి. రెంటినీ కలిపితే సొంటిపాల కషాయం తయారవుతుంది. ఇది నిల్వ ఉండదు, తయారుచేసిన రోజే వాడుకోవాలి. ఇలా తయారయిన సొంటి పాల కషాయాన్ని 200 లీటర్ల నీటిలో కలుపుకొని (13 ఒంపులు) ఒక ఎకరం పంటపై చల్లుకోవాలి.

**టానిక్ :** గింజ బరువు సుమారు 20 శాతం పెరగటానికి, నాణ్యత, మెరుపు రావడానికి ఇది పనికొస్తుంది. నువ్వులు 100 గ్రాములు, పెసర్లు 10 గ్రాములు, మినుములు 100 గ్రాములు, బొబ్బర్లు 100 గ్రాములు, కందులు 100 గ్రాములు, శెనగలు 100 గ్రాములు, గోధుమలు 100 గ్రాములు తీసుకొని, ముందుగా నువ్వులను ఒక పాత్రలో 12 గంటలు నానబెట్టాలి. నువ్వులు నానిన తరువాత మిగతా 6 రకాల గింజలను కలపాలి. గింజలు మునిగే వరకు నీరు పోసి 12 గంటలు నానబెట్టాలి. మొలకెత్తిన గింజలను గుడ్డలో కట్టి, రెండు అంగుళాల మొలకలు వచ్చే వరకు గుడ్డలో వుంచాలి. తరువాత మొలకెత్తిన గింజలను అన్నింటిని కలిపి మెత్తగా రుబ్బాలి. ఒక పాత్రలో 200 లీటర్ల నీటిని తీసుకోవాలి. ఇందులో మెత్తగా రుబ్బిన మొలకల ముద్దను కలపాలి. 10 లీటర్ల ఆవు / గేదె మూత్రం కలపాలి. పాత్రపై గోనెసంచి కప్పి 24 గంటలు పులియనివ్వాలి. రోజుకు 2 సార్లు కర్రతో కలపాలి. టానిక్ తయారవుతుంది. ఈ విధంగా తయారుచేసిన టానిక్‌ను ఎకరానికి (200 లీటర్లు) ఎలాంటి నీరు కలపకుండా యదావిధిగా పిచికారి చేసుకోవాలి.

(సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కొరకు సంస్థ ప్రచురించిన కరపత్రం)

## 2.4 పశువుల పెంపకం :



వ్యవసాయానుబంధమైన పాడి పరిశ్రమ అభివృద్ధితో పాటు, ప్రత్యామ్నాయ ఆదాయ వనరులను సమకూర్చడంలో కీలకపాత్ర పోషించే వివిధ రకాల పెంపుడు జంతువుల అభివృద్ధికి కూడా సంస్థ కృషి చేస్తుంది. ముఖ్యంగా గొర్రెలు, మేకలు, కోళ్ళు వంటి వాటి పెంపకానికి అవసరమైన ఆర్థిక తోడ్పాటును అందించడమే కాకుండా, వాటిని రోగాలబారి నుండి కాపాడడానికి వైద్య సదుపాయాలను అందించడం, ముందు జాగ్రత్త చర్యగా తరచూ ఉచిత పశు వైద్య శిబిరాలను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసి వ్యాధి నిరోధక టీకాలను, మందులను సరఫరా చేస్తుంది.

## 2.5 అటవీ ఉత్పత్తుల యాజమాన్యం :

ఆదివాసీ కుటుంబాలకు కలపేతర అటవీ ఉత్పత్తుల (ఎన్.టి.ఎఫ్.సి.) సేకరణ మరియు అమ్మకం ద్వారా సమకూరే ఆదాయం ఒక ప్రధాన జీవన మార్గం. అయితే అస్థిరమైన సేకరణ పద్ధతులు, అస్థవస్థమైన మార్కెట్, వనరుల పునరుద్ధరణపై అవగాహన రాహిత్యం అనేవి దీనికి సంబంధించి వీరు ఎదుర్కొనే ముఖ్య సమస్యలు.

ఆనాడు గిరిజన సహకార సంస్థ (జి.సి.సి.) నేరుగా ఆదివాసీల నుండి గిట్టుబాటు ధరకు ఎన్.టి.ఎఫ్.పి.ని సేకరించి, దళారుల నుండి వారిని రక్షించడమే కాకుండా, వీటిని తిరిగి అమ్మడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని అదే ఆదివాసీల అభివృద్ధికి వినియోగించాలన్న ఒక కీలకమైన లక్ష్యంతో నెలకొల్పబడింది. అయితే విధి నిర్వహణలోని పరిమితులు, వ్యవస్థీకృతమైన లోపాల కారణంగా ఈ లక్ష్యం నెరవేరలేదు. దీంతో దళారీల దోపిడి కొనసాగుతున్నది.



ఇటువంటి పరిస్థితుల్లో ఎ.ఎస్.డి.ఎస్. ప్రాథమిక కార్యక్రమాల్లో అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం ఒకటయ్యింది. ఎన్నో ఫలితాలను కూడా సంస్థ సాధించింది. ఎఫ్.డి., జి.సి.సి., వెలుగు, ఐ.టి.డి.ఎ. వంటి సంబంధిత ప్రభుత్వ సంస్థలన్నింటినీ ఒక త్రాటిపైకి తెచ్చింది. జి.సి.సి. యాజమాన్యం మరియు ఎన్.టి.ఎఫ్.పి. సేకరణదారుల మధ్య బహిరంగ చర్చకు ఒక ఉమ్మడి వేదికను ఏర్పరిచింది. దీని వల్ల జి.సి.సి. పనితీరులో కొన్ని అనుకూల మార్పులు వచ్చాయి. సంస్థ ఒత్తిడితో ఆయా సంతల్లో చిన్నతరహా, కలపేతర అటవీ ఉత్పత్తుల సేకరణ మరియు అమ్మకాలను నమోదు చేయడానికి, అవకతవకలను నియంత్రించడానికి అది వాలంటీర్లను ఏర్పాటు చేసింది. ఈ ప్రయోగానికి ఎంతో ఆదరణ లభించడం వల్ల, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం మరియు ప్రకాశం జిల్లాల్లో కూడా అధికార్లు ఈ విధానం అమలుకు ప్రయత్నించారు. కలపేతర అటవీ ఉత్పత్తులపై పనిచేస్తున్న ఇతర కేంద్రాలకు ఈ విషయమై ఎ.ఎస్.డి.ఎస్. కొన్ని శిక్షణలు కూడా నిర్వహించింది.

### సంస్థ గతంలో సాధించిన కొన్ని ఫలితాలు :

తూనికలు తనిఖీ చేస్తున్న వాలంటీర్



- ✿ వివిధ రకాల కలపేతర అటవీ ఉత్పత్తుల ధరలు, ఇతర వివరాలను జి.సి.సి. తన ప్రచురణలు, ఇతర మార్గాల ద్వారా ఆయా సంతల్లోనూ, గ్రామాల్లోనూ విస్తృతంగా ప్రచారం చేసేటట్లు చేసింది.
- ✿ జి.సి.సి.చే నిర్దేశించబడిన ప్రమాణాల మేరకు, సరియైన ధరలు చెల్లించబడేలా, సేకరణ ప్రక్రియ మొత్తం ఒక క్రమపద్ధతిలో నడిచేలా చూసేందుకు 11 సంతల్లో 11 మంది వాలంటీర్లు నియమింప బడ్డారు. దీని వల్ల సేకరణ బాగా పెరిగింది, ఉత్పత్తుల నాణ్యత కూడా

మెరుగుపడింది. దళారీల బెడద చాలావరకూ తగ్గింది.

- ఫలితంగా 2004వ సంవత్సరంలోనే ఎన్.టి.ఎఫ్.పి. సేకరణ విలువ దాదాపుగా ఒక కోటి రూపాయల వరకూ పెరిగింది.
- గ్రామస్థాయిల్లోనూ, ఆశ్రమ పాఠశాలల్లోనూ పిల్లల(వీరు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారని)కు శిక్షణలు మరియు సమావేశాలు నిర్వహించడం వల్ల సేకరణదారుల సంఖ్య, నాణ్యత మెరుగైంది.
- గమ్‌కరయా చెట్ల పెంపకంపై చేసిన విస్తృత ప్రచారం మూలంగా 11 గ్రామాల్లో 51 ఎకరాల్లో రైతులు వీటిని నాటారు.



ఎన్.టి.ఎఫ్.పి.పై శిక్షణ

- మట్టపల్లి గ్రామంలో విప్ప నూనె తీసే మిల్లు ఒకటి సంస్థ ద్వారా ఏర్పాటైంది. దీని వల్ల 318 కుటుంబాలు లబ్ధి పొందాయి. ఆ తరువాత మరో రెండుమిల్లులను అటవీ శాఖ (ఎఫ్.డి.) ప్రారంభించింది. ఈ నిర్మాణ ప్రక్రియ మొత్తాన్ని పర్యవేక్షించే బాధ్యతను సంస్థకు అప్పగించింది.
- సంప్రదాయంగా ఎప్పటి నుండో తేనె సేకరణపై ఆధారపడి బ్రతుకుతున్న 40 కొండరెడ్డి కుటుంబాలకు 360 తేనె తయారీ పెట్టెలను సంస్థ పంచి పెట్టింది.

**ప్రస్తుత కార్యక్రమాలు :**

గతంలో చేపట్టిన ఈ కార్యక్రమాలన్నింటిని సంస్థ ఎప్పటికప్పుడు అవసరమైన మార్పులు చేర్పులతో నేటికీ కొనసాగిస్తుంది. వీటిని మరింత అభివృద్ధిపరచడానికి గత ఐదు సంవత్సరాలుగా అనేక సలహా సహాయక కార్యక్రమాలు, శిక్షణలు నిర్వహిస్తూనే వుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి గ్రామస్థాయిలో కమిటీల రూపంలో ఒక సుస్థిర యంత్రాంగాన్ని అభివృద్ధి చేసింది. సంస్థ ప్రతినిధులు ఆయా కమిటీలతో నిరంతరంగా సంబంధాలను కొనసాగిస్తూంటారు. ప్రాజెక్టులతో సంబంధం లేకుండా సంస్థ నిరంతరంగా కొనసాగించే కార్యక్రమాల్లో ఇది ఒకటని చెప్పాలి.



పర్యావరణ దినోత్సవం



మొక్కల పెంపకం





## 3. మహిళా సాధికారత (WOMEN EMPOWERMENT)

సంస్థ ముఖ్య లక్ష్యాలలో మహిళా సాధికారత మరియు బాలల అభివృద్ధి కీలకమైన అంశాలు. ఇక్కడి ఆదివాసీ యువతుల స్థితిగతులు వీరిని సంఘటితంగా చెయ్యవలసిన అవసరాన్ని గూర్చి ముందు రెండు అధ్యాయాల్లో చర్చించాము. స్థానికంగా వున్న మహిళల పరిస్థితులపైన ముఖ్యంగా ఒంటరి మహిళలపైన సంస్థ గతంలో ఒక అధ్యయనం చేపట్టింది. ఒక్కొక్క మండలంలోనూ దాదాపుగా 150 మందికి మించి యువతులు భర్తలచే విడిచిపెట్టబడో లేక నిరాదరణకు గురయ్యో తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు గుర్తించింది. ఈ ఆదివాసీ మహిళలందరిలో ఒక మానసిక స్థైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని కలిగించి, తిరిగి మామూలు జీవితాన్ని గడిపేటట్లు చెయ్యాలనుకొన్న సంస్థ ముందుగా వారిచే పొదుపు సంఘాలను ఏర్పాటు చేయించింది. అక్కడి నుండి వారికి తగిన శిక్షణలు, అవగాహనా కార్యక్రమాలు కల్పించింది. తద్వారా వారిలో ఒక సంఘటిత శక్తిని పెంపొందించడానికి ప్రయత్నాలు చేసి విజయం సాధించింది.

**3.1 నాట్‌వాన్ సంఘం ఏర్పాటు :** 2000 సంవత్సరంలో వీరందరిని "నాట్‌వాన్ సంఘం" అనే పేరుతో సంఘటితం చేసి ఒక వేదికపైకి తెచ్చింది. స్థానిక కోయ భాషలో "శక్తివంతులైన మహిళలు" అని దీని అర్థం. ఈ సంఘంలో కేవలం కోయ తెగకు చెందిన మహిళలు మాత్రమే సభ్యులుగా ఉంటారు. మహిళలపై హింస మరియు దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడడం, మహిళా హక్కులు మరియు సమానత్వ సాధనకు కృషి చేయడం సంఘం యొక్క ప్రధాన లక్ష్యం. ఈ సంఘం నేడు 223కు పైగా స్వయం సహాయక సంఘాల (SHGs) ను, 4300 మంది మహిళా సభ్యులను కలిగివుంది. 23 మంది కోర్ కమిటీ సభ్యులతో ఇది ఒక పతిష్టమైన సమాఖ్యగా ఎదిగింది. 2011 సం॥లో టివి 9 నాట్‌వాన్ సంఘానికి **నవీన అవార్డు** ప్రకటించింది.

**సమాఖ్య కృషి :** ప్రేమ/పెళ్ళి పేరుతో మోసపోయిన మహిళల సమస్యలను స్థానిక పంచాయితీలు మరియు మండలస్థాయిల్లో సంప్రదాయబద్ధమైన కులపంచాయితీల్లో కులపెద్దల సమక్షంలో పరిష్కారం కొరకు ప్రయత్నిస్తుంది. ఈవిధంగా గ్రామ, మండల స్థాయిల్లో సంప్రదాయ పద్ధతుల్లో పరిష్కారంకాని, జఠిలమైన కేసుల పరిష్కారానికి చట్టబద్ధమైన మార్గాలను ఎంచుకుంటుంది. ఈవిధంగా కోర్టుల్లో కేసులు వేసి, వాజ్యాలు నడపడం సమాఖ్య కార్యక్రమాల్లో ఒక గణనీయమైన అంశమైంది. ఇతరులకు మార్గదర్శిగా నిలచింది. స్థానికంగా ఎంతో మార్పును కూడా తీసుకు వచ్చింది. ఈవిధమైన చర్యలను చేపట్టడం మొదలుపెట్టిన తరువాత ఆదివాసీ మహిళలు బయటివారి చేతిలో మోసపోవడం చాలావరకూ తగ్గింది, అలాగే ఆదివాసీ మహిళలను వలలో వేసుకోవాలన్న గిరిజనేతరుల దురాలోచనల్లో కూడా కొంత మార్పు వచ్చింది. ముఖ్యంగా ఈ చుట్టుప్రక్కల ప్రాంతాల వాళ్ళు సంఘానికి భయపడి జాగ్రత్తగా, వీరికి దూరంగా ఉంటున్నారు.


నాట్‌వాన్ సంఘం సమావేశం

కేస్ స్టడీ - 1

# మేలుకొలుపు

జీవితం తనకు నేర్పిన అనుభవం ద్వారా తన తోటి ఆదివాసీ యువతులను మేల్కొల్పుతున్న ఒక సాధారణ ఆదివాసీ యువతి నర్సమ్మ (పేరు మార్చబడింది). ఖమ్మం జిల్లా చింతూరు మండలంలోని ఒకానొక ఆదివాసీ కుటుంబంలో 5వ సంతానం నర్సమ్మ, చిన్నతనం నుండి స్కూల్‌కి దూరమై, తల్లిదండ్రులతో కలసి వ్యవసాయం, కూలీ పని చేసేది. యుక్త వయస్సు వచ్చాక అదే గ్రామంలో ఒక స్వచ్ఛంద సేవా సంస్థలో పనిమనిషిగా చేరింది. పని చేసుకుంటూనే, సంస్థ సహకారంతో కొంత వరకు చదువు, కుట్టుమిషన్ కూడా నేర్చుకుంది. 5 సంవత్సరాల కాలం గడిచింది. అందరితో కలసి మెలసి మెలిగే గుణం, స్నేహభావం, ఎదుటి వ్యక్తులతో మర్యాదగా మాట్లాడం, అందరిని ఆకట్టుకొనే తీరు వంటి మంచి లక్షణాలు ఈమె సొంతం. ఇవే ఈమెను వి.ఆర్.పురం మండలంలోని కొన్ని గ్రామాలకు సంస్థ తరుపు క్లస్టర్ కో-ఆర్డినేటర్‌ను చేసాయి.



**మలుపు తిరిగిన జీవితం :** కో-ఆర్డినేటర్ ఉద్యోగం నిమిత్తం ఒక గ్రామంలో ఉంటూ, చుట్టుప్రక్కల గ్రామాలలో ఉన్న మహిళలతో పొదుపు కట్టించడం, సంఘాలను అభివృద్ధి చేయడం లాంటి పనులతో కొద్దికాలంలోనే మంచి పేరు తెచ్చుకుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన రామారావు (మారుపేరు)తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. రామారావుకు బాగా చదువుకోవాలని ఉందని, కానీ అతనికి అంత ఆర్థికస్థితి లేదని తెలుసుకున్న నర్సమ్మ, అతడ్ని డిగ్రీ వరకు తానే చదివించింది. చదువు పూర్తి చేసుకున్న రామారావుకు ప్రభుత్వ ఆరోగ్యశాఖలో ఉద్యోగం వచ్చి, అదే మండలంలో వేరే గ్రామానికి వెళ్లాడు. అప్పటి వరకు పెళ్ళి చేసుకుంటానని నర్సమ్మను నమ్మించిన రామారావు, గుట్టుచప్పుడు కాకుండా వేరే అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. విషయం తెలిసిన నర్సమ్మ అతని దగ్గరకి వెళ్ళి "నన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పి, వేరే అమ్మాయిని పెళ్ళి చేసుకున్నావు. నన్ను ఇంత మోసం చేసావు. ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించింది. రామారావు "నాకు ఇష్టమైంది నేను చేసుకున్నాను, నీకు నాకు ఏ సంబంధం లేదు. నీవు ఎక్కడికి వెళతావో వెళ్ళు, ఏమి చేసుకుంటావో చేసుకో" అన్నాడు.

**న్యాయం కోసం పోరాటం :** ఎక్కడికి వెళ్ళాలో, ఎవరికి చెప్పుకోవాలో తెలియలేదు. ఎంతో ఆలోచించిన నర్సమ్మ గ్రామం వెళ్ళి, గ్రామంలో ఉన్న కుల పెద్దలకు చెప్పుకుంది. కుల పంచాయితీ పెట్టించింది. కానీ ఫలితం లేదు, అతను పంచాయితీ మాట వినలేదు, సమాధానం చెప్పలేదు, సమస్య పరిష్కారం కాలేదు.తిరిగి ఆలోచనలో పడ్డ నర్సమ్మకు నాట్‌వాన్ సంఘంలో పనిచేస్తున్న స్నేహితురాలు గుర్తుకు వచ్చి, వెళ్ళి ఆమెను కలిసింది. ఆ స్నేహితురాలు ఈమెను సంఘానికి తీసుకొని వెళ్ళింది. నర్సమ్మ తన గోడు మొత్తం సంఘానికి వివరించింది. సంఘంవారు అతన్ని పిలిపించి, ఎన్నో విధాల సర్దుబాటు చేయడానికి ప్రయత్నించారు. కానీ అతను దేనికి ఒప్పుకోలేదు. చేసిన రాజీ ప్రయత్నాలు ఏమి ఫలించలేదు. ఇతనికి కోర్టు అయితేనే సరియైన గుణపాఠం చెబుతుందని భావించిన ఈమె, సంఘం సహాయంతో కోర్టులో కేసు వేసింది. కొంతకాలం తరువాత కేసు విచారణకు వచ్చింది. కోర్టులో రామారావు ఇకపై ఆమెను తానే చూసుకుంటానని, నెలకు రూ.1000/- చొప్పున మనోవర్తి ఇస్తానని ఒప్పుకొన్నాడు. ఆ ప్రకారం 1సంవత్సరం పాటు మనోవర్తి ఇచ్చాడు. ఇంతలో ట్రాన్స్‌ఫర్ అయ్యి వేరే మండలానికి (పాల్వంచ) వెళ్ళిపోయాడు. అప్పటి నుండి మనోవర్తి ఇవ్వడం మానివేశాడు. దీనికి తోడు, ఈమె పనిచేస్తున్న సంఘం మూతపడింది. దాంతో ఉన్న ఆ కొంచెం ఆధారం కూడా పోయిన నర్సమ్మ కథ తిరిగి మొదటికొచ్చింది. చేసేదిలేక మళ్ళీ కూలిపని చేయడం మొదలుపెట్టింది.

**ఆదర్శ మహిళగా నిలచిన నర్సమ్మ :** కూలి పనిచేస్తూనే ఇందిరా క్రాంతి పథకం (I.K.P.) లో పొదుపు కట్టడం ప్రారంభించింది. కొద్ది సమయంలోనే ఆమె సహజ లక్షణాలైన పట్టుదల, కార్యదీక్ష, నాయకత్వం అధికారుల దృష్టిలో పడ్డాయి. దాంతో వారు ఆమెను యం.యం.ఎస్ (మండల సమాఖ్య)లో కోశాధికారిగా తీసుకున్నారు. వైవాహిక జీవితానికి, సంతానానికి దూరమైన ఆమె ఒక ఆడబిడ్డను పెంచుకోవాలని భావించి, ఐ.కె.పి. వారి సహాయంతో ఒక అనాథ అమ్మాయిని దత్తత తీసుకొంది. 3 సంవత్సరాల పాటు ఐ.కె.పి.లో పని చేసిన తర్వాత నాట్‌వాన్ సంఘానికి వచ్చి క్లస్టర్ కో-ఆర్డినేటర్‌గా చేరింది. 200 మంది ఆదివాసీ యువతులకు కుట్టుమిషన్ ట్రైనింగ్ ఇచ్చింది. సంఘం కార్యక్రమాలన్నింటిలోనూ చురుగ్గా పాల్గొంటూ, సంఘంలో అందరి మన్ననలను పొందుతుంది. అలాగే తనకు జరిగిన అన్యాయాన్ని తోటి ఆదివాసీ యువతులకు తెలియజేస్తూ, వారు ఎవరి చేతిలోనూ మోసపోకుండా తగు సలహాలు, సూచనలు ఇస్తూ, వారి అభివృద్ధికి ప్రయత్నిస్తుంది. తన ఈ ప్రయత్నం కొనసాగడానికి ఇకపై కూడా ఈ నాట్‌వాన్ సంఘంలో కొనసాగడం అవసరమన్నది నర్సమ్మ ఆలోచన.

"మాలాంటి ఆదివాసీ యువతులకు, ఇతర మహిళలకు నర్సమ్మ జీవితం ఒక పాఠం కావాలి. అలాగే సమస్యలను ఎదుర్కొనడంలో, లక్ష్యసాధనలో ఆమె చూపిన ధైర్యం, దీక్ష, ఆదర్శం కావాలి."

–సేకరణ : **అర్జమ్మ,** నాట్‌వాన్ సంఘం

**సమాఖ్య సాధించిన విజయాలు :**



హాస్టల్ సమస్యలు
తెలుసుకుంటున్న తల్లుల కమిటి

- భర్త / ప్రియునిచే లైంగిక దోపడీ, హింస, వంచనకు గురియై, విడచిపెట్టబడిన మహిళలు మొత్తం 30 మందిచే సమాఖ్య కోర్టులో కేసులు వేయించగా, నేడు వీరిలో 26 మంది కోర్టు ద్వారా మనోవర్తిని పొందుతున్నారు.
- సమాఖ్య చర్యల వల్ల ఒక ప్రక్క ఈ విధమైన సంఘటలన శాతం చాలా వరకూ తగ్గగా, మరో ప్రక్క కుల పంచాయితీల్లో ఎంతో కొంత తప్పు కట్టేసి లేక వారిని ఖుషీ చేసి కేసు నుండి తేలిగ్గా తప్పించుకోవచ్చు అనుకునే మోసగాళ్ళ భావనలో లేక సాధారణ ఆలోచనలో మార్పు వచ్చింది. అది ఇప్పుడు అంత తేలిక కాదని వీరు గ్రహించడం మొదలుపెట్టారు.
- ఈ ఒంటరి మహిళలకు కోర్టులో కేసు నడుస్తున్న సమయం (ట్రైల్)లో ఆదాయ అభివృద్ధి కొరకు కొన్ని కార్యక్రమాలు, పంట ఋణాలు వంటి వాటిని సమాఖ్య అందిస్తుంది. అవి వారికి ఆర్థికంగా ఎంతో అండగా నిలవడమే కాకుండా తిరిగి వారు జీవితంలో నిలదొక్కుకోవడానికి, సాధికారతను సాధించడానికి బాగా దోహదపడుతున్నాయి.
- అవసరమైన మహిళలకు తగిన న్యాయపరమైన, ఆరోగ్యపరమైన సేవలను అందించడంతో పాటు, వీరి విద్యాభివృద్ధికి కూడా సమాఖ్య సహకరిస్తుంది.
- భర్తలచే విడిచిపెట్టబడిన స్త్రీలకు కనుక పిల్లలు వుండి, చదువుకు దూరమైనట్లయితే, వారికి తిరిగి చదువుకొనే అవకాశం కల్పించడం తన పనుల్లో ఒక ముఖ్య భాగంగా సమాఖ్య చేపట్టింది. అయితే వీరి చదువు కొనసాగింపునకు అవసరమైన కుల, నివాస, ఆదాయ, ఇతర ధృవీకరణ పత్రాల సమీకరణ ఒక క్లిష్టమైన సమస్య. అందువల్ల చాలామంది (బడి బయట) పిల్లలను ఆర్.బి.సి.ల్లో చేర్పించడం ద్వారా వీరికి తిరిగి చదువుకొనే అవకాశం కల్పించింది.
- హక్కుల సాధన ముఖ్యంగా అటవీ హక్కుల చట్టం అమలు నుండి పోలవరం నిర్మాణం, నిర్వాసితలకు వ్యతిరేకంగా ప్రచారం, పోరాటం వరకూ నాట్‌వాన్ సంఘం తన కార్యక్రమాలను అంచెలంచెలుగా విస్తరించుకొంటూ వచ్చింది. నేడు ఇది ఈ చుట్టుప్రక్కల గ్రామాల్లో సామాజిక చైతన్యానికి ఒక ప్రతీకగా, మహిళాభివృద్ధికి ఒక సంకేతంగా నిలచిందని చెప్పడానికి ఏ మాత్రం సందేహించ నవసరంలేదు. ప్రభుత్వ / ప్రైవేట్ సంక్షేమ కార్యక్రమాలను సక్రమంగా అమలు జరిపించుకోవడంలో నేడు ఈ సంఘం ఆరితేరింది. అధికార యంత్రాంగంలో ఒక జాగృతిని నెలకొల్పగలిగింది. సామాజిక అంశాల నుండి న్యాయపరమైన సమస్యల పరిష్కారం, సమాచార హక్కు చట్టం వంటి సానుకూల సాధనాలను సమర్ధవంతంగా ఉపయోగించు కొనగలగడం వరకూ ఇది ఒక విప్లవాన్ని తీసుకు వచ్చిందని చెప్పవచ్చు.

## 3.2 కొండరెడ్డి మహిళల హక్కులు:




కొండరెడ్డి మహిళలకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ

మిగిలిన ఆదివాసీ మహిళలతో ముఖ్యంగా కోయ తెగతో పోల్చినపుడు కొండరెడ్డి స్త్రీలకు తమ సామాజిక సమస్యలను, హక్కులను సాధించుకోగలగడంలో వున్న సామర్థ్యం గ్రామం లోపల, బయట కూడా తక్కువే. ఇందుకు వీరి ఆర్థిక సామాజిక నేపథ్యం ఒక ముఖ్య కారణం. కోయతెగకు చెందిన నాట్‌వాన్ సంఘం ఇప్పటికే చాలా విషయాల్లో సాధికారత సాధించింది. వీరిద్దరి మధ్య ఒక సమన్వయాన్ని కల్పించి, వీరిలో కూడా నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని, ఐక్యతను పెంపొందించాలని భావించి, సంస్థ వీరికి అనేక శిక్షణా కార్యక్రమాలు (Capacity Building) ఏర్పాటు చేసింది. అనంతరం 63 మంది కొండరెడ్డి మహిళలను 8 గ్రామస్థాయి

కేస్‌స్టడీ - 2

# ముందడుగు



ప్రతిమనిషి జీవితంలోనూ ఒడిదుడుకులు, కష్టనష్టాలు, సుఖదుఃఖాలు చాలా సహజం. అయితే సమస్యలపై పోరాడి గెలిచినవారికంటే పోరాడలేక ఓడినవారే ఎక్కువ. అందులోనూ ఒక సగటు ఆదివాసీ మహిళకు ఈ గెలుపు మరింత కష్ట సాధ్యమైన పని. కష్టాలతో పోరాడి నెగ్గడమే కాకుండా, 'జీవితమంటే మనం మాత్రమే బ్రతకడంకాదు. అందరితో కలిసి, అందరికీ ఉపయోగపడేలా బ్రతకడం' అనుకోవడం నిజంగా అభినందనీయం. అటువంటి ఒకానొక ఆదివాసీ మహిళ గంగమ్మ (మారుపేరు). గంగమ్మ తన కుటుంబంలో 4వ సంతానం. ఈమెకు ఇద్దరు అన్నయ్యలు, ఒక అక్క, ఒక చెల్లి ఉన్నారు. సొంత గ్రామంలోనే 5వ తరగతి వరకు చదివి 6వ తరగతి చదవడానికి చింతూరు ఆశ్రమ పాఠశాలలో చేరింది. 7వ తరగతి సగం వరకు చదువు సజావుగానే సాగింది. ఆ తరువాత తీవ్ర అనారోగ్యంతో ఆగిపోయింది. సుమారుగా ఒకటిన్నర సంవత్సరాలకు పైనే జబ్బుతో బాధపడింది. ఆరోగ్యం మెరుగుపడిన తరువాత కూడా కుటుంబ ఆర్థిక పరిస్థితుల వలన చదువుకునే అవకాశం ఆమెకు దక్కలేదు. చదువంటే ఎంతో ఇష్టం ఉన్నా, అప్పటికే బాల్యవివాహం జరిగి, భర్తకు దూరమై ఇంటివద్దనే ఉంటున్న తన అక్కతో కలిసి చిన్నప్పటి నుండే తప్పనిసరై కూలిపనికి, సొంత వ్యవసాయ పనులకు పోతూ, కుటుంబంలో తన వంతు భారం మోయవలసి వచ్చింది. చదువుకోవాలన్న కోరిక మాత్రం మనసు నిండా అలాగే మిగిలిపోయింది.

**మూడునాళ్ళ ముచ్చటైన మూడుముళ్ళు :** ఊరిలోనే ఉన్న తన మేనత్త కూతురు, తన ఈడుదే కావడం వలన, తరుచుగా వాళ్ళింటికి వెళుతూ వస్తున్న గంగమ్మకు, ప్రక్కనే ఉంటున్న దూరపు బంధువైన ఒక యువకునితో పరిచయం ఏర్పడింది. అతను ఈమెను బాగా చదివిస్తానని, బాగా చూసుకుంటానని చెప్పడంతో అతన్ని పెళ్ళి చేసుకుంది. ఇప్పుడైనా చదువకోవచ్చని ఆశపడి పెళ్ళి చేసుకుందే తప్పా, నిజానికి దానిపై ఒక అవగాహన కానీ, కనీస జ్ఞానం కానీ అప్పటికి ఆమెకు లేవు. కొద్దోగొప్పో జీవితంపై అవగాహన వచ్చే నాటికి జరగాల్సిన అనర్థమంతా జరిగిపోయింది. అతను అప్పటికే పెళ్ళైనవాడు కావడం వలన అతని మొదటి భార్యతో తరచుగా గొడవ జరిగేది. కాలంతో పాటు కుటుంబంలో గొడవలు పెరిగాయి. సవతి పోరు పడలేని గంగమ్మ చివరకు భర్త నుండి దూరమైంది. అయితే జరిగిన పెళ్ళితంతుకు గుర్తుగా గంగమ్మ తనతో పాటు ఒక కూనను కడుపున మోసుకురావాల్సి వచ్చింది. ఆ కూన (పాప) కు ఇప్పుడు 11 సంవత్సరాలు.

**కష్టాలు, కడగండ్లు :** భర్తకు దూరమైన గంగమ్మకు పుట్టింటివారు దగ్గరైనా వారు ఏమీ సహాయం చేయలేని నిస్సహాయులు. బ్రతకడానికి ఏ ఆధారమూలేక గంగమ్మ కడుపులో బిడ్డతో పాటే కష్టాలను కూడా మోయడం అలవాటు చేసుకుంది. తనతో పాటు వయస్సు మీదపడిన తల్లిదండ్రులు, ఎప్పటినుండో ఇంట్లోనే ఉండిపోయిన అక్కను పోషించుకోవడానికి కిరాణా కొట్టు పెట్టింది. బిడ్డ పుట్టాక నాగలిపట్టి వ్యయసాయం కూడా చేసింది. తన బిడ్డతో పాటు, తండ్రి చనిపోయి నిర్భాగ్యులైన తన పిన్ని పిల్లలు కూడా వచ్చి చేరారు. వారి పోషణ, చదువు కూడా ఈమె చూడాల్సి వచ్చింది. ఖర్చులు పెరిగాయి. ఆదాయం చాలడం లేదు. భర్త, పిల్లలతో చీకుచింత లేకుండా హాయిగా జీవితాన్ని గడపాల్సిన ఆ చిన్న వయస్సులో గంగమ్మకు ఏకంగా మూడు కుటుంబాల భారాన్ని తనే మోయాల్సి వచ్చింది.

**సమస్యలను ఛేధించిన గంగమ్మ :** ఖర్చులకు సరిపడా ఆదాయాన్ని పెంచుకోవడానికి కిరాణాకొట్టుతో పాటు వ్యవసాయం, అటవీ ఫలసాయ సేకరణ, ఇంకా ఖాళీ ఉంటే కూలిపని, ఇలా దొరికిన పనల్లా తనవాళ్ళతో కలిసి చేసుకుంటూ పోయేది. మనసు పెట్టి వ్యవసాయం చేసి, ఒక సామాన్య ఆదివాసీ యువతి ఆదర్శ రైతైంది. 'వెలుగు' పొదుపు సంఘంలో ఉంటూ, రూ.500/- జీతానికి దానిలోనే ఉద్యోగం సంపాదించింది. పట్టుదలతో పనిచేసింది, ప్రశంసల వర్షం కురవడమే కాదు ఆమె సమర్ధతకు మెచ్చి అప్పటి ఐ.టి.డి.ఏ. (I.T.D.A.) ప్రోజెక్టు ఆఫీసరు మూడు మండలాలకు అవసరమైన ముగ్గురు ఎ.పి.ఎం.లను ఇంటర్వ్యూ చేసి, ఎంపిక చేసే బాధ్యతను ఈమెకు అప్పగించారు. ఇవన్నీ ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతూ వచ్చాయి.

**సాధించిన విజయాలు :** 'వెలుగు' ఆఫీసుకు తరచుగా వచ్చివెళ్ళే గంగమ్మకు నాట్‌వాన్ (NATWAN) సంఘం గురించి, అది చేసే పనుల గురించి తెలిసింది. 2007 సంవత్సరంలో ఈ సంఘంలో చేరింది. సంఘం ద్వారా తనలాంటి ఆదివాసీ మహిళల సమస్యలు, ఇతర అనేక సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి ప్రారంభించింది. నేడు సంఘానికి సంబంధించిన ఎన్నో కార్యక్రమాల్లో కోర్ కమిటీ సభ్యురాలిగా ముఖ్య పాత్ర పోషిస్తుంది. దీని ద్వారా ఎన్నో రాష్ట్ర, జాతీయ స్థాయి సమావేశాలు, సదస్సుల్లో పాల్గొంటూ, తన తోటి ఆదివాసీ యువతుల్లో అవగాహన, చైతన్యం కల్పించేందుకు ఆదివాసీ మహిళల సమస్యలను ప్రజల ముందుకు తెచ్చేందుకు ప్రయత్నిస్తుంది. తన మీదే ఆధారపడ్డ పిన్ని పిల్లలను ప్రయోజకుల్ని చేసి, వారి కాళ్ళ మీద వారు బ్రతికేలా చేసింది. తన బిడ్డని కూడా ఒక మంచి పాఠశాలలో చదివిస్తుంది. ఏ చదువుకోసమైతే తన జీవితం ఇన్ని మలుపులు తిరిగిందో ఆ చదువును వదిలేయకూడదని సంఘంలోకి వచ్చాక 10వ తరగతి, ఆ తరువాత ఇంటర్మీడియట్ ప్రయివేటుగా కట్టి, పాసయ్యింది.ఇలా చెప్పుకుంటూ పోతే ఈమె తన జీవనపోరాటంలో సాధించిన అంశాలు చాలానే ఉన్నాయి. ఇవి చాలా సాధారణమైన సమస్యలుగానే కనిపించినా ఒకదాని వెంట ఒకటిగా వచ్చిపడిన ప్రతి సమస్యనూ ఎదుర్కొంటూ ముందడుగు వేయడం ఒక సగటు ఆదివాసీ మహిళకు అంత తేలిక కాదు. గంగమ్మ చేసిన ఈ సాహసానికి ఆమెను మనందరం అభినందించాలి.

– సేకరణ : **కమల,** ఎ.ఎస్.డి.ఎస్.

సంఘాలు (CBOs) గా ఏర్పరచి, దిశా నిర్దేశం చేసింది. ఇప్పుడు ఈ సంఘాలు ఆయాగ్రామాల్లో అనేక సమస్యల పరిష్కారంలో కీలక భూమిక వహిస్తున్నాయి.

**ఫలితాలు :** ఈ సంఘాలు తమ ప్రాంతంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళా డాక్టర్లను నియమించాలనే డిమాండ్‌ను, ప్రభుత్వ అధికారుల ద్వారా సాధించగలిగాయి. కొంతమంది మహిళలు నిజనిర్ధారణ కమిటీలుగా ఏర్పడి, చుట్టుప్రక్కల బాలికల వసతి గృహాలను తరచూ సందర్శిస్తూ, అక్కడి ఆరోగ్య పరిస్థితులను, వసతులు, ఇతర సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి కృషి చేస్తున్నారు. భర్తలచే వదిలిపెట్టబడిన స్త్రీలు, మోసపోయి ఒంటరియైన స్త్రీలు / యువతులకు ఆర్థిక సహాయాన్ని, మానసిక స్థైరాన్ని అందిస్తూ ఈ మహిళా సంఘాలు తమ స్త్రీల అభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్నాయి.

### 3.3 మహిళలకు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు :

ఈ ప్రాంతంలో ముఖ్యంగా ఆదివాసీ కుటుంబాల్లో సామాజికంగా మహిళ పోషించే పాత్ర ఎంతో కీలకమైంది. కాబట్టి స్త్రీల జీవనోపాధి నైపుణ్యాలను మరింత మెరుగుపరచి, క్రొత్త క్రొత్త ఆదాయ మార్గాలను అన్వేషించి, నెలకొల్పడం ద్వారా వీరి ఆదాయం మార్గాలను పెంపొందించడం, తద్వారా మహిళా సాధికారతను సాధించడం ఎంతో ఆవశ్యకమని ఎ.ఎస్.డి.ఎస్. తలంచింది. సుస్థిర పద్ధతుల్లో కలపేతర అటవీ ఉత్పత్తుల సేకరణ, విస్తరాకుల తయారీ వంటి వ్యక్తిగత బ్రతుకు తెరువు కార్యక్రమాలతో ప్రారంభించి, గ్రామానికంతటికీ సంబంధించిన సామూహిక కార్యక్రమాల వరకు అనేకం ఈ నాట్‌వాన్ సంఘం ద్వారా సంస్థ చేపట్టింది.

**కిరాణా కొట్టు నడుపుకుంటున్న మహిళ**



*Travelling together with ASDS and Natwan Sangam*



The development journey together with ASDS started when I first met Gandhi babu in 1993. At the time he was looking for resource support to help adivasi women in V R PuramMandalto access better maternity and child health care. Since then much has changed and the organization has moved forward significantly.

My own experience in the Women's movement and with the Deccan Development Society shaped the kind of support we could provide through Gramya Resource Centre for women to strengthen the women in the community to organize themselves on their own behalf. Starting with reflections on the conditions of women in the Koya tribe with a gender lens of "the Personal is Political", women leaders themselves identified the sexual exploitation they were facing at the hands of men from other castes. They also recognized that male leaders in their own community were also putting them down by not supporting their efforts to live a dignified life. ( for example after a fine was imposed in case of domestic violence it was not given to the concerned woman but used to drink alcohol ) The women leaders also reflected that while they were dependent on the forest for food, firewood and fodder many forces were at work destroying the forest. NatwanSangam an adivasi women's organization was born to help all vulnerable women to live a life of dignity by acting collectively. When the Forest Rights Act was legislated Natwansangam provided leadership to the community by helping families to claim their rights. 15 % of claims were by single women . The women are promoting sustainable agriculture and are making efforts to conserve their own seeds.

When the government of Andhra Pradesh started building the canals for the Polavaram dam without environment clearances, the adivasi women in the submergence area are providing leadership to resist the illegal constructions.

Women have understood the implications of climate change by recording the changes in the forest streams and havoc caused due to untimely rains and weather changes on productivity of their farms. They are exploring means to mitigate the problems. ASDS has accompanied i the women in all their struggles and must be congratulated on their sustained support to people's organizations.

In Solidarity

**Dr V Rukmini Rao**

Gramya Organisation, Hyderabad

## ఆదివాసీ మహిళల కోసం "నాట్వాన్"...

**TV10 లో ప్రసారమైన కార్యక్రమం :** 17.54 జనవరి 9, 2014

దళితవర్గాలకు చెందిన వారంతా అణచివేతకు గురవుతున్నారన్న మాట అక్షరసత్యం. అలా అణచివేతకు, వివక్షకు గురవుతున్న వర్గంలో అనాదిగా మహిళలే ముందు వరుసలో ఉన్నారు. ముఖ్యంగా ఆదివాసీ మహిళలను నేటికీ పెళ్ళి పేరుతో మోసం చేస్తూనే ఉన్నారు. వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారు. అటువంటి ఆదివాసీ మహిళల జీవితాల్లో మార్పు కోసం 'నాట్వాన్' సంఘం కృషి చేస్తోంది. ఈ సంఘం కృషిపై నేటి **మానవి** 'స్పెషల్ ఫోకస్' కార్యక్రమం ద్వారా తెలుసుకుందాం...

**మహిళల జీవితాలోల వెలుగు ...**

ఖమ్మంజిల్లా భద్రాచలం డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాలపై ఆదివాసీలు కానివారి కన్ను పడింది. దీంతో ఉపాధి మార్గాల పేరుతో ఇక్కడికొచ్చి ఇతరులు స్థిరపడుతున్నారు. ఈ ఆర్థిక వలసలే ఆదివాసీ మహిళల జీవితాలను చిన్నాభిన్నం చేసింది. డివిజనల్‌లో వి.ఆర్.పురం, చింతూరు మండల కేంద్రాలకు చుట్టుప్రక్కల అటవీ ప్రాంతాలనే ఆవాసాలుగా చేసుకుని అనేక తరాలుగా కోయ, కొండరెడ్లు లాంటి గిరిజన జాతుల వారు జీవిస్తున్నారు. నాన్ ట్రైబల్స్ చేతుల్లో మోసపోయిన వారు కూడా పదుల సంఖ్యలో ఉంటారు. కానీ, వీరి గోడు ప్రభుత్వానికి పట్టలేదు. వారి పిల్లల భవిష్యత్ గురించి పాలకులు పట్టించుకోలేదు. అందుకే ఆదివాసీ మహిళలు మోసపోవడం సర్వసాధారణమన్న తీరుగా ఉన్నారు. కానీ ఈ విషయంపై ఎ.ఎస్.డి.ఎస్. సంస్థ సీరియస్‌గా కృషి చేసింది. అందులో భాగంగానే 20 మంది ఆదివాసీ మహిళలతో **'నాట్వాన్' సంఘాన్ని** ఆరంభించింది. భద్రాచలం డివిజన్‌లోని దాదాపు నాలుగు మండలాల్లోని పది గ్రామాల్లో ప్రస్తుతం నాట్వాన్ సంఘం చురుగ్గా పనిచేస్తోంది. ఈ సంఘంలో ఇప్పటివరకూ 4,300 మంది మహిళలు సభ్యులుగా చేరారు. ప్రతి రెండేళ్ళకోసారి కోర్ కమిటీ ఎంపిక జరుగుతుంది. ప్రస్తుతం 28 మంది, కోర్ కమిటీలో ఐదుగురు మహిళలు పూర్తికాలం కార్యకర్తలుగా పనిచేస్తున్నారు.

**నేనున్నానంటున్న నాట్వాన్ సంఘం...**

మహిళల వైవాహిక జీవితంలో ఎదురైన సమస్యలకు పరిష్కారం చూపడమే కాకుండా, వారి ఆర్థిక సాధికారత రాజకీయ చైతన్యం కోసం నాట్వాన్ సంస్థ తగినంత శిక్షణ ఇచ్చింది. ఆ చైతన్యమే వారికి నలుగురిలో ప్రత్యేకంగా నిలబెట్టింది. బాధితులకు భరోసాను కలిగిస్తోంది. చింతూరు మండలం వాలుమూరి గొంది గ్రామంలో కేవలం 33 ఇండ్లు ఉన్నాయి. అక్కడ నివాసముంటున్న సోడె పార్వతి భర్త భీమయ్య అనారోగ్యంతో కన్నుమూశాడు. అప్పటి నుండి నేటిదాకా పార్వతి నాట్వాన్ సంఘంతో కలసి ఉంది. ఉమ్మడివరానికి చెందిన దారమ్మ తన 45 ఏళ్ళ వయసులోనే జీవితంలో అనేక కష్టాలు చవిచూసింది. భర్తను కోల్పోయింది. నలుగురు పిల్లలను ఒంటిచేత్తో సాకింది. ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నా, అనారోగ్యాలు కాటేసినా కన్నతల్లి కోసం, కడుపున పుట్టిన బిడ్డల కోసం రెక్కలుముక్కలు చేసుకుంటూ, నాట్వాన్ సంఘం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటొంది. ఆధునిక వనితలకు ఏ మాత్రం తీసుపోని చోడే వెంకమ్మ పుట్టకముందే తండ్రిని, బాల్యంలోనే తల్లిని కోల్పోయింది. అక్కల సహకారంతో చదువుకుంది. జీవితాంతం తోడుగా ఉంటాడనుకున్న జీవిత సహచరుడు మద్యం వ్యసనంతో అర్థాంతరంగా తనువు చాలించాడు. దీంతో కన్నబిడ్డను ఒంటరిగా సాకుతోంది. అటువంటి స్థితిలో నాట్వాన్ సంఘం ఆమెకు అండగా నిలిచింది. స్వయంగా పోడు వ్యవసాయం చేసుకునేలా ప్రోత్సహించింది. కుర్సం సావిత్రికి పుట్టింటి నుండి ఎటువంటి ఆర్థిక సహకారం లేదు. మెట్టినింట అడుగుపెట్టి రెక్కల కష్టాన్నే నమ్ముకుంది. బాల్యంలో చదువుకోవాలని ఎంతో ఆశపడినా అది నెరవేరలేదు. అందుకే తన పిల్లల్నైనా బాగా చదివించాలని ఆశపడింది. అటువంటి దశలో నాట్వాన్ సంఘం సావిత్రికి ఆర్థికంగా సహకారాన్ని అందించింది.

**శిక్షణతో స్వపరిపాలన...**

నాట్వాన్ సంఘంలో శిక్షణ పొందిన అనేకమంది గిరిజన మహిళలు ఈ రోజు చదవడం, రాయడం నేర్చుకున్నారు. సామాజిక, రాజకీయ విషయాలపై అవగాహనను పెంచుకుని స్థానిక స్వపరిపాలనలో భాగస్వాములుగా మారారు. క్షేత్రస్థాయిలో అద్భుతంగా పనిచేస్తున్నారు. ఇతరుల కన్నా భిన్నంగా, సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారు. వి.ఆర్. పురం, చింతూరు మండలాల పరిధిలోని అనేక గ్రామాల్లో, కోయలతో పాటు అత్యధికంగా కొండరెడ్లు జీవనం సాగిస్తున్నారు. అందకే నాట్వాన్ అధ్వర్యంలో పాపికొండ చుట్టుప్రక్కల నివసించే కొండరెడ్ల మహిళలతో కూడా ఒక సంఘాన్ని ఏర్పాటు చేసారు.

**ఎ.ఎస్.డి.ఎస్ కృషి...**

ఆదివాసీ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసేందుకు నాట్వాన్ సంఘానికి, ఎ.ఎస్.డి.ఎస్. సహకరిస్తోంది. స్థానికంగా దొరికే సహజవనరులనే ముడిసరుకుగా చేసుకుని వారి చేత అటవి ఉత్పత్తులను తయారు చేయిస్తోంది. విత్తన బ్యాంకులు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తోంది. నాట్వాన్ సంఘాన్ని భవిష్యత్‌లో ఇతర మండలాలకు, ప్రాంతాలకు విస్తరించేందుకు ఎ.ఎస్.డి.ఎస్. కృషి చేస్తోంది. సామాజికంగా వారిని చైతన్యపరించేందుకు ప్రయత్నిస్తోంది. ఆదివాసీ మహిళలకు భూమిపై హక్కుందనే అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోంది.

**అవరోధాలను అధిగమిస్తూ ముమ్ముందుకు ...**

నాట్వాన్ సంఘం కేవలం కుటుంబం, గ్రామం లేదా వారి మండలానికి సంబంధించిన వ్యవహారాలకే పరిమితం కాలేదు. పిల్లల చదువులు, వారికి విద్యాబుద్ధులు చెప్తున్న స్కూళ్ళ పనితీరును, ప్రభుత్వ హాస్టళ్ళలో పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలిస్తోంది. మహిళల భూమి హక్కు కోసం పోరాటం చేస్తోంది. నాట్వాన్ సాధించిన ఈ విజయాలన్నీ అంత సులువుగా సాధ్యం కాలేదు. తొలిదశలో అనే ఇబ్బందులు ఎదుర్కొంది. కులపెద్దలు, భూ కబ్జాదారులు వారి మీద భౌతికదాడులు కూడా చేసేందుకు సిద్ధపడ్డారు. ఈ ఆటంకాలన్నీ అధిగమించి రాష్ట్రచరిత్రలోనే తొలిసారి 28 కేసుల్లో ఆదివాసీ మహిళలకు మనోవర్తి ఇప్పించి చరిత్ర సృష్టించారు. నాట్వాన్ సంఘానికి తమ విధివిధాలనాలకు సంబంధం లేకుండా నేడు అన్ని పార్టీలు తమ సహకారాన్ని అందిస్తున్నాయి. అంగబలం, అండ బలమున్న వారి దాడులను ఎదుర్కునేందుకు కూడా ఈ సంఘం కార్యకర్తలు సిద్ధపడ్డారు. ఆటంకాలను ఎదుర్కొంటూ ముందుకు సాగుతూనే ఉన్నారు.



చత్తీజ్‌ఘడ్ నుండి ప్రాణభయంతో ఖమ్మం జిల్లాకు తరలి వస్తున్న ఆదివాసీలను కలుపుకొని వారికి ఏం చెయ్యవచ్చునో తెలుసుకునేందుకు కొందరు కాకినాడ ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థులు వెళ్తున్నారని, వారితో మీరు వెళ్ళగలరా? అని అడుగుతూ గతంలో ఎప్పుడో అసోసియేషన్ ఫర్ ఇండియాస్ డెవలప్‌మెంట్ (AID) నన్ను కోరింది. నాకు గుర్తున్నంతవరకు నేను ASDSకు రావడం అదే మొదటిసారి. అంతర్గత నిర్వాసితుల కొరకు ASDS చేపట్టిన మానవ సహాయ కార్యక్రమాలకు 'సంఘీభావ కమిటీ' పేరుతో మాకు చేతనైన సహకారం మేము అందించాము.

ఈ పదేళ్ళ కాలంలో ASDS నిర్వహించిన పలు కార్యక్రమాల్లో నేను పాల్గొంటూ వచ్చాను. ఒక స్వచ్ఛంద సేవా సంస్థగా తన రోజువారీ ప్రాజెక్టు పనులు చేస్తూనే, ASDS కొన్ని కీలకమైన, ఇతరులు చేయడానికి ధైర్యం చూపని, చూపలేని రంగాలలో గణనీయమైన పనులు చేసిందని నేను భావిస్తాను. అవి 1. సాల్వాజుడుం బాధిత చత్తీజ్‌ఘడ్ నిర్వాసితులకు అందించిన మానవ సహాయం. 2. గిరిజనేతర పురుషుల చేతిలో మోసపోతున్న కోయ ఆదివాసీ మహిళలకు అండగా నిలిచి వారందరూ 'నాట్వాన్ సంఘం' పేరుతో సంఘటితం అయ్యేందుకు చేసిన తెర వెనుక కృషి. 3. పోలవరం నిర్వాసితులకు అండగా నిలవడం. నిర్వాసితకు సంబంధించి ASDS అనేక శిక్షణ శిబిరాలను వివిధ ప్రాంతాలలోని ఆదివాసీ ప్రజలకు నిర్వహించింది. అందులో స్వర్గీయ కె. బాలగోపాల్ గారితో కలసి పాల్గొనే అవకాశం నాకు కూడా లభించింది. ఇవన్నీ చరిత్రలో నిల్చిపోయే మైలురాళ్ళు. మా సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ (APVVU) తరుపున ASDS కు ఆ సంస్థ కార్యకర్తలకు అభినందనలు తెలియజేస్తున్నాం. ఆదివాసీల హక్కుల రక్షణ, సాంఘిక సంక్షేమం, సంఘటిత చైతన్య నిర్మాణంలో ASDS మరిన్ని మైలురాళ్ళను దాటుతుందని ఆశిస్తూ...

అభినందనలతో

**పి.ఎస్. అజయ్‌కుమార్**

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్

29-8-2013



## 4. అంతర్గత నిర్వాసితులు / దేశీయ శరణార్థులు (Internally Displaced People)

చత్తీజ్‌ఘడ్‌కు చెందిన అంతర్గత నిర్వాసిత ఆదివాసీ ప్రజల (IDPs) సమస్యలు ఎంతో ప్రత్యేకమైనవి. అక్కడి హింసను తట్టుకోలేక వేల సంఖ్యలో ఆదివాసీలు పిల్లలు, ఆడవారు, వృద్ధులతో సహా కుటుంబాలకు కుటుంబాలే ప్రాణాలు అరచేత పట్టుకొని, సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, వరంగల్ రిజర్వు ఫారెస్ట్‌లోకి పారిపోయి వచ్చి, తాత్కాలికంగా గుడిసెలు వేసుకొని తలదాచుకొంటున్నారు. 2006లో ప్రారంభమైన ఈ సమస్య క్రమేపి ఎక్కువైంది. వీరిలో ముఖ్యంగా పిల్లలు, స్త్రీలు అత్యధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లైంగిక హింస, దోపిడీలతో పాటు తీవ్ర అనారోగ్యం, పౌష్టికాహార లోపం, విద్య, వైద్యం ప్రధాన సమస్యలు.

**సమస్య పూర్వాపరాలు :**

దేశంలోని నక్సలైట్ల సమస్యను సాధ్యమైనంత మేరకు త ... లని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు భావించాయి. ఇందుకోసం స్థానిక ఆదివాసీ య ... 'కోయ–కమాండోస్' వంటి పేర్లతో స్థానికంగా సాయుధ పోరాట దళాలను ఏర్ప ... ని ఏరివేయడం ఈ దళాల ప్రధాన లక్ష్యం. అయితే ప్రభుత్వాలు నక్సలైట్ల నివార ... నుక ముఖ్య లక్ష్యం అంతర్గత శాంతిభద్రతలను కాపాడడం అని పైకి చెప్పినా ఆ ... కి ముఖ్య అడ్డంకిగా నిలచిన వీరిని తొలగించడం తద్వారా మార్కెటింగ్ శక్తులకు, పెట ... రాచబాట వేయడమే ప్రధాన ఉద్దేశ్యమనే విమర్శ ఒకటి బల ... అయితే ఇక్కడ ఆ చర్చ అప్రస్తుతం. ఏది ఏమైనప్పటికీ, ఈ ... తమ లక్ష్యసాధనలో భాగంగా తమ తోటి అమాయక గిరిజ ... నక్సలైట్లనో, సానుభూతిపరులనో, మరొకటనో చిత్రహింసలకు ... ప్రతిగా మరోప్రక్క నక్సలైట్లు అదే అమాయకపు ఆదివాసీలను పో ... మరొకటనో భయంకరంగా హింసించడం లేక చంపడం అనేది ... దీంతో వీరిద్దరి మధ్య అమాయకపు ఆదివాసీలు 'అడకత్తె ... నలిగిపోతున్నారు. ఇలాంటి సంఘర్షణలతో అట్టుడుకుతున్నా ర ...



ముఖ్యమైనది. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పరచిన సాయుధ బలగమే సల్వాజుడుం. ఇటువంటి పరిస్థితిలో ఆదివాసీలు కొంతమంది సరిహద్దు ప్రాంతాలకు పారిపోయి తలదాచుకొంటుండగా, మరికొంత మంది తమకు ఇష్టంలేకపోయినా, అక్కడే ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాంపుల్లో తలదాచుకొంటూ, తమ బ్రతుకులు ఎప్పుడు ఎలా ముగిసిపోతాయో తెలియని అయోమయస్థితిలో బ్రతుకుతున్నారు. ఇంకొందరు అదే రాష్ట్రంలో సాల్వాజుడుం దళాలకు, నక్సల్స్‌కు అందనంత దూరంగా అడవుల్లోకి

## ఐ.డి.పి.లకు ఎదురైన తీవ్ర సమస్యలు

- తాత్కాలికంగా ఏర్పరచుకొన్న ఆవాసాల్లో తలదాచుకుంటూ ఎప్పుడు సాల్వాజుడుం కంటిలో పడిపోతామో లేక ఆంధ్రప్రదేశ్ అటవీ అధికారులు లేక పోలీసులకు చిక్కి వెనక్కి పంపివేయ బడతామోనన్న ఉద్రిక్తతలో ఊపిరి బిగబట్టి ఏళ్ల తరబడి దినదినగండంగా బ్రతుకీడ్చాల్సిన పరిస్థితి.
- ఒక్కొక్క ఆవాసంలో 5 నుండి 20 గ్రామాలకు చెందినవారున్నారు. గ్రామాలు, కుటుంబాలు, చెల్లాచెదురై పోయి చెట్టుకొకరు, పుట్టకొకరుగా మిగిలారు.
- వీరంతా ఊరికి, ఊరి జనానికి దూరంగా ఎక్కడో పొలాల వెనుక అడవుల్లో గుడిశెలు వేసుకొని, ఎలాంటి కనీస వసతులు లేకుండా బ్రతకుతున్నారు.
- వీరిని అటవీ అధికార్లు ఆక్రమణదారులుగా, పోలీసులు నక్సలైట్లుగా, స్థానిక ప్రజలు తమ జీవనోపాధికి పోటీదార్లుగా చూస్తూవుంటే, వీరు ముప్పేట దాడిని ఎదుర్కొవలసి వచ్చింది.
- ఈ ఆవాసాల్లో ఎక్కడా ఆనందానికి చోటులేదు. అందరిలో ఒకటే ఆందోళన, విచారం, తమవాళ్ళలో ఎవరు పోయారో, ఎవరు మిగిలారో తెలియని స్థితి.
- ఎక్కడ చూసినా, తీవ్ర ఆహార కొరత, కొన్ని కుటుంబాలు కేవలం అన్నంతో తయారు చేసే నాటుసారా అమ్మగా వచ్చే రూ. 60/–ల రోజువారీ ఆదాయంతోనే కుటుంబమంతా బ్రతకాల్సిన పరిస్థితి.
- వీరి పిల్లలెవరికీ బడి, చదువు లేవు. స్థానిక పాఠశాలలేవీ వీరిని చేర్చుకొనేవి కావు. వీరంతా బీద పొట్టలతో, నరాల సత్తువ లేకుండా తీవ్రమైన పౌష్టికాహార లోపంతో ఉండేవారు. గర్భిణీలు, బాలింతలు పరిస్థితి మరీ దారుణం. వీరికి ఆహారమే కాదు, త్రాగునీరు కూడా కరువే.
- వైద్యం లేదు, డయేరియా, మలేరియా, చర్మవ్యాధులు తీవ్రంగా వ్యాపించాయి. ఆ చలిలో కప్పుకోవడానికి దుప్పట్లు, చివరికి కట్టుకునేందుకు గుడ్డలు కూడా లేవు.
- కొద్దికాలం తరువాత అక్కడక్కడా కొన్ని కుటుంబాలు చెట్టూపుట్టా బాగు చేసుకొని, రాగి, జొన్న, వరి, కూరగాయలు వంటివి పండించుకుంటే, వారిని అడవి నుండి ఖాళీ చేయించాలని అధికారులు ఆ పంటలను తగులబెట్టిన సందర్భాలున్నాయి.
- వలసలు సాధారణంగా ఏదో కొద్దికాలం తరువాత ఆగుతాయి, కానీ ఇక్కడ ఆగలేదు, ఇంకా అలా వస్తూనే వున్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరి కారణాలను వారు చెప్పుకొంటూ, ఎక్కడికక్కడ పరిధులను నిర్ణయించుకొని, దేశపౌరులుగా వీరికి అందించాల్సిన కనీస సహాయాన్ని అందించడానికి, సానుభూతిని చూపడానికి కూడా ప్రయత్నించని పరిస్థితి. చాలా చోట్ల కన్పిస్తుంది. వీరి విషయంలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలు అన్నీ ఇన్నీకావని నిజ నిర్ధారణ, కమిటీలు తేల్చాయి.



**రిజర్వ్‌ఫారెస్ట్‌లో తలదాచుకున్న బాధితులు**

పోయి, "దినదినగండం, నూరేళ్ళ ఆయుష్షు' అన్నట్లుగా బ్రతుకుతున్నారు. ఆదివాసీలు పారిపోయి వచ్చి తలదాచు కొంటున్న సరిహద్దు ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లా కూడా ఒకటి.


సమస్యలను తెలుసుకుంటున్న ఎన్.జి.ఓ. ప్రతినిధులు

నిజానికి మిగిలిన రెండు తరగతుల ఆదివాసీల కన్నా ఇలా సరిహద్దులు దాటి వచ్చేసినవారే ఎక్కువమంది. వీరి సంఖ్య వేలల్లోనే వున్నా, ఖచ్చితంగా చెప్పడం వీలుకాదు. ఎందుకంటే వీరెవరికీ తమ ఉనికిని చాటుకొని, ఆంధ్రప్రదేశ్ పోలీసులకో, అటవీ అధికారులకో చిక్కిపోయి ఇబ్బందులు కొని తెచ్చుకోవడం ఇష్టంలేదు. వారికి ఎదురైన చేదు అనుభవాల వల్ల వీరు బలవంతంగా అజ్ఞాతంలో బ్రతుకుతున్నారు. ఫలితంగా తాత్కాలికంగా ఏర్పరచుకొన్న ఆ ఆవాసాలలో ఏవిధమైన కనీస వసతులులేక తీవ్రబాధలు ఎదుర్కొనడంతో పాటు స్థానిక ఆదివాసీలు, అధికారుల నుండి కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం 2009లో చత్తీజ్‌ఘడ్, జార్ఖండ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాలుల్లో చేపట్టిన "ఆపరేషన్ గ్రీన్ హంట్" మూలంగా లక్షమంది గిరిజనులు వలసలు పోయారని, మరో నలభైవేలమంది ప్రత్యక్షంగా నిర్వాసితులయ్యారని ఒక అంచనా. 2009 నిర్వహించిన ఒక సర్వే ప్రకారం చత్తీజ్‌ఘడ్ నుండి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేసిన అంతర్గత నిర్వాసితులు 20,000 పైగా వున్నారు, మరో 20,000 మంది ప్రభుత్వ రిలీఫ్ క్యాంపుల్లో ఉన్నారు. ఒరిస్సా రాష్ట్రం నుండి కోందులు కూడా ఈ కారణంగానే విశాఖజిల్లాకు వలస వచ్చేసి బ్రతుకుతున్నారు. కోందుల పునరావాసం కొరకు కూడా సంస్థ కొన్నిచర్యలు చేపట్టింది.

**సంస్థ కృషి :** ఈ దేశ పౌరులుగా ఐ.డి.పి.లకు అందించాల్సిన కనీస సహాయం వారికి అందేలా చేసి వారి భయాందోళలను, దుఃఖాన్ని సాధ్యమైనంత మేరకు తగ్గించాలని సంస్థ భావించింది. దేశీయ శరణార్థులుగా మారిన ఈ ఆదివాసీల సమస్యల పరిష్కారంనకు తన వంతు కృషిని ప్రారంభించింది. విద్య, పౌష్టికాహారం, ఆర్యోగం, త్రాగునీటి సౌకర్యాల కల్పన వంటి తక్షణ చర్యలతో పాటు, అటవీ హక్కుల చట్టం ప్రకారం వారు నివశిస్తున్న భూములపై హక్కు, ఇతర ప్రభుత్వ సదుపాయాల అందుబాటుకు, జీవన భద్రతలను కాపాడడం కోసం ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. భారతీయ ఆదివాసీ ప్రజలుగా రాజ్యాంగం వారికిచ్చిన హక్కులను కాపాడాలన్న ధ్యేయంతో ఐ.డి.పి.ల సంక్షేమం కొరకు సంస్థ ప్రత్యేకంగా కొన్ని లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు కృషి చేస్తుంది.



**లక్ష్యాలు :**

★ నిరుపేదలు, అమాయకులైన ఆదివాసీలకు భారత రాజ్యాంగం ప్రసాదించిన కనీస హక్కులకు రక్షణ కల్పించడం, ప్రభుత్వ పథకాలను అందుబాటులోకి తేవడం వీరికి సంబంధించిన మరియు కోర్టులు ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వాలు అమలుపరిచేలా చూడడం.

★ అంతర్గత నిర్వాసితులకు (IDP) సంబంధించి విధానపరంగా మార్పులు తీసుకొని రావడం.

★ గ్రామస్థాయిలో విధాన నిర్ణయాల్లో సామాజికంగా దూరం చేయబడిన లేక బహిష్కరింపబడిన (Excluded) ఈ ప్రజల అభిప్రాయానికి, భాగస్వామ్యానికి తగిన విలువనిచ్చేలా చూడడం.

★ నాట్‌వాన్ సంఘం పరిధిలో కోయలకు, 'ప్రజాచేతన' తో కలసి విశాఖలో కోందులకు రక్షణ కల్పించడం.

★ ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. క్రింద కార్డుల 100 రోజుల పని, ఎఫ్.ఆర్.ఎ. ద్వారా భూమిపై హక్కులు కల్పించడం.

★ వీరి ఆవాసాల్లో ఎఫ్.ఆర్.ఎ. కమిటీ, ఐ.డి.పి. కమిటీ, మేట్ల సంఘాలను ఏర్పాటు చేయడం, అందుకు ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. మరియు ఎఫ్.ఆర్.ఎ. వంటి చట్టాలపై వీరికి అవసరమైన శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం.

★ సామాజికంగా బహిష్కరణకు గురవుతున్న ఆదివాసీల్లో సంఘీభావం పెంపొందించడం మరియు వారికి అనుకూలంగా ప్రభుత్వ విధానాల రూపకల్పనకు అవసరమయ్యే న్యాయసహాయం (Advocacy) బాధితులకు అందించడం.

అక్టోబర్, 2007లో 4 మండలాల్లోని 27 గ్రామాల్లో సంస్థ చేపట్టిన సర్వే మరియు ఇతర మార్గాల ద్వారా తెలిసిన సమాచారం ప్రకారం ఒక్క ఖమ్మం జిల్లాలోనే క్రొత్తగా ఏర్పడిన వలస ఆవాసాలు 200 పైగా వుంటాయని, వీటిలో 50,000 నుండి 60,000 వరకూ జనాభా ఉండే అవకాశం ఉందని తెలియవచ్చింది. ఒక్క భద్రాచలం ఫారెస్టు డివిజన్‌లోనే వేల సంఖ్యలో బాధితులు వున్నారు. ఈ సర్వే ఆధారంగా సంస్థ కొన్ని కార్యక్రమాలు చేపట్టింది. ఎకో (ECHO) మరియు ఐపాప్ (IPAP) రెండు ప్రాజెక్టుల క్రింద వేరు వేరు గ్రామాల్లో ఈ కార్యక్రమాలను సంస్థ చేపట్టింది. మిగిలిన పౌరులందరికీ వర్తించే హక్కులన్నీ సగటు భారతీయ పౌరులుగా ఐ.డి.పి.లకు కూడా వర్తిస్తాయి కాబట్టి ఈ హక్కుల ప్రాతిపదికగానే సంస్థ వీరి సమస్యల పరిష్కారానికి తక్షణ మరియు దీర్ఘకాలిక కార్యక్రమాలు రెండింటినీ చేపట్టింది.



నిజ నిర్ధారణ కమిటీ సమావేశము

కేస్‌స్టడీ - 3

## ఎంత కష్టం ! ఎంత కష్టం !!!



సాల్వాజుడుం దళాలు తమ గ్రామాన్ని తగులబెట్టడంతో ప్రాణాలు కాపాడుకోవడానికి భర్త, కూతురు, అత్తగారితో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మంజిల్లాకు పారిపోయిన వచ్చిన ఒక అభాగ్యురాలు మడివి గంగమ్మ.

ఇలా వలస వచ్చేసిన గంగమ్మ ఇక్కడే బంధువులతో కలిసి బ్రతుకుతూ, పంట కోతల సమయంలో తాము అక్కడ సాగు చేసిన పంటను కోసి తెచ్చుకోవడానికి కుటుంబంతో సహా తిరిగి చత్తీస్‌ఘడ్ వెళ్ళింది. ఎందుకంటే వారికున్న ఒకే ఒక బ్రతుకుతెరువు ఆ తిండిగింజలే కాబట్టి. దురదృష్టవశాత్తు వీరు వెళ్ళిన అదే సమయంలో సాల్వాజుడుం మరోసారి ఆ గ్రామంపై దాడిచేసింది. ఆ సమయంలో అక్కడ ఒంటరిగా నూతిలో నీళ్ళు తోడుతున్న గంగమ్మని వాళ్ళు పట్టుకొన్నారు. ఆమె భర్త, కూతురు ఎలాగో తప్పించుకోగలిగారు. ఈమె ఎంత మొరపెట్టుకున్నా భద్రతాదళాలు ఏమి వినిపించుకోకుండా ఈమెను నక్సలైటుగా అనుమానించి, చత్తీస్‌ఘడ్‌లోని 'బడా' అనే ప్రభుత్వ క్యాంప్‌కు తీసుకుపోయారు.

ఒకటి రెండు రోజుల తరువాత అక్కడినుండి 'కొంటా' పోలీస్‌స్టేషన్‌కు పట్టుకుపోయి, తాము ఆమెను నక్సలైటు క్యాంపులో పట్టుకొన్నామని, ఆమె నక్సలైట్లకు మద్దతుదారుగా పనిచేస్తుందని ఆరోపించారు. గంగమ్మ పోలీసులను ఎంత వేడుకున్నా ఫలితం లేకపోయింది. ఆమెపై ఆరోపణలను పోలీసులు పూర్తిగా నమ్మకపోయినప్పటికీ, ఈమెను విడిచిపెట్టడానికి మాత్రం ఒప్పుకోలేదు. అక్కడి నుండి బలవంతంగా ప్రభుత్వ 'రిలీఫ్ క్యాంప్'కు పంపేసారు.


ఎలాగైనా అక్కడి నుండి తప్పించుకొని ఆంధ్రలోవున్న తన కుటుంబ సభ్యులను, బంధువులను కలవాలని పదే పదే మనసు లాగినా, ఒంటరిగా వెళ్ళడం ఎంతమాత్రం సురక్షితం కాదని భయపడి ఆ సాహసం చెయ్యలేక అక్కడే ఏడుస్తూ పడివుంది. ఆమె పరిస్థితికి క్యాంపులోని ఎస్.పి.ఒ. జాలిపడి, ఆమెకు ఎవరినైనా తోడు ఇచ్చి పంపుతానని చెప్పినా, దారిలో భద్రతాదళాలు చంపేసి, నక్సలైటన్న ముద్ర వేస్తారేమోనన్న భయం, ప్రాణభీతితో అక్కడే ఉండిపోయింది. తరువాత ఎన్నాళ్ళకో ఆంధ్రప్రదేశ్ నుండి గంగమ్మ బంధువు ఒకరు వెతుక్కుంటూ వెళ్ళి ఆమెను కలుసుకున్నాడు, మొత్తం మీద ఇద్దరూ కలిసి తిరిగి వచ్చారు. చివరకు ఆమె తన కుటుంబాన్ని చేరుకోగలిగింది. అయినా ఫలితం ఏముంది? ఆ కుటుంబం ఇక్కడేమి సుఖంగా లేదు, ఎన్నో ఇబ్బందులు పడుతుంది. సరియైన తిండి లేదు, కటిక దారిద్ర్యం, ప్రభుత్వ సేవలు ఏవీ అందుబాటులో లేవు. ఇక్కడ కూడా కేవలం జీవచ్ఛవాలుగా బ్రతుకులీడుస్తున్నారు.

### ఐ.డి.పి.ల కోసం హక్కుల ప్రాతిపదికన సంస్థ చేపట్టిన వివిధ కార్యక్రమాలు

| తక్షణ అవసరాలు | చేపట్టిన కార్యక్రమాలు |
|---|---|
| ఆహార భద్రత మరియు పౌష్టికాహార హక్కు (జీవించే హక్కు) | ★ పౌష్టికాహార సరఫరా కేంద్రాల ఏర్పాటు<br>★ ఆహార (రేషన్) సరఫరా<br>★ త్రాగునీటి వసతికి ఏర్పాట్లు |
| ఆరోగ్య హక్కు | ★ వైద్య శిబిరాలు మరియు సంచార వైద్యశాలల ఏర్పాటు |
| విద్యాహక్కు | ★ పౌష్టికాహార సరఫరా కేంద్రాలతో పాటు విద్యాకేంద్రాల ఏర్పాటు |

| దీర్ఘకాలిక అవసరాలు | చేపట్టిన కార్యక్రమాలు |
|---|---|
| ఐ.డి.పి.లకు కనీస మానవహక్కులు, భూమి పట్టాలు, ఇతర సదుపాయాలు | ★ ఐ.డి.పి. కమిటీ ఏర్పాటు<br>★ కమ్యూనిటీ వర్కర్ల (గ్రామ సేవా కార్యకర్తల) ఏర్పాటు<br>★ ఐ.డి.పి. గ్రామాలకు అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించడం. |
| ఆహారం ముఖ్యంగా పౌష్టికాహారం పొందే హక్కు | ★ సమగ్ర శిశు అభివృద్ధి పథకము అమలుకు కృషి<br>★ నిత్యావసర వస్తువుల సరఫరా కార్డుల (రేషన్ కార్డులు) మంజూరుకు కృషి |
| ఆరోగ్య హక్కు | ★ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ఏర్పాటుకు కృషి<br>★ ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాల కల్పన |
| విద్యాహక్కు | ★ ప్రత్యామ్నాయ బోధనా కేంద్రాల ఏర్పాటు (ALCS)<br>★ రెసిడెన్షియల్ బ్రిడ్జి కోర్స్ సెంటర్స్ (RBCCS) ఏర్పాటుకు కృషి<br>★ ఐ.డి.పిలను సాధారణ పాఠశాలల్లో చేర్పించడం (Main Streaming) |
| జీవన భద్రత మరియు ఆవాసహక్కు | ★ రాష్ట్ర స్థాయి సంఘీభావ కమిటీ,<br>★ గ్రామస్థాయి రక్షణ యంత్రాంగాల ఏర్పాటు<br>★ పునరావాసానికి ఏర్పాట్లు |
| పనిచేసే హక్కు | ★ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు కృషి |

**4.1 తక్షణ సహాయం :** దేశీయ కాందిశీకులు (నిర్వాసితులు) గా ఇక్కడకు వచ్చిన ఆదివాసీ కుటుంబాల వాళ్ళు ఎక్కువ మంది చత్తీస్‌ఘడ్‌లోని దంతెవాడ జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందినవారు. వీరు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని చింతూరు, చెర్ల, బూర్గుంపహాడ్, ములకలపల్లి, మణుగూరు, కుకునూరు మండలాల్లో స్థిరపడ్డారు. గత ఐదు సంవత్సరాలుగా సంస్థ వీరికి అనేక సేవలు అందిస్తుంది. ముందుగా పోలీసు, అటవీ శాఖాధికారుల యొక్క రైడింగు (ఆకస్మిక సోదాలు)ల నుండి తక్షణ విముక్తికి న్యాయసహాయం, ఆ తరువాత తినడానికి తిండి, ఆరోగ్యసేవలు అందిస్తుంది. అలాగే హైదరాబాద్ కేంద్రంగా సంఘీభావ (సోలిడారిటీ) కమిటీ ఒకటి ఏర్పాటు చేసి, దాని ద్వారా రాష్ట్ర/ జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టింది. ప్రభుత్వం పౌరులందరికీ అందించే వివిధ రకాల (ఐ.టి.డి.ఎ., ఐ.సి.డి.ఎస్. రాజీవ్ విద్యా మిషన్) సేవలు వీరికి కూడా అందేలా ప్రయత్నాలు చేస్తుంది. అంతర్గత నిర్వాసితులకు (ఐ.డి.పి.లకు) సంబంధించి మన దేశంలో


సంఘీభావ కమిటి
ఐ.డి.పి. గ్రామాల సందర్శన

ప్రత్యేకించి ఒక జాతీయ విధానమంటూ ఏదీ లేకపోయినప్పటికీ మానవ హక్కుల కమీషన్ మార్గదర్శకత్వంలో, ఆయా ప్రభుత్వ విధానాల్లో వచ్చిన మార్పుల మూలంగా చివరకు మండలస్థాయి అధికారుల్లో కూడా మార్పురాక తప్పలేదు. అలాగే చైల్డ్ రైట్స్ కమీషన్, రాష్ట్రస్థాయి విధానాల్లో కూడా కొంతకాలానికి మార్పులు వచ్చాయి. ఇందుకు అనేక భాగస్వామ్య సంస్థలతో సహృదయులైన ఎందరో స్థానిక అధికారులు సహితం సంస్థకు అండగా నిలిచారు.

**4.2 పౌష్టికాహార సరఫరా :** ఆహార సమస్యవల్ల ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరియు 0-5 సంవత్సరాల మధ్య వయస్సు గల చిన్న పిల్లలు, బాధపడుతున్నారు. దీని పరిష్కారానికి సంస్థ రెండు విధాలుగా ప్రయత్నించింది. ఒకటి ఐ.సి.డి.ఎస్. సేవలు వీరికి కూడా అందేలా చూడడం, రెండు అవి అందుబాటులోలేని 38 ప్రాంతాలలో సంస్థ తానే క్రొత్తగా పౌష్టికాహార సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఈమధ్యనే బడి ఈడు పిల్లలకు చదువు చెప్పడం కూడా ప్రారంభమైంది. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకర్ని పోగొట్టుకున్న పిల్లలు, అనాధపిల్లలు, ఏవిధమైన ఆదాయ మార్గంలేని కుటుంబాలకు చెందిన పిల్లలకు (300 మందికి) నిత్యావసర సరుకులు అందించడం, ఎన్.ఆర్.సి. (NRC) సేవలు కల్పించడం చేస్తుంది. అనారోగ్యం కారణంగా పేద కుటుంబాలకు, వికలాంగులకు, అలాగే పౌష్టికాహార లోపం ఎక్కువగా వుండి, ఐ.సి.డి.ఎస్. కేంద్రాలు అందుబాటులోలేని చాలాచోట్ల పిల్లలకు సంస్థ నేరుగా తిండి గింజలను సరఫరా చేస్తుంది. బలహీనంగా, అనారోగ్యంగా వున్న గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు సత్వర ఉపశమనం కొరకు శనగలు, దుంపలు, పల్లీలు మొదలగు బలమైన ఉడికించిన ఆహారం రోజుకు రెండుసార్లు సరఫరా చేస్తుంది.

**పౌష్టికాహార మరియు పునరావాస కేంద్రం (ఎన్.ఆర్.సి.) :** భద్రాచలం ఐ.టి.డి.ఎ. తీవ్ర పౌష్టికాహాల లోపానికి గురైన పిల్లలు మరియు బాలింతలకు అవసరమైన సేవలను గత 15 సంవత్సరాలుగా అందిస్తుంది. బాధితులు పూర్తిగా తిరిగి కోలుకొనే వరకూ ఈ కేంద్రమునందే ఉంచి, అవసరమైన వైద్యం మరియు బలమైన ఆహారాన్ని ఇది అందిస్తుంది. మామూలు భోజనంతో పోలిస్తే ఇక్కడ 3రెట్లు పౌష్టికాహారం బాధితులకు అందించబడుతుంది. కాకపోతే తీవ్ర పౌష్టికాహార లోపానికి పిల్లలు / తల్లులు కనీసం 7 రోజులకు తగ్గకుండా ఇక్కడ ఉండి వైద్యం మరియు ఆహారం పొందాల్సి ఉంటుంది. ఐ.డి.పి. గ్రామాల్లో పౌష్టికాహార సమస్య చాలా ఎక్కువ ఉన్నప్పటికీ, వీరికి ఈ సేవలు సక్రమంగా అందేవి కావు. ఇందుకు

**పౌష్టికాహార సరఫరా కేంద్రం**



కేస్టడీ - 4

తండ్రి - దేవయ్య, తల్లి - ఐత



దేవయ్య కుటుంబం చత్తీస్‌ఘడ్ నుంచి ఖమ్మం వచ్చి తలదాచుకుంటుంది. అక్కడ 20 ఎకరాల భూమి 30 పశువులు వదలిపెట్టి వచ్చేసిన తరువాత ఇక్కడ వీరు రోజువారీ కూలిచేసుకొంటూ అక్కడక్కడా తలదాచుకొంటున్నారు. తీవ్రమైన కరువును ఎదుర్కొంటున్నారు.

సెప్టెంబరు 23, 2010న ఒక యువ జంట, తన ముగ్గురి మగపిల్లల్ని వెంటబెట్టుకొని ఐ.డి.పి.ల కొరకు సంస్థ నిర్వహిస్తున్న సంచార వైద్య శిబిరం వద్దకు వచ్చింది, అదే దేవయ్య కుటుంబం. తమ మూడవ సంతానం, పదిరోజుల పిల్లవాడు గత 24 గంటలుగా తల్లిపాలు త్రాగడం లేదనే సమస్యతో వచ్చారు. వాళ్ళని చూస్తే, కేవలం ఆ పిల్లవాడే కాకుండా, ఆ తల్లి, మిగిలిన ఇద్దరు పిల్లలు, తండ్రితో సహా అందరూ తీవ్రమైన రక్తహీనత (ఎనిమియా)తో బాధపడుతున్నారని, చాలాకాలంగా వారు సరిగ్గా తిండే తినడం లేదని ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది. కుటుంబమంతా కళ్ళల్లో ఊపిరి పెట్టుకొని బ్రతుకుతుంది. వాళ్ళను పరిశీలించిన వైద్య బృందం, సాధ్యమైనంత త్వరగా క్షణాల మీద వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వైద్యం చేయించడం ఒక్కటే మార్గమని సూచించింది. ఆలస్యం లేకుండా సంస్థ సిబ్బంది వారిని ఒప్పించి, అప్పటికప్పుడే అదే సంచార వైద్య వాహనంలో ఏ మాత్రం భద్రాచలానికి తరలించింది. సాయంత్రానికి వారు ఆసుపత్రికి చేరారు, తల్లికి, ముగ్గురు పిల్లలకి వెంటనే 'ఎనిమియా' నియంత్రణకు వైద్యం ప్రారంభమైంది. ప్రాణగండం నుండి వారు తప్పుకొన్నారు. నాలుగు రోజుల వైద్యం తరువాత, వైద్యుల సలహా మేరకు సంస్థ తల్లిబిడ్డలను భద్రాచలంలోని ఎన్.ఆర్.సి.కి. పంపింది.

– **వెంకటేశ్వర్లు,** క్లస్టర్ కో-ఆర్డినేటర్, ఎ.ఎస్.డి.ఎస్.

కారణం వారి నిర్వాసిత, అమాయకత్వం. స్థానిక సిబ్బందికి వీరు క్రొత్త కావడం, భయం, సమాచారం చెప్పి ప్రోత్సాహించే వారు లేకపోవడం మొదలైనవి. సంస్థ ఈ సందర్భంలో ఇటువంటి వారిని చాలా మందిని గుర్తించి, వారికి ఈ సేవలు అందేటట్లు చేసింది. ఉదాహరణకు గత 3 సం॥లలో ఎన్.ఆర్.సి.కి రిఫర్ చేసిన కేసుల వివరాలను క్రింది పట్టికలో చూడవచ్చు.

| Year | No. of Vil-lages | above 7 days in NRC | below 7days in NRC | కేంద్రంలో చేరేటప్పటి స్థితి | | | | | | | | కేంద్రం నుండి బయటకు వచ్చేటప్పటి స్థితి | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | Normal | | MAM | | SAM | | NA | Total | Normal | | MAM | | SAM | | NA | Total |
| | | | | G | B | G | B | G | B | | | G | B | G | B | G | B | | |
| 2011 | 77 | 274 | 41 | 0 | 2 | 103 | 80 | 65 | 57 | 8 | 315 | 20 | 23 | 106 | 69 | 43 | 32 | 22 | 315 |
| 2012 | 44 | 186 | 15 | 7 | 7 | 10 | 16 | 80 | 81 | 0 | 201 | 11 | 16 | 34 | 43 | 51 | 46 | 0 | 201 |
| 2013 | 17 | 34 | 2 | 0 | 0 | 3 | 2 | 10 | 12 | 0 | 36 | 2 | 1 | 10 | 6 | 10 | 7 | 0 | 36 |

MAM : Moderate Acute Malnutrition, SAM : Severe Acute Malnutrition

**4.3 ఆరోగ్య సదుపాయాలు :** పౌష్టికాహారలోపంతో బాధపడుతున్న పిల్లలను పౌష్టికాహార సరఫరా కేంద్రాలకు (NRC) రిఫర్ చేయడంతో పాటు, అవసరమైన గ్రామాల్లో సంచార ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి, రోగగ్రస్తులకు చికిత్స అందిస్తుంది. అలాగే, చికిత్స పొందుతున్నవారి యోగక్షేమాలు తెలుసుకోవడానికి సంస్థ నుండి ఆరోగ్య కార్యకర్త క్రమం తప్పక వారిని సందర్శిస్తుంటుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా సాధారణ (జనరల్ రిఫరల్) సేవలు, అవసరమైన వారికి ప్రత్యేక రిఫరల్ సేవలు అందించడం ద్వారా వీరి ఆరోగ్య మెరుగుదలకు, అకాల మరణాల నివారణకు సంస్థ కృషి చేస్తుంది. తీవ్రమైన పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను భద్రాచలంలోని ఎన్.ఆర్.సి.కి పంపిస్తుంది. దీనికి సంబంధించిన వ్యవహారాలను చూడడానికి సంస్థ ప్రత్యేకించి ఒక కో-ఆర్డినేటర్‌ను నియమించింది. ఒక అర్హుడైన డాక్టర్, ఇద్దరు నర్సులు మరియు ఒక ఆరోగ్య కార్యకర్తతో కూడిన ఒక సంచార వైద్యబృందం నిరంతరంగా గ్రామాలకు వెళుతుంది. ఆరోగ్య కార్యకర్త ద్వారా రోగులు నిర్దేశిత స్థలాని (శాటిలైట్ విలేజ్) కి తరలించబడతారు. ప్రతీ ఒక్క ఆరోగ్య శిబిరంలోనూ సగటున 60 నుండి 70 మంది చికిత్స పొందుతారు. ఇంతవరకూ మొత్తం, 3617 మంది ఈ శిబిరాల్లో చికిత్స పొందారు.

వీటికి అదనంగా ఆరోగ్య కార్యకర్తలు 385 గ్రామాల్లో ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, కేసులను రిఫర్ చేస్తాడు. మలేరియా వచ్చే అవకాశంవున్న గ్రామాలన్నింటిలో దోమల నివారణకు మందు (వర్షాకాలంలో) చల్లిస్తుంటారు. ఒక ఎన్.జి.ఒ. నెట్‌వర్క్ ద్వారా గత ఐదేళ్ళుగా పిల్లల్లో (2884 మంది) వ్యాధి నిరోధక శక్తి పెంపుదలకు సంస్థ కృషి చేస్తుంది. 20 మంది మహిళలకు రెండు రోజుల పాటు ఆయా (మంత్రసాని) శిక్షణ నిర్వహించింది. శిక్షణ తరువాత వీరు తమ గ్రామాల్లో సురక్షితంగా కాన్పులు చేస్తున్నారు. అలాగే ఎకో (ECHO) ప్రాజెక్టులో పనిచేస్తున్న

కేస్ స్టడీ - 5

### చివరికి చూపు దక్కింది



మడకం రాజు అంతర్గత నిర్వాసిత కుటుంబాలనికి చెందిన 5 సంవత్సరాల పిల్లవాడు. భయంకరమైన, తీవ్రమైన కంటిజబ్బుతో బాధపడుతున్నాడు. ఆ జబ్బుతో అతనికి కంటిచూపు శాశ్వతంగా పోయే పరిస్థితి. కంటిపై ఎండ తగిలితే చాలు కళ్ల ఎరుపు ఎక్కిపోయి, నీళ్ళు కారడం, మంట, చివరకు కనుగ్రుడ్లు పరిమాణం పెరిగిపోయి, బయటకు వచ్చేసి భయంకరంగా కనిపించేవి. వారి కుటుంబానికి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించే స్థోమతలేదు. అలాగని చత్తీజ్‌ఘడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించే అవకాశం వీరికి లేదు. చేసేదిలేక ఆ తీవ్రమైన బాధతో పిల్లవాడ్ని ఇక్కడే (ఆంధ్రలోనే) ఉంచేశారు. అతనికి తోటివారితో కలిసి వుండే అవకాశం కూడా లేకుండా పోయింది. వారెవరూ ఇతన్ని చేరనియ్యడంలేదు. అతని భయంకర ఆకారం అందుకొక కారణం.

2008 సంవత్సరంలో సంస్థ ఆరోగ్య కార్యకర్తకు రాజు దుర్భర పరిస్థితి గూర్చి తెలిసింది. వెంటనే అతన్ని కంటి ఆసుపత్రికి తీసుకొని వెళ్ళగా డాక్టరుగారు పరీక్షించి, తక్షణం శస్త్ర చికిత్స అవసరమని చెప్పారు. ఎల్.వి. ప్రసాద్ ఆసుపత్రిలో అతనికి వైద్యసేవలు కల్పించడానికి, స్థానిక ప్రభుత్వం యొక్క సహాయాన్ని ఎంతో కృషి చేసి సంస్థ సాధించింది. డాక్టర్లు ఆపరేషన్ చేసి, ఆ బాలుని కుడికన్ను తొలగించి, ఎడమకంటికి తగు చికిత్స చేయడం ద్వారా అతని కంటిచూపు కాపాడగలిగారు. సంస్థ అభ్యర్థన వల్ల కొంతమంది దాతలు రూ. 13,500/- ధనసహాయం చేసారు. ప్రభుత్వం వైద్యసేవలు అందించింది. ఆపరేషన్ తదుపరి సంరక్షణ కొరకు ఈ డబ్బును సంస్థ అతని కుటుంబానికి అందించింది. ఒక పసివాడు శాశ్వతంగా అంధుడై ప్రపంచానికి దూరమైపోకుండా (ఒకవేళ ప్రాణాలే కూడా పోయేవేమో!?) కాపాడగలిగామనే సంతృప్తి మిగిలింది. రాజు ఇప్పుడు తోటిపిల్లలతో కలిసి హాయిగా ఆడుకుంటున్నాడు, బడికి వెళుతున్నాడు.

**- సేకరణ : ఎస్.వి.ఎస్. ప్రసాద్**

సిబ్బందితో పాటు కొంతమంది గ్రామస్థులతో సహా మొత్తం 33 మందికి (26 పురుషులు, 7 స్త్రీలు) పౌష్టికాహార ప్రాముఖ్యత, పిల్లల్లో ఎదుగుదలను కొలవగలిగే నైపుణ్యాలపైన సంస్థ రెండురోజుల శిక్షణ ఇచ్చింది. ఈ ఆవాసాల్లో పారిశుద్య మెరుగుదలకు మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఆరోగ్యకరమైన అలవాట్లు, ఆరోగ్యపరమైన జాగ్రత్తలు, రోగనిరోధకశక్తిని కాపాడుకోవడం, సురక్షిత మంచినీరు బాల్యవివాహాల నిర్మూలన వంటి అంశాలపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టింది.

**ఫలితాలు 2008-2012 : మధ్య 211 హెల్త్ క్యాంప్స్ ద్వారా 20,454 రోగులు** (6554 పురుషులు, 10195 స్త్రీలు, 3705 పిల్లలు) **ప్రాథమిక ఆరోగ్య సేవలు పొందారు. వీరిలో 522 పురుషులు, 633 స్త్రీలను సంస్థ తాను ఆసుపత్రులకు పంపింది. అలాగే పిల్లలను 428 మందిని ఆసుపత్రులకు - 1051 మందిని ఎన్.ఆర్.సి.కి రిఫర్ చేసింది.** ప్రత్యేకించి ఈ సంవత్సరం (2013) 175 హెల్త్ క్యాంపులు జరిగాయి. 33 మందికి రిఫరల్ సేవలు అందాయి. 16 మందిని ఎన్.ఆర్.సి.కి పంపడమైంది. 168 మందికి వ్యాధి నిరోధక టీకాలు, 140 మంది గర్భిణీలకు వైద్య సేవలు, 76 మందికి కాన్పు సేవలు అందించడమైంది.

**4.4 విద్యాసౌకర్యాలు :** ఇందుకు సంబంధించి చట్టాలు, సదుపాయాలు, నిబంధనలు కాగితాలపై ఎన్నివున్నా వాటి అమలులో జరిగే అవకతవకలు అందరికీ తెలిసినవే. అందులోనూ నిర్వాసిత పిల్లల పరిస్థితి వేరే చెప్పాలా? ఇవి ఐ.డి.పి.లకు ఎంతమాత్రం అందుబాటులో లేవు. అందుకు ఒక ప్రధాన కారణం నివాస ధృవీకరణ పత్రం. వీరు ఎక్కడో అడవుల్లో ఏ గుర్తింపు లేకుండా ఉంటున్నారు. భాష మరొక సమస్య. ఎక్కువమంది గోండి, కొద్దిమంది ఎవరో హిందీ మాట్లాడతారు. ఎవరికీ తెలుగు రాదు, పైగా వీరిలో ఎక్కువమంది పిల్లలు తమ సొంత రాష్ట్రంలో కూడా స్కూల్స్‌కు వెళ్ళినవారు కాదు. అందుకు వారి వెనుకబాటుతనం, ఎప్పటి నుండో అక్కడ జరుగుతున్న ఈ అల్లర్లు, ఆందోళనలు ముఖ్యకారణం. ఇటువంటి పరిస్థితుల్లో సంస్థ పిల్లలకున్న హక్కులు, చట్టాలు, ఇతర అవకాశాలను ఉపయోగించుకుని, ఒక బలమైన నెట్‌వర్క్ ద్వారా హక్కుల ప్రాతిపదికన, అవసరమైన చోట్ల లీగల్ అడ్వకసీని ఉపయోగించడం లేక అధికార్లతో సంప్రదింపులు జరపడం వంటి పలు వ్యూహాలతో చాలామంది పిల్లలకి విద్యావకాశం కల్పించ గలిగింది.

**ఆర్.బి.సి. స్కూలు పిల్లలు**




**2008-2013 సంవత్సరాల మధ్య విద్యావకాశం పొందిన ఐ.డి.పి. పిల్లల వివరాలు**

| కల్పించిన సదుపాయాలు | కేంద్రాల సంఖ్య | విద్యావకాశం కల్పించబడిన పిల్లలు | మామూలు పాఠశాలల్లో చేర్పించబడిన వారు |
|---|---|---|---|
| పౌష్టికాహార మరియు విద్యాకేంద్రాలు (NEC) | 101 | 2400 | - |
| రెసిడెన్షియల్ బ్రిడ్జి కోర్స్ సెంటర్స్ (RBCC) | 10 | 2100 | 1200 |
| ప్రత్యామ్నాయ పాఠశాలలు (ALC) | 41 | 676 | 111 |

తక్షణ సేవల క్రింద ఐ.డి.పి. పిల్లలు నేరుగా ఎన్.ఇ.సి. కేంద్రాల్లోనే చదువుకొనే అవకాశం కల్పించమని సంస్థ ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. బడిమానివేసిన పిల్లలను ప్రత్యామ్నాయ పాఠశాలలు (ALC) మరియు ఆశ్రమ బడుల (RBCC) లో చేర్పించి కొంత స్థాయి వరకూ విద్యా ప్రమానాలను పెంచి, ఆ తరువాత సాధారణ పాఠశాలల్లో (General Schools) చేర్పించే



స్కూలు పిల్లలకు ఆటపాటలు నేర్పిస్తున్న సంస్థ కార్యకర్త


కార్యక్రమంలో సంస్థ కీలకపాత్ర పోషిస్తుంది. దీనికి సంబంధించి పబ్లిక్ హియరింగుల్లో పాల్గొనడం, టెస్ట్‌మోనీస్ (కేస్ స్టడీస్) సమర్పించడం, మీడియా ద్వారా ప్రచారం, బాధితులతో పెద్ద ఎత్తున దరఖాస్తులు పెట్టించడం మొదలయిన ప్రచార మార్గాలను సంస్థ బాగా ఉపయోగించుకొంటుంది. మొత్తం మీద 4,460 మంది అంతర్గత నిర్వాసిత పిల్లలకు సంస్థ ద్వారా చదువు చేరువైంది.

ఆశ్రమ బడుల్లో చదువుతున్న పిల్లలు ఇంటిపై బెంగపెట్టుకోకుండా, సంస్థ రోజూ కార్యకర్తలను పంపి స్నేహ బృందాలను ఏర్పాటు చేయడం, ఆటలు ఆడించడం, పరామర్శించడం, ఆట వస్తువులను, అలంకార సామగ్రి (Toilet Boxes)ని అందించడం, వారి ఇబ్బందులను అడిగి తెలుసుకోవడం, తిండి, పడక, ఇతర సదుపాయాలు సక్రమంగా ఏర్పాటుచేసేలా చూడడం వంటి అనేక సహాయక సేవలను అందిస్తుంది. అదే ఐ.డి.పి. కమ్యూనిటీకి చెందిన యువతకు శిక్షణను ఇచ్చి, వారిని హాస్టల్స్‌లోని పిల్లలకు ట్యూటర్లుగా నియమిస్తుంది.

**4.5 నివాస హక్కుల రక్షణ :** రాజ్యాంగబద్ధంగా భారతీయ పౌరులందరూ దేశంలో ఎక్కడైనా నివశించే హక్కును కలిగి వున్నప్పటికీ కొంతమంది స్థానిక పోలీసులు/అటవీ అధికారులు వీరిని నక్సలైట్లుగా భావించి, వేధింపులకు గురిచేసేవారు. భౌతికంగా దాడులకు పాల్పడి, వారి ఆవాసాలను తగులబెట్టడం, వస్తువులను దోచుకోవడం, బెదిరించడం ద్వారా వెనక్కి తరిమివేయడానికి ప్రయత్నించారు. సంస్థ దీన్ని అడ్డుకోగలిగింది. ఇందుకు సంస్థ చేసి ప్రయత్నాలలో రాష్ట్రస్థాయి సాలిడారిటీ కమిటీ (సంఘీభావ సంఘం) ఏర్పాటు చేయడం ముఖ్యమైంది. దీనిలో పౌరసంఘాలు, మానవహక్కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యావేత్తలు మొదలగువారు సభ్యులుగా వున్నారు. దీని ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సమస్యను విస్తృతంగా ప్రచారం చేసి, బాధితులకు రక్షణ కల్పించమని, రాజ్యాంగ/పౌరహక్కులను కాపాడమని ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడం జరిగింది. ఫలితంగా వీరి ఆవాసాలపై అధికారుల దాడులు/వేధింపులు క్రమంగా తగ్గాయి. దాడులకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేపట్టడంతో పాటు, మీడియా ద్వారా సమస్యలను ఏకరువు పెట్టి – రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు ఐ.డి.పి. ఆవాసాలను సందర్శించేలా చెయ్యడం ద్వారా బాధితులు తమ ఇబ్బందులను వారి ముందుంచే అవకాశాన్ని సంస్థ వారికి కల్పించేది. సంస్థ సహకారంతో మీడియా ఎన్నో కథనాలను వెలుగులోకి తెచ్చింది.



**4.6 ఆత్మ రక్షణ బృందం :** ఐ.డి.పి. కమ్యూనిటీలు, ఇతరుల దోపిడీ, దూషణలు, వేధింపుల నుండి తమను తాము రక్షించుకోవడానికి సంస్థ వారిలో కొంతమందికి కమ్యూనిటీ వర్కర్లు (CWs) గా శిక్షణనిచ్చింది. ఐ.డి.పి.లకు సంబంధించిన హక్కులు, చట్టాలు, సదుపాయాలు, తీర్పులు మొదలైన విజ్ఞానమంతా వీరికి అందించింది. వీరు ఎక్కడ ఎలాంటి వేధింపులు జరిగినా, వాటిని ఎన్.జి.ఓ.లు, ప్రజలు, ప్రభుత్వం దృష్టికి తెచ్చేవారు. రక్షణ కొరకు డిమాండు చేసేవారు. అవసరమైతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసేవారు. వీరి కృషి మూలంగా పోలీసు, అటవీ అధికార్ల వైఖరిలో చాలా మార్పు వచ్చింది. దీంతో దాడులు / వేధింపులు క్రమేపి తగ్గాయి.



2008లో 146,2009లో 288 వేధింపు సంఘటనలు నమోదైతే, ఇవి 2010 సంవత్సరంలో 137కు, 2011లో 74కు 2012లో మరింత కనిష్టస్థాయికి తగ్గుకుంటూ వచ్చాయి. వీరు ఉంటున్న ఈ ఆవాసాల్లో చాలా ఇళ్ళకు పైకప్పులు లేవు. 15 గ్రామాల్లో దాదాపుగా 400 కుటుంబాలకు సంస్థ "టార్పాలిన్స్" పంచడం ద్వారా వారు తమ తిండిగింజలను, ఇతర విలువైన వస్తువులను దాచుకునేందుకు రక్షణ కల్పించింది.





**4.7 స్థానికంగా విభేదాల పరిష్కారం :** ఐ.డి.పి.లు అటవీశాఖ అధికారులు, పోలీసు సిబ్బందితోనే కాకుండా స్థానిక ఆదివాసీ తెగల నుండి కూడా తరచూ చిక్కులు ఎదుర్కొవలసి వచ్చేది. త్రాగునీరు, ఆరోగ్యసేవలు, ఐ.సి.డి.ఎస్. సేవలు వంటివి పొందటానికి కూడా వీరు ఎంతో ఇబ్బంది పడాల్సి వచ్చేది. గ్రామాల్లో శాంతిభద్రతల (సద్భావన) కమిటీలను ఏర్పరచి, నిర్వాసితుల బాధలను వివిధ సమావేశాల్లో స్థానికులకు వివరించడం ద్వారా శాంతియుతంగా సమస్య పరిష్కారంనకు సంస్థ కృషి చేసింది. 9 మండలాల్లో 125 గ్రామాల్లో 3,243 కుటుంబాలకు ఈ కమిటీలు ఏర్పడ్డాయి. 500 మంది మగవారు, 250 మంది ఆడవారు ఈ కమిటీల్లో సభ్యులుగా చేరారు.

**4.8 ఐ.డి.పి. కమిటీ ఏర్పాటు :** మార్చి 2009లో ఖమ్మం జిల్లాలో వేరువేరు ప్రాంతాల్లో వున్న వివిధ తెగలకు చెందిన నిర్వాసిత సముదాయాల (కమ్యూనిటీస్) మధ్య సంఘీభావం, పరస్పర సహకారం పెంపొందించుట కొరకు నిర్వాసిత ప్రజల కమిటీని ఒకదాన్ని పెద్దలు మరియు యువత కలిపి మొత్తం 157 మందితో సంస్థ ఏర్పాటు చేసింది. (దీనిలో 20 మంది స్త్రీలు కూడా వున్నారు). వీరంతా 24 వేరువేరు కమ్యూనిటీలకు చెందినవారు. వీరందరికీ కలిపి నెలవారీ సమావేశాలు జరుగుతాయి. ఇక్కడ సభ్యులందరూ కలిసి, తమ తమ ఆవాసాల్లో సమస్యలు, వాటి పరిష్కారానికి చేసిన ప్రయత్నాలు, సాధించిన విజయాలు, అందుకు అనుసరించిన వ్యూహాలు, అనుభవాలు పరస్పరం పంచుకొంటారు. అందరూ కలిసి రాబోయే నెలకు ప్రణాళికను రూపొందించు కొంటారు. అవసరమైన చోట్ల అందరూ కలిసికట్టుగా పనిచేయడం, ఒకరివద్ద బాగా పనిచేసిన వ్యూహాన్ని మరోచోట ప్రయోగించడం, వివిధ సముదాయాల మధ్య ఐక్యతను నెలకొల్పుకోవడం వంటి ఎన్నో ప్రయోజనాలకు ఇది వేదిక అయ్యింది. వారికి అధికార్లు నుండి హామిపత్రాలు, రక్షణ పొందుటకు చట్టప్రకారం వారికున్న హక్కులు, అర్హతలను తెలియజెప్పడం, ఆదాయాలను సమకూర్చడం వంటి పనులు, ఇతర న్యాయ సలహా సహకారాలను సంస్థ కమిటీకి అందిస్తుంది.

**4.9 ఉపాధిపనుల కల్పన :** ఖమ్మంజిల్లాలో రోజువారీ కూలిపనులు దొరికే అవకాశం తక్కువ. దొరికినా ఎప్పుడో సీజన్లోనే తప్పా మిగిలిన రోజుల్లో ఉండవు. అందువల్ల ఐ.డి.పి.లు చాలావరకూ ఖాళీగా ఉండాల్సి వచ్చింది. దాంతో వీరికి కనీస అవసరాలకు కూడా డబ్బులు లేవు. రిజర్వు ఫారెస్టు భూముల్లో సాగును అధికార్లు అడ్డుకొంటున్నారు. రేషన్ కార్డులు, ఋణాలు వంటివి ఏవీ అందే అవకాశం లేదు. దాంతో ఎక్కడ చూసినా ముఖ్యంగా స్త్రీలు, పిల్లల్లో అనారోగ్యం, రక్తహీనత, పౌష్టికాహార లోపం, దారిద్ర్యం తాండవిస్తుంది. ఈ సందర్భంలో నైపుణ్యం అవసరంలేని, సాధారణ కూలిపని చేయడానికి సిద్ధంగావున్న కుటుంబాలలోని వయోజనులకు (100 రోజులు) పనిని ఒక్క హక్కుగా కల్పిస్తూ, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన





మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామి హక్కు చట్టాన్ని సంస్థ వీరికి కూడా వర్తింపచేసేలా కృషి చేసింది. ఇందుకు సంబంధించి అధికారులతో మధ్యవర్తిత్వము, సంప్రదింపులు జరిపడం, బాధితులకు ధరఖాస్తులు చేసుకోవడం, నివాస గుర్తింపు పత్రాలు పొందడం మొదలైన వాటిలో అవసరమైన సేవలన్నీంటినీ అందించింది. చాలావరకూ ఫలితం సాధించింది.

సంస్థ ద్వారా 2008–2012 మధ్య 4443 కుటుంబాలు ఎన్.ఆర్.ఇ.జి.ఎ. క్రింద జాబుకార్డులకు ధరఖాస్తు చేసుకోగా, 2698 కుటుంబాలు కార్డులు పొందాయి. వీటిలో 2184 కుటుంబాలు పనిని కూడా పొందాయి.

**4.10 త్రాగునీరు :** ఐ.డి.పి. ఆదివాసీలు ఏర్పరచుకొన్న ఆవాసాలు వేటిలోనూ త్రాగునీరు అందుబాటులో లేదు, ఒకవేళ ఉన్నా అది కలుషితమైన నీరు. దీన్ని ప్రధాన సమస్యగా గుర్తించిన సంస్థ ముందుగా 10 ఆవాసాల్లో 230 కుటుంబాలకు మంచినీరు అందించడానికి నూతులు త్రవ్వించింది.. 81 గ్రామాల్లో, మంచి నీటిపై అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి, నీటి ద్వారా సంక్రమించే వ్యాదులు, నీటి విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై 7954 మందికి అవగాహన కల్పించింది. 30 ఫీడింగ్ (ఆహార సరఫరా) కేంద్రాలకు లైవ్ వాటర్ ఫిల్టర్స్‌ను అందించింది. వాటర్ కంటైనర్స్ ద్వారా రక్షిత మంచినీటి సరఫరాతో పాటు 83 గ్రామాల్లో దాదాపుగా 2000 కుటుంబాలకు పైగా క్లోరిన్ టాబ్లెట్స్‌ను అందించడం ద్వారా, వేల మందికి లబ్ధిని చేకూర్చింది.





**చుక్కలపాడులో త్రవ్వించిన మంచినీటి బావి**

నూతులు, బోర్లు త్రవ్వడానికి మొదట్లో అటవీ అధికార్ల నుండి అడ్డంకులు వచ్చినప్పటికీ చివరకు వారు కూడా అంగీకరించారు. ఆ తరువాత ప్రభుత్వం కూడా వీటిని చేపట్టింది. 2013 నాటికి 154 ఐ.డి.పి. ఆవాసాలకు త్రాగునీరు అందుబాటులోకి రాగా ఇంకా 49 ఆవాసాలకు రావాల్సి వుంది.

**4.11 పథకాలపై శిక్షణా కార్యక్రమాలు :** చత్తీజ్‌ఘడ్ నుండి వలస వచ్చిన బాధితుల్లో ఎక్కువ మంది ఆర్థికంగా బాగా వెనుకబడినవారు. వీరికి తమకు గల రాజ్యాంగపరమైన హక్కులు, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు వేటిపైన అంతగా అవగాహన లేదు, ఒకవేళ ఏదైనా ఒకటి, రెండు విషయాలు తెలిసినా, వాటిని ఎలా పొందాలో, ఎక్కడికి వెళ్ళాలో, ప్రభుత్వ అధికారులను, ఆఫీసులను సంప్రదించడం ఎలాగో ఇవి ఏమీ తెలియవు. కాబట్టి ఎక్కువమంది దేవుడిమీద భారంవేసి ఆ బాధల్లో, దారిద్ర్యంలో అలాగే బ్రతికెయ్యడానికి మొండిగా అలవాడుపడ్డారు. పైగా ఎక్కువమంది నిరక్షరాస్యులు, స్థానిక తెలుగు భాష రాదు, అది మరొక అడ్డంకి. ఇతరులలో పోలిస్తే వీరు ఎంతో వెనుకబడి, కటిక దారిద్ర్యం అనుభవిస్తున్నా, వీరు ఏవిధమైన ప్రభుత్వ సదుపాయాలు, హక్కులు. (ఎన్.ఆర్.ఇ.జి.ఎ. అటవీ హక్కులు, రేషన్ కార్డులు, ఐ.సి.డి.ఎస్. మొదలగున్నవి) అందకుండా ఉన్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో సంస్థ, యాక్షన్ ఎయిడ్ మరియు ఇతర భాగస్వామ్య సంస్థలతో కలిసి వీరి అవగాహనా సామర్థ్యాల పెంపుదలపై దృష్టి పెట్టింది. ఇందుకు అవసరమైన శిక్షణా కార్యక్రమాల (కెపాసిటీ బిల్డింగ్) ను రూపొందించి, అమలు పరచింది. దీనిలో భాగంగా కమ్యూనిటీ వర్కర్ల (CW) కు, ఇతర ఐ.డి.పి.లకు కలిపి ప్రభుత్వ పథకాలను, సేవలను అందిపుచ్చుకొనగలిగే సామర్థ్యాల శిక్షణనిచ్చింది. సంస్థ బాధితులనుండే కొంతమందిని లేక స్థానిక వ్యక్తులను సేవాభావం, చైతన్యం, అవగాహన, బాధితులతో సాన్నిహిత్యం, సానుభూతి, మాటకారితనం (కమ్యూనికేషన్ స్కిల్స్) వంటి అర్హతల ఆధారంగా సి.డబ్ల్యులుగా ఎంపిక చేసింది. యాక్షన్ ఎయిడ్ ఇండియా సిబ్బంది, మానవహక్కులపై పనిచేసే న్యాయవాదులు, సామాజిక శాస్త్రవేత్తలు, సంబంధిత ఇతర నిపుణుల సహకారంతో ఆదివాసీల హక్కులు, చట్టాలు, ప్రభుత్వ విధానాలు, పథకాలు, వాటికి అనుసరించాల్సిన పద్ధతులు వంటి అనేక అంశాలపై సంస్థ వీరికి మంచి శిక్షణ ఇప్పించింది. (2008–2012 మధ్య 33 మంది కమ్యూనిటీ వర్కర్స్ (CWs) శిక్షణా పొందారు. వీరు 11,677 మంది ఐ.డి.పి. (IDP) లకు సమాచారం అందించారు).



శిక్షణ పొందిన ఈ సి.డబ్ల్యులు తిరిగి బాధితులతో పాటు, పోలీసు, అటవీ, రెవిన్యూ అధికారులతో కూడా సమావేశాలు, సదస్సులు, సంప్రదింపులు వంటివి జరిపి వారి మధ్య సృహృద్భావ వాతావరణాన్ని, సత్సంబంధాలను నెలకొల్పగలిగారు. చాలా వరకూ సమస్యలను సంప్రదింపులు ద్వారా పరిష్కారం చెయ్యడంలో, బాధితులకు కనీస సేవలు, హక్కులను కల్పించుటలో సంస్థ విజయం సాధించింది. అలాగే ర్యాలీలు, ఉద్యమాల నుండి పరస్పర అభ్యర్థనలు, సంప్రదింపులు, డిమాండ్ల వరకూ వివిధ వ్యూహాలను అనుసరించడం ద్వారా సంస్థ తన లక్ష్యసాధనకు కృషిచేస్తుంది.

**4.12 తిరుగు ప్రయాణానికి సహాయం :** చత్తీజ్‌ఘడ్ రాష్ట్రంలో గల వారి పూర్వీకుల ఆవాసాలు, ఆస్తులను ఈ అంతర్గత శరణార్ధులకు తిరిగి ఇప్పించి, పునరావాసం కల్పించడమే ఈ సమస్యకు దీర్ఘకాలిక, శాశ్వత పరిష్కారం. కానీ ఆ విధమైన న్యాయపరమైన చర్యలను చేపట్టడానికి ఏ ప్రభుత్వం చొరవ చూపడం లేదు. 2008-2009 మధ్య దంతెవాడ మరియు బీజాపూర్ జిల్లాలకు చెందిన 171 కుటుంబాలు (591 జనాభా) తిరిగి తమ సొంత ఆవాసాలకు వెళ్ళిపోవడానికి సిద్ధపడ్డాయి. ఈ సందర్భంగా సంస్థ వారికి కావలసిన సహాయ సహకారాలన్నింటినీ అందించి, చత్తీజ్‌ఘడ్‌లోని ఎన్.జి.ఓ.ల (సేవా సంస్థల) సహాయంతో వారిని సురక్షితంగా గమ్యం చేర్చింది.




**విశాఖజిల్లా కోందులు :** అంతర్గతంగా నిర్వాసితకు గురియైన మరొక తెగ ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కోందులు. వీరిలో ఎక్కువ మంది విశాఖజిల్లాకు వలస వచ్చారు. విశాఖజిల్లాలో నివశిస్తున్న 21 తెగలలో ఈ కోంద తెగ కూడా ఒకటి. దీన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ఆదిమజాతి తెగ (PTG) గా గుర్తించింది. రాష్ట్రం మొత్తం గిరిజన జనాభాలో వీరు కేవలం 7.6% (36,3654) మాత్రమే ఉన్నారు. ఒరిస్సాలోని కోరాపుట్ ప్రాంతంలో నిర్మించిన జలాశయాలు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులైన వీరు అధిక మొత్తంలో విశాఖకు వలస వచ్చారు. తమ తెగవారు ఇక్కడ వుండడం, సరిహద్దు జిల్లా కావడం ఇందుకు ముఖ్య కారణం. చత్తీజ్‌ఘడ్ ఆదివాసీల్లాగే వీరు కూడా ఇక్కడ ఎన్నో దుర్భర పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చింది. వీరు ఎప్పటి నుండో చాలా కొద్దిప్రాంతంలో అటవీ భూములను సాగు చేసుకొంటున్నారు, కానీ వాటికి వేటికి సెటిల్‌మెంట్ హక్కులు లేవు. వీరిలో ఎక్కువ మంది ఆరోగ్యం, ఆహారం, దుస్తులు వంటి ప్రాథమిక అవసరాల కోసం వడ్డీ వ్యాపారులపై ఆధారపడి వుంటారు. సంస్థ వీరి సమస్యల పరిష్కారం కోసం విశాఖజిల్లాలోని మరొక ఎన్.జి.ఒ. ('ప్రజాచేతన') తో కలసి పనిచేసింది. ఋణగ్రస్థత నుండి విముక్తి, అటవీ హక్కుల సాధన ఈ రెండు ప్రధాన లక్ష్యాలతో పాటు విశాఖ జిల్లాకు అప్పుడే క్రొత్తగా విస్తరింపబడిన జాతీయ ఉపాధిహామి పథకాన్ని వీరికి కూడా వర్తింప చేసేందుకు సంస్థ కృషిచేసింది. ఈ క్రమంలోనే మరొక జిల్లా తూర్పుగోదావరిని కూడా కలుపుకొని, మొత్తం మూడు జిల్లాల్లో అంతర్గత నిర్వాసితులకు అటవీహక్కుల చట్టం, ఎన్.ఆర్.ఇ.జి. చట్టాలను వర్తింపచేసేందుకు ఎన్నో కార్యక్రమాలను సంస్థ చేపట్టింది. **ఖమ్మం, విశాఖ జిల్లాల్లోని రెండు ప్రాంతాల మీద 237 గ్రామాల్లోని - 27,738 మంది అంతర్గత నిర్వాసితులు దీని ద్వారా లబ్ధి పొందారు).**





## 5. బాలల వికాసం (Child Development)

ముందుగా చెప్పుకొన్నట్లు సంస్థ ప్రధాన లక్ష్యాలలో పిల్లల శారీరక, మానసిక వికాసం ఒక కీలకమైన అంశం. కాబట్టే, పిల్లల అభివృద్ధికి సంస్థ అనేక కార్యక్రమాలను చేపట్టింది. పిల్లలో మూడు రకాలైన పిల్లలు ఉన్నారు. 1. సాధారణ పిల్లలు, 2. అంతర్గత నిర్వాసితుల (ఐ.డి.పి.) పిల్లలు, 3. వికలాంగులైన పిల్లలు.

భారతరాజ్యాంగం, నిబంధన 21 (ఎ) దేశంలోని 6–14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధవిద్యను ప్రాథమికహక్కుగా ప్రసాదించింది. అలాగే నిబంధన 46 షెడ్యూల్డ్ కులాల, తెగల మరియు ఇతర బలహీన వర్గాల పిల్లల విద్యాభివృద్ధి రాజ్యం యొక్క విధిగా నిర్దేశిస్తుంది. విద్యాహక్కు చట్టం, 2009 కూడా ఏవిధమైన విచక్షణకు తావులేకుండా పిల్లలందరికీ విద్యావకాశం కల్పించాలని చెబుతుంది. అలాగే సర్వశిక్ష అభియాన్ పథకం బడి బయట పిల్లలను బడిలోనికి చేర్చడంతో పాటు నాణ్యతతో కూడిన చదువు, మౌలిక సదుపాయాల ఏర్పాటు కొరకు కృషి చేస్తుంది. ఇది ప్రత్యామ్నాయ పాఠశాలలు (ALC), బడిమానివేసిన పిల్లలకు ఆశ్రమ పాఠశాలల (RBC) ఏర్పాటుకు కూడా అవకాశం కన్పిస్తుంది. వీటన్నింటినీ అవకాశంగా తీసుకొని సంస్థ తన కార్యక్రమాలను కొనసాగిస్తుంది.

**5.1. పాఠశాల విద్యపై అవగాహన కార్యక్రమాలు :** విద్యాహక్కుపై ప్రచారం ద్వారా దాని అమలు కొరకు సంస్థ గత ఐదు సంవత్సరాల్లో అనేక పద్ధతులలో వివిధ కార్యక్రమాలు చేపట్టింది. గ్రామస్థాయిలో విద్యాహక్కుపై సమావేశాలను, సదస్సులను నిర్వహించి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి విద్యాధికారులను రిసోర్సు పర్సన్స్‌గా ఆహ్వానించి ప్రజల్లో అవగాహన, చైతన్యం పెంపొందించేందుకు ప్రయత్నించింది. అలాగే చట్టం అమలుకు అధికారులపై ఒత్తిడి తేవడం, అవసరమైన చోట్ల వారికి ప్రోత్సహాన్ని అందించడం ద్వారా బాలబాలికలకు చదువును చేరువ చేయడానికి కృషి చేసింది. ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా వాలంటీర్లు, సామాజిక కార్యకర్తలు, క్లస్టర్ కో–ఆర్డినేటర్లు, గ్రామాల్లో యువత, తల్లిదండ్రులు ఇలా వివిధ వర్గాలతో కమిటీలు ఏర్పరచి విద్యాహక్కు అమలుకు వివిధ దశల్లో సలహా సహకార సేవలను



(advocacy services) సంస్థ చేపట్టింది. విద్యాహక్కులపై 21 శిక్షణా కార్యక్రమాలను, 35 గ్రామాల్లో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసింది. ఫలితంగా సంస్థ పనిచేస్తున్న గ్రామాల్లో 96% పిల్లలు పాఠశాలల్లో చేరారు. మధ్యలో బడి మానేసినవారు 95% తిరిగి స్కూల్స్‌కి వెళుతున్నారు.


**5.2. పిల్లలకు నిత్యవసర సామగ్రి (సెల్ఫ్‌హెల్ప్ కిట్లు) సరఫరా :** పాఠశాలలకు వెళుతున్న పిల్లలు పరిశుభ్రంగానూ, ఆరోగ్యవంతంగానూ ఉండాలన్న ఆలోచనతో సంస్థ సెల్ఫ్‌హెల్ప్ కిట్లు స్కూల్స్‌లో పంపిణీ చేయడం ప్రారంభించింది. ప్రభుత్వం గతంలో వసతి గృహాల్లో ఉంటున్న పిల్లలకు నూనెలు, పౌడర్లు వంటి అలంకార వస్తువులు కొన్ని సరఫరా చేసేది. ఇప్పుడది ఎక్కడా అమలు జరగడం లేదు. అందువల్ల పిల్లలకు నిత్యం అవసరమయ్యే కొన్ని వస్తువులను ఒక పెట్టెలో పెట్టి, ప్రతీ ఒక్క విద్యార్థికి అందించడం ద్వారా వారు పరిశుభ్రంగానూ, ఆరోగ్యవంతంగానూ, ఆనందంగానూ ఉండేందుకు సంస్థ ప్రయత్నించింది. ఈ పెట్టెలో చిరిగిన బట్టలు కుట్టుకోవడానికి సూది,దారం, అద్దం, దువ్వెన, బొత్తాలు (గుండీలు), గోళ్ళు కత్తిరించుకునే కట్టర్ మొదలైనవి ఉంటాయి. వీటితో పాటు రకరకాల డ్రాయింగ్ పుస్తకాలు, నోటు పుస్తకాలు ముద్రించి, అన్ని పాఠశాలల్లోనూ పంచింది. దీనివల్ల 25 గ్రామాలకు చెందిన మొత్తం 3,654 మంది పాఠశాల పిల్లలు లబ్ది పొందారు. దాదాపు 35 పాఠశాలలో సంస్థ వాటర్ ఫిల్టర్స్‌ను సరఫరా చేసింది. దీనివల్ల వర్షాకాలంలో వచ్చే నీటి ప్రధాన జబ్బుల సంఖ్య పిల్లల్లో 60శాతం వరకూ తగ్గింది.



**5.3. స్నేహపూర్వక సందర్శనలు :** సంస్థ సిబ్బంది, పాఠశాల సిబ్బందితోనూ (ఉపాధ్యాయులు), పిల్లలతోనూ సత్సంబంధాలు నెలకొల్పుకునేందుకు తరచూ ఆయా పాఠశాలను సందర్శిస్తుంటారు. పిల్లలకు అప్పుడప్పుడు వచ్చే అనారోగ్య సమస్యల్లోను అలాగే ఇతర అత్యవసర పరిస్థితుల్లోనూ వారికి అవసరమైన తక్షణ సహాయం సంస్థ అందిస్తుంది. ఆరోగ్యంనకు సంబంధించి రిఫరల్ సర్వీసెస్‌తో పాటు, ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తుంది. అవసరమైన మందులు సరఫరా చేస్తుంది. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులతో కలసి **'చైల్డ్ పార్లమెంట్'** నిర్వహించి, తన దృష్టికి వచ్చిన సమస్యల నివారణకు ప్రయత్నిస్తుంది. వీటన్నింటి ఫలితంగా ఎంతోమంది డ్రాప్‌అవుట్ పిల్లలు తిరిగి బడులకు వెళుతున్నారు. గ్రామస్థాయి కమిటీలు ఈ విషయంలో కీలకపాత్ర నిర్వహిస్తున్నాయి. ఈ 5సం॥లలో సంస్థ 709 గృహ సందర్శనల (హౌస్ విజిట్స్)ను చేపట్టింది.

**5.4 బడిపిల్లలకు ఆరోగ్య శిబిరాలు :** పాఠశాలలకు వెళుతున్న పిల్లలకు ఆరోగ్య శిబిరాల (హెల్త్‌క్యాంప్స్)ను ఏర్పాటు చేయడాన్ని ఒక కార్యక్రమంగా సంస్థ నిర్వహిస్తుంది. ఈ ప్రాంతాల్లో ఎక్కువమంది పిల్లలు తరచూ బడి మానివేయడానికి అనారోగ్యమే మూలకారణం. (పిల్లల ఆరోగ్య పరిస్థితికి అద్దంపట్టే కేసుస్టడీలు రెండు ఇక్కడ ఇవ్వబడ్డాయి). ఆరోగ్య శిబిరాలను వీటిని రెండుచోట్ల ఒకటి సంస్థ ప్రధాన కేంద్రం రేఖపల్లిలోనూ, క్షేత్రస్థాయిలో ఆయాగ్రామాల్లో ప్రత్యేకించి పాఠశాల పిల్లల కొరకు నిర్వహిస్తుంది. గత సంవత్సరం (2012) రేఖపల్లి కేంద్రంలో 500 మందికి, క్షేత్రస్థాయిలో మొత్తం 29 గ్రామాల్లో 320 మంది పిల్లలకి ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడ్డాయి. వీరిలో కాస్త తీవ్ర సమస్యలతో వున్న పిల్లలను 89 మంది (బాలికలు–46, బాలురు–38) ని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం చేయించడమైంది. ఇద్దర్ని హైదరాబాదు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్ళాల్సి వచ్చింది. నీటి కాలుష్యం వల్ల ఇక్కడ ఎక్కువమంది పంటి జబ్బులతో బాధపడుతున్నట్లు ఈ క్యాంపుల్లో తెలిసింది.



కేస్‌స్టడీ - 6

## నా కొడుకు నాకు దక్కాడు



"క్లస్టర్ కో-ఆర్డినేటర్‌గా నా రోజువారి పనిలో భాగంగా నేనొక రోజు ఒక పాఠశాలను సందర్శించాను. నా పరిశీలనలో రవితేజ అనే కుర్రవాడు గత కొంతకాలంగా స్కూలుకు రావడంలేదని గమనించాను. విద్యా వాలంటీర్‌ను అడిగితే ఒక వారం నుండే ఏదో కారణంచేత బడికి రావడంలేదని చెప్పాడు. హెల్త్‌కార్డు చూస్తే, ఎ.ఎన్.ఎం. దాన్ని చూసినట్లుగానీ, అతని కార్డును నింపినట్లుగానీ కన్పించలేదు. అనుమానం వచ్చి స్థానిక ఎ.ఎన్.ఎం.ను కలిసి, ఆ తరువాత అతని ఇంటికి వెళ్ళాను. పిల్లవాడు చాలా దీనంగా మంచం మీద పడివున్నాడు. రక్తంలేక పాలిపోయి, కాళ్ళు చేతులు పీక్కుపోయి కళ్ళల్లో ఊపిరి పెట్టుకొని ఉన్నాడు. ఒళ్ళంతా జ్వరంతో కాలిపోతుంది. అతని తల్లిని అడిగి కథంతా తెలుసుకున్నాను.

రవితేజ వయస్సు 9 సంవత్సరాలు, ఆశ్రమ పాఠశాలలో 3 వ తరగతి చదువుతున్నాడు. కోయతెగకు చెందిన సోడి రాజారావు, ఆదిలక్ష్మిల రెండవ సంతానం. వీరిది మొద్దులగూడెం గ్రామం. వీరి ప్రధాన జీవనాధారం వ్యవసాయం మరియు కూలి. మెట్ట వ్యవసాయం 4 ఎకరాలు వుంది. దీనిలో పండింది తిండి గింజలకు పోనూ కొద్దిగా మిగిలితే అమ్ముకుంటారు. ఖాళీ రోజుల్లో కూలికి వెళతారు. మొత్తం మీద వీరి ఆదాయం సంవత్సరానికి రూ. 15,000/- లోపే. ఇటువంటి పరిస్థితిలో రవితేజకు అకస్మాత్తుగా ఏదో జబ్బు చేసింది. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళితే ఏవో పరీక్షలు చేసి, ఇక్కడ కుదరదు తీసుకుపొమ్మన్నారు. తప్పనిసరియై వీరు ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ రక్తమార్పిడి చేసి 4 రోజులు చికిత్స కొనసాగించారు. ఆ తరువాత బిల్లు కట్టుకునే స్థోమత వీరికి లేదని గ్రహించి షరామామూలుగానే ఏవో కొద్దిగా మందులు ఇచ్చి, వాటిని వాడుతుండమని ఇంటికి పంపేసారు. అప్పటినుండి తల్లిదండ్రులు ఇంటి దగ్గరే ఏదో తమకు చేతనైన వైద్యం చేయిస్తున్నారు. జబ్బు ఏమీ తగ్గలేదు సరికదా, ఇంకా ఎక్కువైపోయింది. ఇదీ జరిగిన కథని తెలిసింది.

రవితేజకు సరియైన వైద్యం అందించి, ఎలాగైనా అతన్ని బ్రతికించాలనిపించింది. విషయం వెంటనే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌కు తెలియజేసాను. పిల్లవాడ్ని రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (PHC) తీసుకుని వెళ్ళడానికి ఆయన కావలసిన ఏర్పాట్లు చేసారు. అక్కడ డాక్టరుగారు పరీక్షచేసి, ఇతనికి వెంటనే రక్తం ఎక్కించాలి, ఆ తరువాతే మందులు వేయాలి, లేదంటే మందుల పవర్ తట్టుకోలేడు. ప్రమాదం ఇంకా ఎక్కువ అవుతుందని చెప్పారు. దాంతో భద్రాచలం తీసుకొనిపోయి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి, అవసరమైన రక్తాన్ని ఎక్కించడంతో పాటు కొద్దిరోజులు అక్కడ వుంచి చికిత్స చేయించాము. వారు ఆసుపత్రిలో వున్నంతకాలం సంస్థ నుండి ఎవరో ఒకరు వెళ్ళి పరామర్శిస్తూ, అవసరమైన సహాయం అందించాము. కొద్ది రోజులకు జబ్బు పూర్తిగా నయం అయ్యింది.

**"బాబూ! మీ సంస్థ వచ్చి ఆదుకొనకపోతే మా పిల్లవాడు మాకు దక్కేవాడు కాదు, మీ దయతో నా కొడుకు నాకు దక్కాడు, మీ ఋణం తీర్చుకోలేము"** అంటూ ఆ తల్లి కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ఇప్పుడు రవితేజ రోజు బడికి వెళ్ళి చక్కగా చదువుకొంటున్నాడు. రవిని చూస్తున్నప్పుడల్లా నాకు కూడా ఎంతో ఆనందంగా ఉంటుంది.

– **వెంకటేశ్వర్లు,** క్లస్టర్ కో-ఆర్డినేటర్, ఎ.ఎస్.డి.ఎస్.



స్పాన్సర్‌షిప్ పిల్లలు




పిల్లలకు వైద్య శిబిరం

**5.5 స్పాన్సర్‌షిప్ ప్రోగ్రాం :** సంస్థచే గుర్తించబడిన కొంతమంది పిల్లలను యాక్షన్ ఎయిడ్ సంస్థ దత్తత (Sponsor) చేసుకొని వారికి అవసరమైన సహాయాన్ని నేరుగా అందిస్తుంది. వీరికి అందించే ఆర్థిక సహాయాన్ని సంస్థ నేరుగా పిల్లలకు పంచిపెట్టడం కాకుండా ఆ కమ్యూనిటీకి (తల్లిదండ్రులకు / కుటుంబాలకు) ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడానికి ఉపయోగిస్తుంది. ఇందుకు అవసరమైన నిధులను అది విదేశాల్లోని కొంత మంది సాధారణ ప్రజలు, ఉద్యోగస్థుల నుండి నిర్దిష్ట మొత్తంలో నెలవారీ విరాళాల ద్వారా సేకరిస్తుంది. సంస్థ ద్వారా దత్తత చేసుకోబడిన పిల్లలు దాదాపుగా 700 వరకూ ఉన్నారు. సంస్థకు, దాతలకు మధ్య యాక్షన్ ఎయిడ్ సంధానకర్తగా వ్యవహరిస్తుంది. సంస్థ తాను చేపట్టే ఈ కార్యక్రమాలను గూర్చి ఎప్పటికప్పుడు దాతలకు ఉత్తర ప్రత్యుత్తరాల రూపంలో తెలియపరుస్తూ ఉంటుంది. అలాగే దాతలకు, పిల్లలకు మధ్య పరస్పర సంబంధాలు నెలకొల్పడానికి సంధానకర్తగా వివిధ కార్యక్రమాలను రూపొందిస్తుంది.

పిల్లల విద్యాకేంద్రాలు




**ప్రయోజన విద్యా కార్యక్రమం :** మూడు ప్రధాన ఉద్దేశ్యాలతో సంస్థ పాఠశాల విద్యా కార్యక్రమంలో మొక్కల పెంపకాన్ని ఒక భాగం చేసింది. 1. ఆదాయానిచ్చే, అంతరించిపోయే ప్రమాదమున్న చెట్లు సంరక్షణ మరియు పునరుద్దరణ. 2. రసాయిన రహిత వ్యవసాయ పద్దతులను పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా చూపించడం. 3. కూరగాయ తోటల పెంపకంను ప్రోత్సహించడానికి హాస్టల్స్ మరియు పాఠశాల పిల్లలకు విత్తనాల పంపిణి. వివిధ కారణాల రీత్యా అటవీప్రాంతం ముఖ్యంగా ఫలసాయాన్ని ఇచ్చే మొక్కలు అంతరించి పోవడాన్ని గమనించిన సంస్థ మొక్కల పెంపకాన్ని చేపట్టింది. భవిష్యత్తులో ఆదివాసీలకు కొంత నిఖర ఆదాయాన్ని కూడా సమకూర్చగలిగే మొక్కల పెంపకానికి పూనుకొని, అందుకు అవసరమైన అంట్లు సరఫరా మొదలు పెట్టింది. మామిడి, చింత, నిమ్మ, మునగ మొక్కలతో పాటు, గమ్‌కరయా మొక్కలను దాదాపుగా 300 కుటుంబాలకు పంపిణీ చేసింది. గమ్‌కరయా 10 సం॥లకు మిగిలినవి 3 సం॥లకు ఫలసాయాన్ని ఇస్తాయి. ఒక్కొక్క గమ్‌కరయా చెట్టు నుండి సీజన్ నాలుగు నెలల మీద కలిపి రూ. 2500/- నుండి 3000/- వరకూ సంపాదించవచ్చు. అశాస్త్రీయమైన జిగురు సేకరణ పద్దతులు అవలంబించడం మరియు ఇతర కారణాల వల్ల అడవిలో ఇవి దాదాపు అంతరించే దశకు వచ్చాయి. ఈ మొక్కల పెంపకంలో పాఠశాల పిల్లలను భాగస్వాములను చేయడం ద్వారా సంస్థ మంచి ఫలితాలు సాధించింది.




కేస్‌స్టడీ - 7

## ఇదీ నా కథ



మా ఊరు ఒక మారుమూల గిరిజన గ్రామమైన చిన్న ఆర్లగూడెం, దుమ్ముగూడెం మండలం, ఖమ్మం జిల్లా. ప్రస్తుతం ఇంట్లో అమ్మ, నాన్న, అన్నయ్య, పెద్దక్క, చిన్నక్క, నేను, తమ్ముడు ఉంటాం. అమ్మ, నాన్న, అన్నయ్య వ్యవసాయం చేస్తారు. పెద్దక్క ఆశ్రమపాఠశాలలో బట్టలు కుడుతుంది. చిన్నక్క స్కూల్ టీచర్‌గా పని చేస్తుంది. తమ్ముడు డిగ్రీ చదువుతూ, చదువుతో పాటు బ్యాంకులో 'లోను' (ఋణం) తీసుకొని ఆటో, సౌండ్ సిస్టమ్ కొనుక్కొని అద్దెకిస్తున్నాడు.

ఇక నా కథ విషయానికొస్తే, నాతో పాటే, నాకొక జబ్బు కూడా పుట్టింది. ఆ చిన్న వయస్సులో జబ్బుతో బాధపడుతున్న నన్ను అమ్మ, నాన్న ఆసుపత్రికి తీసుకొని వెళ్ళి వైద్యం చేయించారు. అప్పటికి తగ్గినట్లు అనిపించింది కానీ, అది తగ్గలేదు సరికదా, నాతో పాటే అది కూడా పెరుగుతూ వచ్చింది. 1 నుండి 4వ తరగతి వరకు మంచిగానే చదివాను. 5వ తరగతిలో అడుగుపెట్టాను. రోజురోజుకు నీరసం, కళ్ళు తిరగటం, తలనొప్పి, తల వెనుకప్రక్క నరాల తీపులు, నొప్పులు ఎక్కువై పోయాయి, చదవడం మానేసాను. రాను రాను నడవడం కూడా కష్టమైంది. ఇంట్లో ఒక మంచంలో పడుకొని ఉన్నాను. ఏమి జరుగుతుందో నాకు తెలియడం లేదు. లేచి కూర్చుందామంటే కళ్ళు తిరుగుతున్నాయి. తలనొప్పిగా ఉంటుంది. అమ్మతో ఎలాగైనా నేను కూడా బడికి వెళ్ళి అందరిలా చదువుకొంటానని చెప్పాను. అమ్మ నన్ను ఒక చిన్న ఆసుపత్రికి తీసుకెళ్ళింది, ఫలితం లేదు. దేవారుల (మంత్రగాళ్ళు / పూజార్లు) దగ్గరకు కూడా తీసుకువెళ్ళింది, అయినా నా బాధ తగ్గడం లేదు. అలా రెండు సంవత్సరాలు మంచంలోనే గడిచింది. అందరూ చదువుతున్నారు నేను తప్ప.

అమ్మ నాకు చదువుకోవాలని వుంది, బడికి వెళతాను, నన్ను ఎలాగైనా బడిలో చేర్పించమని బలవంతం చేశాను. అమ్మ నన్ను బడికి తీసుకొని వెళ్ళి, పాఠశాల హెచ్.ఎమ్ (ప్రధానోపాధ్యాయులు) శర్మగార్ని కలిసింది. నా కథంతా తెలుసుకున్న సారు "సరేనమ్మా 5,6 చదవకుండా ప్రైవేట్‌గా ఒకేసారి 7వ తరగతి పరీక్షలు రాద్దువు" అని చెప్పారు. సరే అని 7వ తరగతి ఏదోల చదివి పరీక్ష వ్రాసి సెకండ్‌క్లాసులో (338 మార్కులతో) పాస్ అయ్యాను. 8వ తరగతి లక్ష్మీనగర్ ఆశ్రమ పాఠశాలలో చేరాను. పాఠశాలలో చేరానేగానీ, ఆ రెండు నెలలు కూడా బడి మానేసి ఆసుపత్రి చుట్టూ తిరగడమే జరిగింది. అనారోగ్యం ఎక్కువ అయ్యింది. మళ్ళీ చదవడం మానేశాను. తరువాత సంవత్సరం 2003లో తిరిగి శర్మ సారు దగ్గరకి వెళ్ళాను. విషయమంతా సారుతో చెప్పి ఇంటి దగ్గర నుండి రోజూ మీ స్కూల్ (అబ్బాయిల బడి)కి వస్తానంటే ఆయన సరేనన్నారు. 2003 నుండి 2006 మధ్య ఆ ఆశ్రమ పాఠశాలలోనే, అనారోగ్యంతో బాధపడుతూనే పదోతరగతి కూడా పూర్తి చేశాను, 348 మార్కులతో పాస్ అయ్యాను.

ఇంటరు గురుకుల పాఠశాలలో సీట్ వచ్చింది. హాస్టల్లో నెలరోజులు ఉన్నాను. మళ్ళీ కథ మామూలే. అదే అనారోగ్యం. అమ్మకి కబురు పంపాను. అమ్మ వచ్చి ఇంటికి తీసుకు వచ్చేసింది. తిరిగి ఇంట్లో మంచం పాలయ్యాను. డాక్టర్లు చూస్తే జబ్బు ఏమీ లేదంటారు. మానసికంగా ఏదో ఆందోళన పడుతున్నావంటారు. నాకా పుస్తకం చూస్తే కళ్ళ వెంట నీళ్ళు, నరాలపోట్లు, భూమి తిరిగిపోయినట్లు, కళ్ళు ఊడిపోతున్నట్లు ఉంటుంది ఏమిటో తెలీదు. అమ్మా! నాకే ఎందుకు ఈ జబ్బు వచ్చింది, తట్టుకోలేకపోతున్నాను, ఎందుకు ఇలా జరుగుతుంది, నాకు చచ్చిపోవాలని వుంది, నన్ను చంపెయ్యమని ఏడ్చేదాన్ని. కొన్నాళ్ళ పాటు ఇంట్లోనే మంచంలో పడుకొని ఉన్నాను.

ఇంతలో ఒక రోజు భద్రాచలం నుండి ఒక అన్నయ్య మా ఊరుకి ఏదో పనిమీద వచ్చాడు. ఆయన మా ఇంటికి వచ్చి అమ్మతో మాట్లాడుతూ నన్ను చూసి, మీ అమ్మాయికి ఏమయిందని అడిగారు. అమ్మ కథంతా చెప్పింది. నా దగ్గరకు వచ్చి, నన్ను పలకరించాడు. తన పేరు వేణుగోపాలరావని, తనది భద్రాచలం అని చెప్పి, నా అనారోగ్యం గూర్చి అడిగారు. "అన్నయ్యా! మంచం నుండి లేచి నిల్చుదామంటే కళ్ళు తిరుగుతున్నాయి. తల, నరాల తీపులు వస్తున్నాయి. తలనొప్పి, నీరసంగా ఉంటుంది. చదువు కోలేకపోతున్నాను" అన్నాను. "నిన్ను నేను ఆసుపత్రికి తీసుకువెళతాను వస్తావా?" అని అడిగారు. సరే అన్నాను. కొత్తగూడెం నరాల డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళారు. డాక్టర్‌గారు నా సమస్యలన్నీ అడిగి తెలుసుకొని వైద్యం మొదలుపెట్టారు. 2007లో భద్రాచలంలో అద్దె ఇంట్లో ఉంటూ, వైద్యం పొందాను. పెద్దక్క నాతో పాటే ఉండి, నాకు సేవలు చేస్తూ ఎస్.టి. హాస్టల్లో బట్టలు కుట్టడానికి వెళ్ళేది. కొత్తగూడెం, ఖమ్మం, ఖమ్మం నుండి హైద్రాబాద్ ఇలా వైద్యం కోసం తిరుగుతూనే ఓపెన్ యూనివర్శిటీలో డిగ్రీ ఎంట్రన్స్ పాసయ్యి డిగ్రీ పూర్తి చేశాను. 2010 నుండి 2012 మధ్యలో నర్సింగ్ కూడా చదివాను. ఇటువంటి పరిస్థితిలో 2011లో మా ప్రాంతంలో పనిచేస్తున్న **ఎ.ఎస్.డి.ఎస్.** సంస్థ నా గురించి తెలుసుకొని నాకు కావలసిన వైద్య సహాయంతో పాటు, జీవనోపాధి కొరకు చిన్న ఆర్లగూడెం గ్రామంలో వాటర్ షెడ్ ప్రాజెక్టులో పని కూడా ఇప్పించింది. దాంతో ఎమ్.ఎ. ఎంట్రన్స్ కూడా వ్రాశాను. దీనికి హైద్రాబాద్ వెళ్ళాలి, కాని అమ్మ, నాన్న హైదరాబాద్‌లో చదువంటే ఒప్పుకోలేదు. అందుకే తిరిగి అదే వాటర్‌షెడ్ ప్రోగ్రాంలో 4 నెలలు పని చేసి, రెండునెలలుగా ఖాళీగా ఉన్నాను. ఒక వారం క్రితం తిరిగి ఇదే సంస్థ (ఎ.ఎస్.డి.ఎస్.) నిర్వాహకులు పిలిచి ఉద్యోగం ఇచ్చారు.

ప్రస్తుతం నా అనారోగ్యం గతంలో కంటే కొంత మెరుగైనా పూర్తిగా తగ్గిందని చెప్పలేను. పుట్టినప్పటి నుండీ నేను ఇలా దానితో పోరాడుతూనే ఉన్నాను. ఎంత బాధ వచ్చినా నా చదువును కొనసాగించాను. కుటుంబసభ్యుల దగ్గర నుండి స్కూల్ టీచర్లు, స్నేహితులు, ఎ.ఎస్.డి.ఎస్. సంస్థ వరకు నా ఈ పోరాటంలో ఎందరో సహాయం చేస్తూ వచ్చారు. వారందరికీ ధన్యవాదములు. భవిష్యత్తులో నేను కూడా నా తోటి ఆదివాసీలకు ఈ సంస్థ ద్వారా నాకు చేతనైన సాయం చెయ్యాలన్నది నా కోరిక. ఇదీ నా గాథ. ఓపిగ్గా చదివినందుకు మీకు నా కృతజ్ఞతలు.

**– మర్మం లక్ష్మీదేవి**



## 6. వికలాంగుల సంక్షేమం (Welfare of the Disabled People)

నేరుగా గ్రామ స్థాయిలో చేపడుతున్న దీర్ఘకాలిక కార్యక్రమాల్లో ఇది ఒకటి. మొత్తం మూడు మండలాలకు చెందిన 13 పంచాయితీల్లో 35 గ్రామాల్లో నివశిస్తున్న 635 కొండరెడ్డి, 2,846 కోయ తెగల కుటుంబాల్లోని వికలాంగులందరికీ ఈ కార్యక్రమం క్రింద సంస్థ సేవలు అందించింది. సంస్థ గ్రామాల వారీగా ప్రాథమిక సర్వే జరిపి, ఈ 35 గ్రామాల నుండి వివిధ రకాల వికలాంగులను 341 (198 పు॥ 143 స్త్రీలు) మందిని గుర్తించింది. వారందరితో సమావేశాలను నిర్వహించి, వారి వారి సమస్యలను గుర్తించింది. ముఖ్యంగా ప్రభుత్వ పథకాల అందుబాటు, ధృవీకరణ పత్రాలు, రాయితీలు, ఉపాధి అవకాశాలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా గుర్తించబడ్డాయి. వీటి పరిష్కారంనకు అనుగుణంగా కార్యక్రమాల రూపకల్పన జరుగుతుంది.

**6.1 వికలాంగుల వివాహాలు :** వికలాంగుల విషయంలో సమాజంలోవున్న (ముఖ్యంగా వైవాహిక జీవితం, లైంగిక అవసరాలు) అపోహలను పోగొట్టడానికి, వారి అవసరాలను కుటుంబసభ్యులతో సహా తోటి సమాజం గుర్తించేటట్లు అవగాహన కార్యక్రమాలు, ప్రచార సదస్సులను సంస్థ ఏర్పాటు చేస్తుంది. తిరుమల తిరుపతి దేవస్థాన కార్యక్రమం "కళ్యాణమస్తు" లో భాగంగా 9 మంది వికలాంగులకు వివాహ ఏర్పాట్లు చేయడంతో పాటు వివాహ నమోదు అధికారి, మండల రెవిన్యూ అధికార్ల సహకారంతో వారికి సర్టిఫికెట్స్ ఇప్పించింది.

**6.2 వికలాంగులకు ఎన్.ఆర్.ఇ.జి.ఎస్.:** మహాత్మాగాంధీ ఉపాధిహామి పథకం అమలు కొరకు చేపట్టిన ప్రచార కార్యక్రమం సందర్భంగా జాబుకార్డులులేని వికలాంగులు 188 మంది గుర్తించబడ్డారు. వీరందరికీ చట్టంపై అవగాహన కల్పించి, వీరందరిచే దరఖాస్తులు చేయించగా 2010 డిశంబరు 3న ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా 142 కార్డులు మంజూరు అయ్యాయి. వీరితో వికలాంగుల శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేయడం జరిగింది. విషయాన్ని ఎ.పి.ఒ. ఇతర అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి, చట్టం ప్రకారం వీరికున్న ప్రత్యేక సదుపాయాలతో పాటుగా, వీరికి అనుకూలమైన, చేయదగిన పనులను గుర్తించి, మంజూరు చేయించడంలో అవసరమైన కృషి, సలహాలు, సేవలన్నింటినీ సంస్థ అందించింది. ఫలితంగా ఈ ప్రాంతంలోని వికలాంగులు చాలా మంది చట్టం క్రింద వున్న ప్రయోజనాలను పొందగలుగుతున్నారు.




**6.3 జీవనోపాధి కల్పన :** బడుగు, బలహీన సముదాయాలకు బ్రతుకుతెరువు మార్గాలను మెరుగుపరచడం ద్వారా వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దడం సంస్థ ముఖ్య ఉద్దేశ్యాల్లో ఒకటి. ఇందులో భాగంగా డి.ఐ.ప్రాజెక్టు నిధులతో 15 మంది వికలాంగులను ఎంపిక చేసి, వారికి ఋణసహాయం అందించింది. వీరిలో ఎక్కువమంది మేకలను కొనుక్కొని మేపుకొంటున్నారు.

**6.4 వైద్యసహాయం (శస్త్ర చికిత్సలు) :** వికలాంగులకు సంబంధించిన ప్రాథమిక సమాచార సేకరణ కొరకు చేపట్టిన అధ్యయనం ద్వారా ఆపరేషన్లు అవసరమైన పిల్లలను గుర్తించి, వారికి తగు సేవలను అందించింది. ఒక ప్రాజెక్టు క్రింద 21 మంది పిల్లలకు అవసరమైన శస్త్రచికిత్సలు చేయించడం వల్ల వారంతా ఇప్పుడు మామూలు పిల్లల్లాగా అన్నిపనులను సొంతంగా చేసుకొన గలుగుతున్నారు. వీరందరికీ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్య సేవలను అందించడం ద్వారా వారి తల్లి దండ్రులపై ఆర్థిక భారం పడకుండా జాగ్రత్తలు తీసుకొంది, తిండి, దారి ఖర్చులు మొదలైనవి సంస్థ భరించింది. పిల్లలతో పాటు పెద్ద వయస్సు వారికి కూడా ఆపరేషన్లతో పాటు కృత్రిమ అవయవాలను కూడా అందిస్తుంది.



**6.5 ఇతర సహాయక కార్యక్రమాలు :** మెడికల్ సర్టిఫికెట్స్, బస్సు & రైలుపాస్‌లు,ఉపకారవేతనాలు, పి.డి.ఎస్. సహాయక సాధనాలు (పరికరాలు / పనిముట్లు) పంపిణీ శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు (NREGS)

ప్రత్యేక నైపుణ్యాలు గల వారిని గుర్తించి, ప్రోత్సహించడం, ప్రతినెల మండల స్థాయి సమావేశాలు, ప్రతి సంవత్సరం వికలాంగుల దినోత్సవం జరపడం వంటి ఇతర అనేక కార్యక్రమాలను సంస్థ చేపడుతుంది. గత రెండు సంవత్సరాలలో చేపట్టిన వివిధ కార్యక్రమాల వివరాలను క్రింది పట్టికలో చూడవచ్చు.



కేస్‌స్టడీ - 8

## "సంస్థ దయవల్ల మా అమ్మాయి చూడగలుగుతుంది"

"యాక్షన్ ఎయిడ్ అంటే ఏమిటో, ఎ.ఎస్.డి.ఎస్. ఏమి చేస్తుందో మా అమ్మాయే లేకపోతే మాకు తెలిసుండేది కాదు, ఏది ఏమైనా వారి సహాయానికి మా జీవితాంతం వారికి ఋణపడి ఉంటాము" అంటున్నారు మడకం కన్నయ్య.



29 ఏళ్ళ కన్నయ్య, 24 ఏళ్ళ రాములమ్మ గతేడాదే (2012) ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. కన్నయ్య అంధుడు. రేపాక గ్రామానికి చెందిన ఈ కోయ దంపతులకు వ్యవసాయ కూలే ముఖ్య బ్రతుకు తెరువు. వీరికి ఈ సంవత్సరం జనవరి 2న ఒక పాప పుట్టింది. పుట్టుకతోనే చూపులో తేడా కన్పించింది. అప్పుడప్పుడు కనుగ్రుడ్లు వాతంతట అవే తిరిగిపోతున్నాయి. చుట్టుప్రక్కల వాళ్ళు చూసి, ఇది వారసత్వంగా వచ్చిన గ్రుడ్డితనమని, పిల్ల ఇక చూడలేదని అన్నారు. భార్యభర్తలు ఇద్దరూ ఎంతో బాధపడి, ఏమి చెయ్యాలో తెలియక కొంతకాలం మౌనంగా వుండిపోయారు.

కొద్ది రోజుల తరువాత కన్నయ్య సంస్థ ఏర్పాటుచేసిన వికలాంగుల గుర్తింపు క్యాంపునకు సర్టిఫికేట్ నిమిత్తం, భార్యాబిడ్డలను వెంటపెట్టుకొని వచ్చాడు. కన్నయ్యను పరీక్షించిన కళ్ళ డాక్టరు, అతను నూటికి నూరు శాతం అంధుడని, సర్టిఫికేట్ ఇవ్వవచ్చని చెప్పారు. తరువాత అతని కూతురు సాయిలక్ష్మిని పరీక్షించి, పాపకు 6నెలల లోపల ఆపరేషన్ చేస్తే చూపు వచ్చే అవకాశం వుందని, ఆలస్యం చేస్తే శాశ్వతంగా చూపుపోయే ప్రమాదం వుందని చెప్పారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేయడానికి ఉన్న అవకాశాన్ని గూర్చి డాక్టరు ద్వారా సంస్థ కార్యదర్శి తెలుసుకున్నారు.

వెంటనే సంస్థ పూనుకొని, తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి, ఒప్పించి యాక్షన్ ఎయిడ్ సపోర్టుతో దారి ఖర్చులకు, మందులకు, ఉండడానికి, తినడానికి ఏర్పాట్లు చేయడమే కాకుండా వెంట మనిషినిచ్చి హైదరాబాదుకు పంపింది. అక్కడ పరీక్షలన్నీ పూర్తి అయిన తరువాత గత సంవత్సరం ఏప్రియల్ 25న 10 రోజుల వ్యవధిలో రెండు కళ్ళకు ఆపరేషన్ జరిగింది. ఇప్పుడు పాప బాగా చూడగలుగుతుంది. రూ. 2,500/–లు పెట్టి కళ్లజోడు వేసుకోవాలన్నారు, సంస్థ ఆ ఏర్పాటు చేసింది. ఇదే ఆపరేషన్ బయట ప్రైవేటుగా చేయించాలంటే రూ. 52,000/–లు అయ్యేది.

"మా పిల్ల పుట్టుగుడ్డిగా పుట్టడం మా తలరాత అని సరిపెట్టుకున్నాము. చుట్టుప్రక్కల వాళ్ళు కూడా ఇది వారసత్వం అన్నారు. మా అదృష్టంకొద్దీ, ఎ.ఎస్.డి.ఎస్., యాక్షన్ ఎయిడ్ కల్పించుకొని మా పాప నుదుటిగీతను చక్కదిద్దారు. మేమే కాదు, పెద్దయ్యాక మా బిడ్డ కూడ వీరి సహాయం గూర్చి ఎప్పటికీ చెప్పుకొంటాము" అంటున్న ఆ దంపతుల ఆనందానికి అవధులు లేవు.

కేస్‌స్టడీ - 9



వాళ్ల జనార్ధన్ రెడ్డి, 42 సం.లు, కొండరెడ్డి, పోచవరం, తమ్మిలేరు పంచాయితీ, వి.ఆర్.పురం మండలం, వైకల్యం – అంధత్వం.

వాళ్ళ జనార్ధన్‌రెడ్డికి వెంకటలక్ష్మితో కొద్ది సం॥ల క్రితం వివాహాం అయ్యింది. వాళ్ళకి ఒక కొడుకు, 3వ తరగతి చదువుతున్నాడు. వీరు వ్యవసాయంతో పాటు కూలిపని చేసుకొని బ్రతుకుతుండేవారు. సంవత్సరం క్రితం జనార్ధన్‌రెడ్డికి ఏదో తీవ్రమైన జబ్బు చేసింది. దాంతో కంటిచూపు పూర్తిగా పోయింది. దాంతో భార్య వెంకటలక్ష్మి కూలిపని చేసి కుటుంబాన్ని పోషించడంతో పాటు భర్తకు వైద్యం కూడా చేయించేది.

**ఎ.ఎస్.డి.ఎస్. అందించిన సహాయం :** సంస్థకు చెందిన వికలాంగుల సంక్షేమ కార్యక్రమ కో–ఆర్డినేటర్ తాను నిర్వహించిన వికలాంగుల సర్వేలో ఇతన్ని గుర్తించారు. దాంతో జనార్ధన్ రెడ్డిని భద్రాచలం తీసుకువెళ్ళి సర్టిఫికేట్ ఇప్పించారు. వీరి జీవనోపాధి కొరకు సంస్థ స్వయం ఉపాధి పథకం క్రింద మేకలను కొనుగోలు చేయుటకు ఆర్ధిక సహాయం (రూ. 3000/–లు) అందించింది. సంస్థ సహకారాన్ని గూర్చి మాట్లాడుతూ వెంకటలక్ష్మి – " సంస్థ ఇచ్చిన డబ్బుతో నేను ఒక మేకను కొనుకొన్నాను. అది సంవత్సరం తరువాత రెండు పిల్లలను పెట్టింది. అవి పెరిగి పెద్దయ్యాక వాటిని అమ్మి ఆ డబ్బులతో కొంత అప్పులను తీర్చుకున్నాను. మరికొంత నా కుటుంబ అవసరానికి, మా ఆయన వైద్యానికి ఉపయోగించాను. సంస్థ ద్వారా మాకు మేకల లోన్‌తో పాటు వికలాంగుల సర్టిఫికేట్, బస్‌పాస్, రైల్వేపాస్ మరియు వికలాంగుల పెన్షన్స్ కూడా అందాయి. అదీ సంస్థ అందరి సమక్షంలో నా పట్టుదల, కృషిని గూర్చి చెప్పి అందించడం వల్ల మా చుట్టుప్రక్కల వాళ్ళ ఆదరణ, సహకారం కూడా నాకు లభించాయి. మా కుటుంబానికి క్రమేపి గౌరవం పెరిగింది. ఇదంతా చూసి నాకు సంతోషం అనిపిస్తుంది. సంస్థ వారికి, ప్రోగ్రాం కో–ఆర్డనేటర్ గారికి కృతజ్ఞతలు" అంటుంది.

సేకరణ : **భాగ్యలక్ష్మి,** ఎ.ఎస్.డి.ఎస్.

## గత 2సం॥లలో చేపట్టిన వికలాంగుల సంక్షేమ కార్యక్రమాలు

| వరుస సంఖ్య | చేపట్టిన కార్యక్రమ వివరాలు | 2011 | | | 2012 | | |
|---|---|---|---|---|---|---|---|
| | | లబ్ధిదారుల సంఖ్య | స్త్రీలు | పురుషులు | లబ్ధిదారుల సంఖ్య | స్త్రీలు | పురుషులు |
| 1. | ఆదర్శ వివాహాలు | 12 | 1 | 11 | | | |
| 2. | గ్రహణం మొర్రి ఆపరేషన్స్ | 2 | 1 | 1 | 2 | 1 | 1 |
| 3. | జీవనోపాధి సహాయం | 15 | 3 | 12 | | | |
| 4. | నిత్యావసర వస్తువుల పంపిణి | 25 | 17 | 8 | | | |
| 5. | బస్‌పాస్ | 127 | 42 | 85 | 256 | 138 | 118 |
| 6. | రైల్వేపాస్‌లు | 71 | 50 | 21 | 38 | 16 | 22 |
| 7. | ప్రభుత్వ బాలిక సంరక్షణ పథకము (30,000/–) | 6 | 6 | | | | |
| 8. | వికలాంగుల ప్రభుత్వ స్కాలర్‌షిప్ (1820/–) | 2 | 1 | 1 | | | |
| 9. | వికలాంగుల ప్రభుత్వ స్కాలర్‌షిప్ (750/–) | | | | 2 | 1 | 1 |
| 10. | వికలాంగుల శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు | 9 | 2 | 7 | 14 | 4 | 10 |
| 11. | వికలాంగుల సర్టిఫికేట్స్ మంజూరు | 60 | 43 | 17 | 69 | 40 | 29 |
| 12. | జాబ్‌కార్డుల మంజూరు | 120 | 25 | 95 | | | |
| 13. | వికలాంగులకు ఏర్పాటు చేయబడిన గ్రామ కమిటీలు | 21 | | | | | |
| 14. | వికలాంగులకు పంచిన లెర్నింగ్ కిట్స్ | 50 | | | | | |
| 15. | ట్రైసైకిల్స్ పంపిణి | | | | 19 | 15 | 4 |
| 16. | ఆరోగ్య పరీక్షలు | | | | 9 | 3 | 6 |
| 17. | పెన్షన్స్ | | | | 10 | 2 | 8 |
| 18. | జనశ్రీ భీమా పథకంలో చేర్పింపబడినవారు | | | | 100 | | |
| 19. | ఋణాలు పొందిన స్వశక్తి సంఘాలు (1,75,000/–) | | | | 3 | | |
| 20. | కృత్రిమ అవయవాలు పొందినవారు | | | | 3 | 1 | 2 |

## 7. ప్రకృతి విపత్తుల నిర్వహణ (Disaster Management)



గోదావరి, శబరి నదుల మూలంగా ఈ ప్రాంతాల్లో తరచూ సంభవించు వరదల విషయంలో సంస్థ ముందస్తు ప్రయత్నాలు, సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలు అనేకం ఎన్నో ఏళ్ళుగా చేపడుతూ వస్తుంది. వరద ప్రమాదాన్ని, నష్టాలను సాధ్యమైనంతమేరకు తగ్గించడానికి సంస్థ గోదావరి, శబరి నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రకృతి విపత్తు (ఉపద్రవాల)ను తట్టుకునేందుకు "సంసిద్ధతా సమాఖ్య"ను ఏర్పరచి, వరద ప్రమాదాన్ని సాధ్యమైనంత తగ్గించడం, వరదలు సంభవించి నప్పుడు అత్యవసర సహాయక చర్యలు చేపట్టడం మరియు పునరావాసం కల్పించడం వంటి ప్రయత్నాలు చేస్తుంది. దీనిలో భాగంగా వరద ప్రమాద సూచికలు గల ప్రాంతాల పటాలను జాగ్రత్తగా తయారుచేయించడం, గ్రామస్థాయిలో సంభావ్యతా ప్రణాళికలను రూపొందించడం చేస్తుంది. దీని ఫలితంగా ప్రతి గ్రామంలోనూ "గ్రామస్థాయి వరద నివారణ సంఘాలు" వెలిశాయి. ఇవి సరియైన సమయంలో సమర్థవంతంగా సమాచారాన్ని ప్రజలకు అందించడం, అత్యవసర, సహాయక చర్యలు చేపట్టడం, పునరావాసం కల్పించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నాయి.

**సంస్థకు గల అనుభవం :** గతంలో అంటే 1992, 1998, 2005 & 2006 సంవత్సరాల్లోనూ, అలాగే ప్రస్తుత సంవత్సరం (2013)లోనూ వరదలు సంభవించినప్పుడు సంస్థ తగువిధంగా స్పందించింది. గ్రామస్థాయి ప్రకృతి విపత్తుల నివారణ కమిటీలు, సి.బి.ఒ.ల సహకారంతో ప్రమాదకర ప్రాంతాల్లోవున్న ప్రజలను ఖాళీ చేయించి, వారికి సంస్థ కార్యాలయ ఆవరణలోనే తాత్కాలిక శిబిరాలు ఏర్పరిచింది. అత్యవసర పరిస్థితుల్లో ఇతర కార్యక్రమాలన్నింటినీ నిలుపుచేసి, పూర్తి సమయం ఈ సహాయక కార్యక్రమాల్లో పాల్గొనడమే కాక ప్రభుత్వ అధికారులతో సత్సంబంధాలను నెలకొల్పుకొని, వారి సహాయక, పునరావాస కార్యక్రమాలు అర్హులందరికీ సమానంగా అందేలా కృషి చేసింది. ఇతర ఎన్.జి.ఒ.లు, సి.బి.ఒ.లను కూడా కదిలించి సమిష్టిగా సహాయచర్యలు చేపట్టింది.

**సార్వజనీనమైన అత్యవసర సహాయక చర్యలు :** ఆదివాసీ ప్రజలే సంస్థకు ప్రధాన లక్ష్యమైనప్పటికీ, అత్యవసర పరిస్థితుల్లో బాధితులందరికీ సంస్థ సహాయం అందిస్తుంది. ముంపుకు గురియైన గ్రామాల నష్టాలపై శీఘ్ర అంచనాలను, నివేదికలను తయారుచేసి ప్రభుత్వానికి, ఇతర కీలక వ్యక్తులకు అందించడం ద్వారా తక్షణ సహాయక చర్యలు అమలు పరచడానికి, నష్టాలను సాధ్యమైనంత మేరకు తగ్గించడానికి ప్రయత్నిస్తుంది. వివిధ ప్రభుత్వశాఖలతో అనుసంధానం ద్వారా ఎన్నో సేవలు అందించేది. ఉదాహరణకు వరదల సమయంలో ప్రభుత్వం అందించే తిండి గింజలకు (బియ్యం) అదనంగా పప్పు, ఉల్లిపాయలు, నూనె వంటి ఇతర కనీస వస్తువులను జోడించి బాధితులందరికీ పంచిపెట్టడం, పశు సంవర్ధక శాఖ నుండి గడ్డిని సేకరించి గ్రామాల్లో పశువులకు మేత సరఫరా చేయడం, ప్రజారోగ్య శాఖ నుండి బ్లీచింగ్ పౌడర్, ప్రభుత్వ ఆసుపత్రుల నుండి మందులను సేకరించి గ్రామాల్లో పంచడం వంటి అత్యవసర సేవల్లో సంస్థ కీలక పాత్ర పోషించింది.






**ముందస్తు చర్యలు :** వరదలు వంటి ఆకస్మిక, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సహజంగానూ, కృత్రిమంగానూ కూడా నిత్యావసర వస్తువుల ధరలు ఒక్కసారిగా పెరిగిపోతుంటాయి. కాబట్టి సంస్థ వరద సూచనలు కనిపించిన వెంటనే ఉల్లిపాయలు, పప్పు, ఉప్పు, నూనె, చింతపండు, బ్యాటరీలు, పెట్రోలు వంటివి టోకు వర్తకుల నుండి తగు

మొత్తంలో కొని ఆఫీసులో భద్రపరిచి, అవసరాన్ని బట్టి పంచడం, ప్రమాదం సంభవించే అవకాశమున్న గ్రామాల్లో ముందుగానే గ్రామస్థాయి కమిటీలను వేసి ప్రజలను సంసిద్ధులను చేయడం, ఈ కమిటీ ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు తగిన సమాచారం అందించడం చేస్తుంది. గ్రామంలో ప్రతీ ఒక్క కుటుంబం కొంత చందా (రూ. 100/-) వేసుకొని, గ్రామస్థాయి అత్యవసర (విపత్తు) నిధిని ఏర్పాటు చేసుకొనేటట్లు చేసింది.

**విపత్తు ప్రణాళిక (Contingency Plan) :** 2006వ సంవత్సరంలో సంభవించిన వరదల సందర్భంగా రెడ్ ఆర్ (Red.R) బృందం సంస్థను సందర్శించిన ఫలితంగా ఈ ప్రణాళిక రూపొందింది. చాలా సంవత్సరాలుగా సంస్థ వరద నివారణ మరియు సహాయక చర్యలు చేపడుతున్నప్పటికీ, మొదటిసారిగా ఈ బృందమే, సంస్థ సిబ్బందిలోనూ మరియు గ్రామస్థుల్లోనూ ఈ రకమైన ఆలోచనను లేవనెత్తింది. ఈ సందర్భంగా కొన్ని గ్రామాలను (6) ఎంపిక చేసి, సమూహ చర్చల ద్వారా గత పదేళ్ళ కాలంలో ప్రకృతి విపత్తుల కారణంగా సంభవించిన నష్టాలు, వెనువెంటనే స్పందించడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఈ విధమైన ఉపద్రవాలను ఎదుర్కొనడంలో సంస్థకు గల బలాలు, బలహీనతలు, మెరుగుదల కొరకు చేపట్టాల్సిన చర్యలు, విపత్తుల సమయంలో తాత్కాలికంగానూ, అలాగే దీర్ఘకాలికంగానూ తీసుకోవాల్సిన చర్యలు మొదలైన అనేక అంశాలను చర్చించి, 5 గ్రామాలకు గ్రామస్థాయిలో ఈ ప్రణాళికలు రూపొందించడమైంది. ఫలితంగా ప్రకృతి విపత్తులను ఎదుర్కొనుటలో సంస్థ "తక్షణ సంసిద్ధత" (Red R) కు ఈ ప్రణాళిక మార్గదర్శిగా వుంది. అవసరానికి తగ్గట్లు ఎప్పటికప్పుడు దీనిలో మార్పులు, చేర్పులు చేసుకొంటూ, సంస్థ ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనగలుగుతుంది.



ఈ ప్రణాళికలో భాగంగా ఈ 5 గ్రామాల్లోనూ గ్రామస్థాయి ప్రకృతి విపత్తుల నిర్వహణా సంఘాలు (VLDMC), గ్రామ అత్యవసరనిధి ఏర్పాటయ్యాయి. వేరు వేరు పనుల నిర్వహణ కొరకు వి.ఎల్.డి.ఎం.సి.ని తిరిగి 5 కమిటీలుగా విభజించడమైంది.

వరదల సమయంలో ప్రభుత్వ అధికారులు పాటించు మాన్యువల్స్ (మార్గదర్శక సూత్రాలు)ను ఎప్పటికప్పుడు పరిశీలించి, వాటిలోని అవకతవకలను గుర్తించి, సంబంధిత అధికార యంత్రాంగానికి తెలియపర్చడం ద్వారా, మాన్యువల్లో అవసరమైన మార్పులు, చేర్పులు చేయించడం, వాటిని సక్రమంగా అమలు జరిగేటట్లు చూడడం గ్రామస్థాయిలో అధికారులకు అవసరమైన తోడ్పాటును అందించడం వంటి సమన్వయ (Liaison) కార్యక్రమంలో సంస్థ ఎప్పుడూ ముందుంటుంది. ఇది నిరంతరంగా చేపట్టే కార్యక్రమం కాదు కాబట్టి, అవసరమైనప్పుడు స్పందిస్తూ, మిగిలిన సమయాల్లో దీని పట్ల ఒక కన్ను వేసి వుంచి, ముందు జాగ్రత్త చర్యలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంది.

### వి.ఎల్.డి.ఎం.సి.లో 5 కమిటీలు

**1. హెచ్చరిక (Warning) కమిటీ :** భద్రాచలంలోని తుఫాను హెచ్చరిక కేంద్రం నుండి వరద తీవ్రత, ముంపుకు గురయ్యే అవకాశమున్న గ్రామాలు మొదలైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి, ఆయా గ్రామాలకు చేరవేయడం ద్వారా ప్రజలను అప్రమత్తం చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత.

**2. సురక్షిత సేవల (Rescue) కమిటీ :** పిల్లలు, గర్భిణీ స్త్రీలు, వృద్ధులను గుర్తించి, సాధ్యమైనంత త్వరగా వారిని రక్షిత శిబిరాలకు చేర్చడం, అలాగే పశువులను ఎత్తైన, సురక్షిత ప్రాంతాలకు తరలించడం దీని ముఖ్య విధి.

**3. ఆవాస కేంద్రాల (Shelter) కమిటీ :** సహాయక శిబిరాల నిర్వహణ, రక్షణ, వరదలు పోటెత్తక ముందే పంటలు, ఆహార ధాన్యాలను భద్రపరచడానికి సురక్షిత ప్రాంతాలను గుర్తించి సూచించడం, వాటిని భద్రపరచడం, వరద తీవ్రంగా వున్నప్పుడు ఆహార పదార్థాలను బాధితులకు పంచడం దీని ముఖ్య లక్ష్యం.

**4. ప్రథమ చికిత్స & ఆరోగ్య (First Aid & Health) కమిటీ :** వరద తీవ్రత ఎక్కువగా వున్న సమయంలో అంటువ్యాధులు వ్యాపించకుండా ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయడం, దీనిలో భాగంగా ఎం.డి.ఒ. / ఎం.ఆర్.ఒ. / పి.హెచ్.సి. ఆరోగ్య కార్యకర్తలు మరియు సంబంధిత ఎన్.జి.ఒ.లను సమన్వయపరచి అవసరమైన వైద్యసేవలు అందించడం దీని ప్రధాన బాధ్యత.

**5. పునరావాస (Rehabilitation) కమిటీ :** నిత్యావసర సరుకుల పంపిణీ, దుప్పట్లు, మందుల సరఫరా వంటి తక్షణ చర్యలు, క్రొత్త ఇళ్ళ నిర్మాణం, రాజకీయాలకు అతీతంగా నిజ నిర్ధారణ జరిపి వరద నష్టాన్ని ఖచ్చితంగా లెక్కించేటట్లు చూడడం వంటి పునరావాస కార్యక్రమాల్లో పాల్గొని, ప్రజలకు, అధికారులకు సహకరించడం ఈ కమిటీ చూడాల్సిన కీలక అంశాలు.



కొండారెడ్డి గ్రామం (గుల్లేటివాడ)లో ఐ.టి.డి.ఎ. పి.ఓ.తో సమావేశం

## 8. అవగాహన, ప్రచార, శిక్షణా, సలహా, సమన్వయ కార్యక్రమాలు

**(Awareness, Campaigning, Training & Advocacy Programmes)**

ఇక్కడి ఆదివాసీ ప్రజలకు అవసరమైన సమాచారాన్ని, విజ్ఞానాన్ని అందించి, చైతన్యవంతులను చేయడం ద్వారా వారు ప్రభుత్వ పథకాలను, ఇతర సంక్షేమ సేవలను, హక్కులను పొందేలా చేయడంతో పాటు, ఆదివాసీ ప్రాంతాలలోని ముఖ్యంగా క్షేత్రస్థాయిలోని సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని వివిధ మార్గాల ద్వారా సేకరించి, వాటిపై అవసరమైతే తగు విశ్లేషణలతో మిగిలిన సమాజానికి, తోటి సామాజిక కార్యకర్తలు, సంస్థలకు, అధికారులకు విస్తృతంగా ప్రచారం చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేయడం సంస్థ వ్యూహాల్లో ఒకటి. ఇందుకోసం సంస్థ రకరకాల కార్యక్రమాలను చేపడుతుంది. సమకాలీన సమస్యలపై అధ్యయనాలు, ప్రచురణలు, శిక్షణా కార్యక్రమాలు, ప్రజా చైతన్య యాత్రలు, శిబిరాలు, ఇతర ప్రచార కార్యక్రమాలను చేపడుతుంది.

సంస్థ ప్రారంభ దశలోనే ప్రాథమిక అధ్యయనం (బేస్‌లైన్ స్టడీ) చేపట్టి గ్రామాలకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్నంతా క్రోడీకరించడమైంది. తరువాత గ్రామస్థులందరినీ చైతన్యపరిచి, ఒక వేదికపైకి తెచ్చి, వారికి గల హక్కులపై అవగాహన పర్చడమైంది. తరువాత వారిలో ప్రభుత్వ ఆఫీసులకు వెళ్ళి, అధికారులతో మాట్లాడగలిగే, దరఖాస్తులు పెట్టగలిగే సామర్థ్యాల పెంపునకు శిక్షణలు ఇచ్చింది. సంస్థ ముందుగా వీటిని క్లస్టర్ కో ఆర్డినేటర్లకు అందించగా, వారు తిరిగి గ్రామస్థాయి కార్యకర్తలకు, ప్రజలకు అందించారు. దీనిలో భాగంగా గ్రామాల్లోవున్న వివిధ రకాల సమస్యలను గ్రామస్థులచే గుర్తింపచేయడం, వాటి పరిష్కారమునకు వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులతో జరుపవలసిన సంప్రదింపులు, ఒత్తిడి (డిమాండు) చేసే విధానం, ఇతర వ్యవహార దక్షతలపై వివిధ రకాల పద్ధతుల ద్వారా వీరికి తర్ఫీదు ఇచ్చింది. గ్రామస్థాయిలో సంప్రదింపులు, పరస్పర వ్యక్తిగత సంబంధాల ద్వారా వివిధ రకాల ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రజలను గుర్తించడం, వారికి కొంత న్యాయపరమైన సలహా సహాయాన్ని, అలాగే యువతకు న్యాయ శిక్షణను అందించింది.

**8.1 ప్రభుత్వ పథకాలపై అవగాహన :** రాజ్యాంగపరమైన సదుపాయాలు, చట్టాలు, హక్కులు ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై సంస్థ ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించేందుకు గ్రామాలు, కళాశాలలు, అవకాశమున్న ఇతర చోట్ల శిక్షణలు,



ఎఫ్.ఆర్.ఏ.పై ఐ.టి.డి.ఏ. స్పెషల్ ఆఫీసరుతో సమావేశం

అవగాహన సదస్సులు, సమావేశాలు, బహిరంగ చర్చలను నిర్వహిస్తుంది. న్యాయవాదులు, కాలేజీ లెక్చరర్లు, సామాజిక శాస్త్రవేత్తలు, సేవా కార్యకర్తలు మొదలైనవారు వీటిలో పాల్గొని గిరిజన యువతకు అవగాహన కల్పిస్తుంటారు. ఆహార భద్రతా పథకాలపై సుప్రీంకోర్టు ఆదేశాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ, వృద్ధాప్య, వితంతు ఫించన్లు, మధ్యాహ్న భోజన పథకం, (MDM), సమగ్ర శిశు అభివృద్ధి సేవలు (ICDS), ఉపాధిహామి పథకం, వికలాంగుల సంక్షేమ పథకాలు, గృహవసతి, గ్రామసభ విధులు, ప్రజాప్రతినిధుల బాధ్యతలు, 1/70 చట్టం, సహజవనరులపై ఆదివాసీలకు గల రాజ్యాంగ హక్కులు, పాలనా విధానం ఇలా అనేక అంశాలపై ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. డైరక్టర్‌తో ప్రజల ముఖాముఖి



**8.2 ఆదివాసీల హక్కుల పరిరక్షణ :** ఆదివాసీ సముదాయాలను చైతన్యపరచడం (కదిలించడం) ద్వారా వారు అధికారుల నుండి తమ హక్కులకు హామి పొందగలగేటట్లు చేయడం లేక రక్షణ కల్పించడం అనేది సంస్థ చేపట్టిన ఒక దీర్ఘకాలిక కార్యక్రమం. 2010 సంవత్సరం మొదట్లో ఇది ప్రారంభమైంది. దీని క్రింద వివిధ కార్యక్రమాలు చేపట్టబడ్డాయి.

ఆదివాసీ ప్రాంతాల స్వయంపాలన, సుప్రీంకోర్టు మార్గదర్శక సూత్రాలు మొదలైన వాటికి సంబంధించిన సమాచారం గ్రామస్థులకు చేరవేయబడింది. రచ్చబండ కార్యక్రమాలు, ఇతర ప్రభుత్వ వేదికలను ఉపయోగించుకొని, అర్హులైనవారు ఆయా పథకాల్లో రేషన్‌కార్డులు, వృద్ధాప్య ఫించన్లు, వితంతు ఫించన్లు, ఒంటరి మహిళలు ఉపాధి / ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు (IGP), ఉపాధి హామి పథకాల్లో పనులు పొందేందుకు అవసరమైన సమాచారం, సామర్థ్యాలను పెంపొందించేందుకు సంస్థ ఆదివాసీలకు శిక్షణ ఇచ్చింది. ఒక్క ఉపాధిహామి పథకానికి సంబంధించే గ్రూపుల నిర్మాణం దగ్గర నుండి వివిధస్థాయిల్లో ఎదురయ్యే సమస్యలను అధిగమించడం వరకు 42 శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడమైంది. తద్వారా ఈ ఉపాధిహామి పథకంలో ఈ ప్రాంతంవారు అత్యధిక పనిదినాలు పొందగలిగారు. అనేక శ్రమశక్తి సంఘాలు ఏర్పాటయ్యాయి. మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ ఆదివాసీలు కొంత ఎక్కువ లబ్ధి పొందగలిగారు. ప్రభుత్వ పథకాలు, రాజ్యాంగపరమైన హక్కులు, చట్టాలు, ఆదివాసీల పరిపాలనకు సంబంధించిన ప్రత్యేక అంశాలు, మొదలైన అంశాలపై యువతకు శిక్షణా కార్యక్రమాలను సంస్థ ఒక నిరంతరంగా కొనసాగిస్తుంది.

**8.3 పోలవరం నిర్వాసితుల సమస్యపై అవగాహన :** సమస్య యొక్క ఉధృతి మరియు దీనివల్ల సంభవించనున్న తీవ్ర విధ్వంసాన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రతిపాదిత 'పోలవరం' ప్రాజెక్టుకు సంబంధించి ప్రాథమిక సమాచారానంతా విస్తృతస్థాయిలో సేకరించి, వాస్తవిక పరిస్థితుల ఆధారంగా దాన్ని విశ్లేషించడం, ప్రజలకు అవగాహన కల్పించడం కొరకు శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం, ప్రజా చైతన్య యాత్రలు ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం, నిజానిజాలను నిగ్గు తేల్చే అధ్యయనాలను చేపట్టడం, సమస్యపై ప్రచురణలను వెలువరించడం వంటివి అనేకం ఎ.ఎస్.డి.ఎస్. చేపట్టింది. సంస్థ సేకరించిన ఈ వాస్తవిక సమాచారనిధి (సాక్షిభూతాలు) ఇతర సంస్థలకు సహితం ఒక సమాచార బ్యాంకుగా ఉపయోగపడడమే కాకుండా సమస్య తీవ్రతను జనబాహుళ్యానికి తెలియజెప్పడంలో ఇది విజయం సాధించింది. సమస్యకు సంబంధించి



సమస్యలు వివరిస్తున్న పోచవరం గ్రామస్థులు

చేపట్టిన వివిధ కార్యక్రమాలు.

- సమస్య తీవ్రత, పరిణామాలపై ఆదివాసీ యువతకు 7 శిక్షణా కార్యక్రమాలు,
- సి.బి.ఒ.లు మరియు పి.ఆర్.ఐ. సభ్యులకు 4 కార్యశాలలు (వర్క్‌షాప్స్),
- ప్రజా బాహుళ్యానికి అవగాహన కల్పించడానికి అనేక భారీ ర్యాలీలు మరియు బహిరంగ సమావేశాలు నిర్వహించింది.
- పార్లమెంటు సభ్యులకు మెమోరాండమ్ సమర్పించింది.

**8.4 ప్రథమ చికిత్సపై శిక్షణ :** ప్రమాద సమయాల్లో తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు, ప్రథమ చికిత్స, భద్రత వంటి అంశాలపై డాక్టర్ల చేత శిక్షణా కార్యక్రమాలను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు, వరదలు, రోడ్డు యాక్సిడెంట్లు మొదలగునవి ఎక్కువ జరుగుతుంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని తరచూ ఆయా గ్రామాల్లో రెండేసి రోజులు వ్యవధి గల శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుంటుంది.

**8.5 ఆరోగ్యం మరియు పారిశుధ్యంపై శిక్షణలు :** పరిసరాల పరిశుభ్రత, ఇతర ఆరోగ్య సూత్రాలపై అవగాహన సదస్సులను అవసరాన్ని బట్టి సంస్థ ఏర్పాటు చేస్తుంది. అపరిశుభ్రమైన పరిసరాలు, కలుషిత మంచినీరు, నీటి పరిసరాల చుట్టూ అపరిశుభ్రత వల్ల వ్యాపించే వ్యాధులు, తీసుకోవలసిన జాగ్రత్తలపై తరచుగా శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుంది. ఈ అంశాలపై గ్రామాల్లో ప్రజలకు శిక్షణ ఇవ్వడానికిగానూ గత ఐదేళ్ళలో మొత్తం 32 మందికి (Training for Trainers) శిక్షణనిచ్చింది. ప్రత్యేకించి అవసరమున్న ప్రదేశాల్లో (Targeted Areas) 11 కాంపెయిన్స్‌ను ఏర్పాటు చేసింది.

**8.6 ఎయిడ్స్‌పై అవగాహన సదస్సులు :** ముందు జాగ్రత్త చర్యగా మారుమూల ఆదివాసీ గ్రామాల్లో, సంతలు మొదలైన జనసంవర్ధం గల ప్రదేశాల్లో హెచ్.ఐ.వి. & ఎయిడ్స్‌పై అవగాహన కొరకు ప్రచార కార్యక్రమంతో పాటు, క్లస్టర్ స్థాయి శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుంది. సంస్థలోని కొంతమంది కార్యకర్తలకు ప్రత్యేకించి ఈ అంశంపై శిక్షణ ఇప్పించింది.

**8.7 పశువుల సంరక్షణ :** వ్యవసాయనుబంధ కార్యక్రమమైన పశు సంరక్షణ మరియు అభివృద్ధి కొరకు గ్రామాల్లో అవగాహన కల్పించడంతో పాటు పశువులకు టీకాలు, మందులు సరఫరా చేసే వాక్సినేషన్ కాంపులను సంస్థ నిర్వహిస్తుంది. 2011 సం॥లో 8 గ్రామాల్లో 1607 మేకలు / గొర్రెలు, 832 ఆవులు, 213 ఎద్దులకు వ్యాక్సిన్స్ వేయించింది.

**8.8 వికలాంగుల సంక్షేమం :** వీరి హక్కులు, సంక్షేమ పథకాలు, సదుపాయాలపై సంస్థ మొత్తం 35 గ్రామాల్లోని వికలాంగులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. శిక్షణానంతరం వారి వారి అవసరాల ఆధారంగా కొన్ని కార్యక్రమాలు చేపట్టింది.

**8.9 వివిధ వేడుకలు :** ఆదివాసీలకు సంబంధించి ప్రాధాన్యత కలిగిన, గుర్తింపదగిన సందర్భాలను సంస్థ వేడుకగా నిర్వహిస్తుంది. ఆదిమజాతుల దినోత్సవం, ఆదివాసీ మేళా, ప్రపంచ ఆదివాసీల దినోత్సవం, ఆదివాసీ నాయకుల జయంతి, వర్ధంతులు,




సాంస్కృతిక కార్యక్రమాలు



పెసా చట్టంపై శిక్షణ

ఇతర స్మృతులు / జ్ఞాపకాలను ఒక ప్రత్యే కార్యక్రమంగా ప్రజా భాగస్వామ్యంతో ఉత్సవంగా / జ్ఞాపకార్థంగా జరపడం సంస్థ అలవాటుగా చేస్తుంది.

**8.10. సలహా మరియు సమన్వయ (Advocacy & Co-ordination) కార్యక్రమాలు :** బాధితుల సమస్యల పరిష్కారానికి సంస్థ సంబంధిత ప్రభుత్వ అధికారులు మరియు బాధితుల మధ్య వారధిగా వ్యవహరిస్తుంది. వారి మధ్య పరస్పర సంప్రదింపులు, అభ్యర్థనలు, సందేహాల నివృత్తి, చర్చలు, తనిఖీలకు సంస్థ కార్యకర్తలు వారధులుగా వ్యవహరిస్తూ, ఇరుపక్షాల భారాన్ని తగ్గించడం, అవసరమైతే ఉమ్మడి వేదికను ఏర్పరచడం, అధికారుల గ్రామ సందర్శనలకు, శిబిరాల నిర్వహణకు చేయూతనివ్వడం లాంటి సలహా సంప్రదింపు సేవలను చేపడుతుంది. ఇందులో భాగంగా సంస్థ క్రమం తప్పక చేపట్టే కొన్ని కార్యక్రమాలు :



**గ్రామంలో యువజన సంఘాల ఏర్పాటు & శిక్షణ**

★ అప్నా (APNA) సమావేశాల్లో పాల్గొనడం

★ ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. వారంతపు సమావేశాలకు హాజరుకావడం.

★ ప్రభుత్వ పథకాల అమలు, సమాచారం కొరకు ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. ఇతర ప్రభుత్వ కార్యాలయాలతో ఎల్లప్పుడూ సత్సంబంధాలు, సంప్రదింపులు కొనసాగించడం.

★ మెడికల్ సర్టిఫికెట్ల కొరకు దరఖాస్తులు, రోగులను వైద్యులకు చూపించడం, ప్రభుత్వ వైద్యశాఖ నిర్వహించే వైద్య శిబిరాలకు అవసరమైన సహాయాన్ని అందించడం తరచూ ఆసుపత్రులను, వైద్యులను సందర్శించడం, వారితో మంచి సత్సంబంధాలను ఏర్పరచుకోవడం చేస్తుంది.

**8.11 డాక్యుమెంటేషన్ :** ఇతర ప్రయోజనాలతో పాటు సమాచార ప్రచారం (పంపిణీ) కొరకు సంస్థ వివిధ రకాల సమస్యలు, కార్యక్రమాలు, సాధించిన విజయాలు, ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు మొదలైన అనేక అంశాలపై డాక్యుమెంటేషన్ (ప్రచురణలు) చేస్తుంది. ఇవి నివేదికలు, పోస్టర్లు, కరపత్రాలు, గోడపత్రికలు, పుస్తకాలు, చిత్రాలు, కరదీపికల రూపంలో వెలువడుతుంటాయి. ఉదాహరణకు ఈ ప్రాంతంలో ప్రతీ మూడు సంవత్సరాల కొకసారి వారం రోజుల పాటు జరుపుకునే **"వేలుపులు"** అనే పండుగపై వీడియో (చిత్రాన్ని)ను చిత్రీకరించింది. ఈ సందర్భంగా వేరువేరు ప్రాంతాల నుండి వేరు వేరు రంగాల్లో అనుభవజ్ఞులైన ఆదివాసీ వృద్ధ కళాకారులను ఆహ్వానించి (84మంది పెద్దలు) వారి వారి సాంప్రదాయబద్దమైన వస్తుసామాగ్రితో, ఒక ప్రదర్శన ఏర్పాటు చేసి, ఆయా వస్తుసామాగ్రిని వారు ఏయే అవసరాలకు, ఏయే విధంగా ఉపయోగించేవారో వివరించమని, దాన్నంతటినీ వీడియో రూపంలో డాక్యుమెంట్ చేసింది. అలాగే సిబ్బందిలో డాక్యుమెంటేషన్ సామర్థ్యాలను పెంపొందించడానికి అవసరాన్ని బట్టి ఆయా అంశాలపై అనుభవజ్ఞులైన వ్యక్తులచే శిక్షణను ఇప్పిస్తుంటుంది. ఈ సంవత్సరం నివేదికలు, (రిపోర్ట్స్), కేస్ స్టడీలు, కరపత్రాలు రూపొందించడంపై యువకార్యకర్తలు, సి.బి.ఓ. సభ్యులకు శిక్షణ ఇప్పించింది.

| | |
|---|---|
| కరపత్రాలు | –25 |
| లఘుచిత్రాలు | – 2 |
| బ్రోచర్స్ | – 4 |
| పోస్టర్స్ | – 4 |
| పుస్తకాలు (బుక్‌లెట్స్) | – 4 |
| మ్యాగజైన్స్ | – 1 |
| సర్వే ఫార్మెట్ | – 1 |


**డాక్యుమెంటేషన్ నైపుణ్యాలపై సిబ్బందికి శిక్షణ**



## 9. క్రొత్తగా ప్రారంభించిన కార్యక్రమం (New Initiative) – ఆటలబడి

అంతర్జాతీయ బాలల హక్కుల రక్షణలో భాగంగా ఎ.ఎస్.డి.ఎస్. టెర్రా హోమ్–నెదర్లాండ్స్ (TDH-NL) తో కలిసి అంతర్గత నిర్వాసిత అడవిబిడ్డల కోసం, ఈ సంవత్సరం 'ఆటలబడి' నే ఒక క్రొత్త కార్యక్రమాన్ని రూపొందించి అమలు పరుస్తుంది. ఇది మొత్తం ఐ.డి.పి. (సెటిల్మెంట్లలో) ప్రీ స్కూల్స్ మరియు బ్రిడ్జి స్కూల్స్ రెండూ కలిపి 29 ఏర్పాటు చేసింది.

| | | |
|---|---|---|
| పని చేస్తున్న మొత్తం మండలాలు | – | 5 |
| లక్ష్యంగా నిర్ధేశించుకున్న మొత్తం గ్రామాలు (సెటిల్‌మెంట్స్) | – | 35 |
| ఇంతవరకూ స్కూల్స్ ప్రారంభించిన గ్రామాలు | – | 21 |
| ఇంకా ప్రారంభించవలసివున్న గ్రామాలు | – | 14 |
| లబ్ధిపొందుతున్న మొత్తం కుటుంబాలు | – | 941 |
| 2 సంవత్సరాలకు పైబడి 14 సంవత్సరాల వరకు వయస్సున్న పిల్లలు | – | 644 |

| | | మొత్తం పిల్లలు | బాలికలు | బాలురు |
|---|---|---|---|---|
| 2 సం॥కు పైబడి 6 సం॥ వరకు వయస్సుగల పిల్లలకు నిర్వహిస్తున్న ప్రీ స్కూల్ | 15 | 325 | 170 | 155 |
| 6 సం॥లకు పైబడి 14 సం॥ వరకు వయస్సు గల పిల్లలకు నిర్వహిస్తున్న బ్రిడ్జి స్కూల్ | 14 | 319 | 148 | 171 |

పిల్లల హక్కులపై తల్లిదండ్రులకు, చుట్టుప్రక్కల సమాజంలోను అవగాహన కల్పించి, వాటి పరిరక్షణకు మరియు అమలుకు కృషిచేయడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. పిల్లలే ఈ కార్యక్రమంలో ముఖ్యభాగస్వాములుగా ఉంటారు.




పలక–బలపం ద్వారా కాకుండా ఆటపాటల ద్వారా చిన్నారులకు విద్యాబోధన జరుగుతుంది. ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు గా పనిచేయుటకు స్థానిక విద్యావంతులైన ఆదివాసీ యువతీయువకులను ఆయా గ్రామాల (సెటిల్మెంట్ల) నుంచే ఆ గ్రామస్థులు (కమ్యూనిటి) ద్వారానే ఎంపిక చేసి, కమ్యూనిటీ భాగస్వామ్యంతోనే పాఠశాలలు నిర్వహించబడమనేది వీటి ప్రత్యేకత.

పాఠశాలలు చిన్నారులను ఆకర్షించే విధంగా అనేకరకాలపైన క్రీడాసామాగ్రిని స్థానికంగా దొరికే ముడిసరుకు (రా మెటిరీయల్) మరియు వ్యర్థపదార్థాలు, వ్యర్థ సామాగ్రితో అత తక్కువ ఖర్చుతో రంగురంగులుగా వీటిని అలంకరించడం జరుగుతుంది. టీచర్లు/ వాలంటీర్లు పిల్లలకు అత్యంత దగ్గరగా, సన్నిహితంగా ఉండి బాలలు స్వేచ్ఛగా ఆడుకునేందుకు సహకరిస్తూ ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తారు. తల్లిలాంటి ఆదరణ తండ్రిలాంటి పర్యవేక్షణ ఈ విద్యాకేంద్రాల ప్రత్యేకత.



చిన్నారులకు వారి వయస్సులకు తగిన విద్యాబోధనను ఆటలరూపంగా (Play way Method) చెప్పడమే కాకుండా వారి యొక్క భాషాభివృద్ధికి, శారీరక పెరుగుదలకు, సృజనాత్మక మరియు మేధోశక్తి అభివృద్ధికి, మానసిక వికాసం మరియు సాంఘికాభివృద్ధికి కృషి జరుగుతుంది. రకరకాలపై ఆటపాటలను రూపొందించి, వాటికి అవసరమయ్యే విద్యాభోదన పరికరములను అందంగా తయారు చేసి, అందుబాటులో ఉంచడమే జరుగుతుంది. పాఠశాలల్లో / విద్యాకేంద్రాలలో "చిల్డ్రన్స్ క్లబ్' ఏర్పాటు చేయడం ఒక ముఖ్య విధి. వీటి ద్వారా కొన్ని కార్యక్రమాలను క్రమం తప్పకుండా అమలు చేయడం ద్వారా పిల్లలలో నాయకత్వ లక్షణాలను (Leadership Qualities) చిన్నవయస్సు నుంచే అభివృద్ధి చేయడం కొరకు ఇవి పనిచేసున్నాయి. శారీరక సౌష్టవం కొరకు ఈ కేంద్రాల్లో చిన్నారులకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందిస్తూ వయస్సుకు తగిన బరువు, ఎత్తు ఉండే విధంగా సంస్థ ప్రయత్నిస్తుంది. వీటిపై ఎప్పటికప్పుడు సర్వేలు, నిర్వహించి బాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. ఈ వినూత్న ప్రయోగం ద్వారా ఇంతవరకు చెట్టు, పుట్ట పట్టుకు తిరిగే చిన్నారులు ఇక్కడి ఆటపాటలకు ఆకర్షించబడి ఈ విద్యాకేంద్రాలకు చేరి అక్షరాలు నేర్వడానికి అలవాటు పడుతున్నారు. ఈ కార్యక్రమం ఇప్పుడిప్పుడే రూపుదాల్చింది. పూర్తిస్థాయిలో వికసించడానికి మరి కొంత సమయం పడుతుంది.





దక్షిణ భారత ఆదివాసీ సమ్మేళనము

## 10. ఐక్య సంఘటనలు (Networking)

సంస్థ లక్ష్యాలతో సామీప్యతను కలిగిన వ్యక్తులు, సంస్థలతో స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో నెట్‌వర్క్స్ (సమాఖ్యల)ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆదివాసీల అభివృద్ధికి వారి సమస్యల పరిష్కారానికి సంస్థ నిరంతరంగా కృషి చేస్తుంది. ఇందుకు సంబంధించి సంస్థ చేపట్టిన కొన్ని ముఖ్య కార్యక్రమాలు.

**9.1 దక్షిణ భారత ఆదివాసీ సంఘాల సమాఖ్య :** సహజవనరులపై ఆదివాసీలకు గల హక్కులు, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో పెసా (PESA) చట్టం లేక ఆదివాసీ స్వయంపాలన, ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు, విజ్ఞానం, సామర్థ్యాల పరిరక్షణ వంటి ప్రధాన అంశాలపై ఉమ్మడిగా పనిచేయడానికి దక్షిణ భారతదేశంలోని 5 రాష్ట్రాలు కర్నాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ & ఒరిస్సా రాష్ట్రాలలో ఆదివాసీల కోసం పనిచేసే వివిధ సంఘాలు, మేధావులతో ఈ జాతీయస్థాయి సమాఖ్య ఏర్పడింది. ఈ సమాఖ్యను నెలకొల్పడంలో సంస్థ కీలకపాత్ర పోషించింది.




2011 సంవత్సరంలో ప్రారంభమైన ఈ ప్రయత్నంలో ఇంతవరకూ ఐదు జాతీయస్థాయి సదస్సులు జరుగగా వీటిలో రెండింటికి సంస్థ ఆతిథ్యమిచ్చింది. చివరి సదస్సు ఈ సంవత్సరం (2013) జూలై 13,14 తేదీల్లో సంస్థ కార్యాలయం రేఖపల్లిలో జరిగింది. ఈ సందర్భంగా సమాఖ్యస్థాయిలో పనిచేయడానికి కొన్ని ఉమ్మడి అంశాలు గుర్తించబడ్డాయి.

1) షెడ్యూల్డ్ కాకుండా మిగిలిపోయిన ఆదివాసీ ప్రాంతాలన్నింటికీ షెడ్యూల్డ్ ప్రాంతాల గుర్తింపును కల్పించడం.

2) షెడ్యూల్డ్ ప్రాంతంతో సంబంధం లేకుండా ఆదివాసీ ప్రాంతాలన్నింటిలోనూ పెసా (PESA) చట్టం అమలు జరిగేటట్లు చూడడంతో పాటు, ఇక్కడ పూర్తి స్వయంపాలన సాధనకు కృషి చేయడం.

3) ఆదివాసీల అభీష్టాలకు, సంక్షేమానికి వ్యతిరేకమైన అటవీ మరియు పరిపాలన సంబంధమైన మరియు ఇతర చట్టాలు, రెగ్యులేషన్స్, అభివృద్ధి విధానాలు, పథకాలను అడ్డుకోవడం, ముఖ్యంగా నిర్వాసితను, విధ్వంసకర అభివృద్ధులను వ్యతిరేకించడం

4) ఆదివాసీల ప్రత్యేకతను ఉనికిని, అస్థిత్వాన్ని కాపాడుకోవడం, అందుకు సహకరించే రాజ్యాంగపరమైన రక్షణలు అమలు జరిగేలా చూడడం.

5) జాతీయ ఉపాధిహామి వంటి పథకాల్లో ఆదివాసీలకు అనుకూలమైన మార్పులు, చేర్పులు చేసి, వాటిని మరింత పటిష్టంగా అమలు జరిపేటట్లుగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం

6) ఈ ఉమ్మడి నిర్ణయాలపై భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేసుకొని పనిని ప్రారంభించడం.

**మేథాపాట్కర్ ముంపుగ్రామాల సందర్శన**



**9.2 ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక (NAPM) లో భాగస్వామ్యం :** ఆదివాసీల నిర్వాసిత సమస్యపై దేశవ్యాప్తంగా గత మూడు, నాలుగు దశాబ్ధాలుగా ఎడతెగని పోరాటం చేస్తున్న ఎన్.ఎ.పి.ఎం.తో కలిసి సంస్థ ఉమ్మడి లక్ష్యాల సాధనకు కృషిచేస్తుంది. భూమి, అడవి, నీరుపై ఆదివాసీ హక్కుల సాధనకు ప్రజల్లో అవగాహన మరియు గ్రామస్థాయిలో స్వచ్ఛంద సేవా కార్యకర్తల అభివృద్ధి దీని ఉమ్మడి ప్రధానాంశాలు. ఇందులో భాగంగా మితిమీరిన పారిశ్రామికీకరణ, ప్రత్యేక ఆర్థిక మండలులు (SEZs), సహజ వనరులపై ప్రభుత్వాల నియంత్రణ పెరగడం, విస్తృతమౌతున్న ప్రపంచీకరణ ప్రభావాలను గూర్చి ఎప్పటికప్పుడు వివిధ స్థాయిల్లో చర్చించడానికి, వీటి దుష్ప్రభావాల నియంత్రణలకు సంస్థ ఈ వేదిక ద్వారా కృషి జరుపుతుంది.

**9.3 రాష్ట్రస్థాయి సేవాసంఘాల (NGOs) తో జట్టు :** సంస్థ లక్ష్యాలతో సారూప్యత కలిగిన ఇతర సంస్థలు, యాక్షన్ ఎయిడ్ భాగస్వాములు, స్థానిక గ్రామస్థాయి సంఘాల (CBOs) తో కలిసి అనేక సమస్యలపై విడివిడిగానూ, సమాఖ్యగానూ కూడా సంస్థ పనిచేస్తుంది. ఉదాహరణకు ఆదివాసీ హక్కుల సాధనకు దళిత మరియు ఆదివాసీ ఐక్యవేదికతోనూ, ఆహార భద్రతపై ఆర్క్ సంస్థతోనూ, ఉపాధిహామి పథకంపై ఎ.పి.వి.వి.యు. తోనూ, ప్రకృతి విపత్తుల నివారణకు 'శక్తి సంస్థ' తోనూ ఇలా రాష్ట్రస్థాయిలో ఎన్నో సంస్థలు, సంఘాలతో సంయుక్తంగా పనిచేస్తుంది.

**9.4 విజ్ఞాన సందర్శనలు :** సిబ్బందికి వివిధ అంశాలపై అవగాహనను విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరచడానికి సంస్థ అనుసరిస్తున్న ఎన్నో పద్ధతుల్లో తరచూ విజ్ఞాన సందర్శనలను ఏర్పరచడం ఒకటి. సంస్థ కార్యక్రమాలు లక్ష్యాలతో సారూప్యత కలిగిన సంస్థలను సందర్శించి, అక్కడి పరిస్థితులను అనుభవాలను పరస్పరం పంచుకోవడం ద్వారా సిబ్బంది ఆయా అంశాలపై మరింత అవగాహనను పెంచుకొనగలుగుతుంది. అలాగే ఆయా సంస్థల మధ్య సంఘీభావం పెంపొందించడానికి, ఉమ్మడి సమస్యలపై కలసి పనిచేయడానికి, ఉమ్మడి కార్యక్రమాలను పెంపొందించుకోవడానికి కూడా ఈ సందర్శనలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఉదాహరణకు గత సంవత్సరం కొంతమంది సిబ్బంది శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ప్రత్యేకించి ఆదివాసీల అభివృద్ధి కొరకు పనిచేస్తున్న ఆర్ట్స్ సంస్థను, అలాగే సుస్థిర ఆదివాసీ సముదాయాల అభివృద్ధికి ముఖ్యంగా వ్యవసాయం, విద్య, వైద్య, సహజ వనరుల యాజమాన్యం ఇంధన వనరుల రంగంలో ప్రత్యామ్నాయాల అభివృద్ధికి గత 30 సం॥లుగా ఆదివాసీ ప్రాంతాల్లో పనిచేస్తున్న లయ సంస్థను సందర్శించి, ఆయా రంగాల్లో అవగాహనను పెంపొందించుకోగలిగారు.



**సంస్థ సిబ్బంది విజ్ఞాన సందర్శన**




**ఆదివాసీ యువతులకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ**

## గత ఐదు సంవత్సరాలలో సంస్థ నిర్వహించిన వివిధ ప్రచార, శిక్షణా కార్యక్రమాలు

| | | |
|---|---|---|
| ఉపాధి హామి పథకంపై శిక్షణలు & సమావేశాలు<br>(ఇందులో ప్రత్యేకించి మేట్లుకు ఏర్పరచినవి – 26) | – | 42 |
| విద్యాహక్కుపై ప్రచార కార్యక్రమాలు (కాంపెయిన్స్) & సమావేశాలు | – | 21 |
| విద్యాహక్కుపై శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేసిన గ్రామాలు<br>(ఆ గ్రామాల్లో వున్న మొత్తం పిల్లలు – 3654) | – | 35 |
| అటవీ హక్కుల చట్టంపై ఏర్పరచిన సదస్సులు & సమావేశాలు | – | 25 |
| శ్రమశక్తి సంఘాలకు ఏర్పాటుచేసిన శిక్షణలు (ఎన్.ఆర్.ఇ.జి.ఎస్.) | – | 16 |
| ఆరోగ్యం మరియు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సులు | – | 11 |
| ప్రథమ చికిత్సలో శిక్షణ పొందిన సభ్యులు | – | 32 |
| జీవనోపాదుల అభివృద్ధి కార్యక్రమం క్రింద సహాయం పొందిన ఒంటరి మహిళలు<br>(ప్రభుత్వం ద్వారా – 21, సంస్థ ద్వారా – 15) | – | 36 |
| సంఘాన్ని బలోపేతం చేసుకోవడం, భూమి సమస్యల పరిష్కారం, అక్షరాస్యత<br>అభివృద్ధి వంటి అంశాల్లో నాట్‌వాన్ సంఘానికి ఇచ్చిన శిక్షణలు | – | 10 |
| సంస్థ నిర్వహించిన వేడుకలు (మహిళా దినోత్సవాలు, ఆదివాసీ దినోత్సవాలు) | – | 8 |
| సంస్థ కృషి వల్ల మంజూరైన రేషన్ కార్డులు | – | 320 |
| సంస్థ మంజూరు చేయించిన వితంతు ఫించన్లు | – | 51 |
| సంస్థ ఎఫ్.ఆర్.ఎ. క్రింద మంజూరైన పట్టాలు | – | 207 |
| కుట్టు మిషన్లు శిక్షణా కార్యక్రమం – 3 | – | 200 |
| నిరుద్యోగ యువతకు హేండ్‌బోర్లు, పంపుసెట్లు రిపేరింగ్‌పై శిక్షణలు – 2 | – | 100 |




కుట్టు మిషన్లు శిక్షణా కార్యక్రమం



నిరుద్యోగ యువతకు హేండ్‌బోర్లు, పంపుసెట్లు రిపేరింగ్‌పై శిక్షణ




పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొన్న జిల్లా సబ్ కలెక్టరు



# IV. పరిపాలన మరియు ఆర్థిక వనరుల నిర్వహణ

## (Governance and Financial Management)

**పరిపాలనా నిర్వహణ :** వ్యవసాయక మరియు సామాజిక అభివృద్ధి సంస్థ (ఎ.ఎస్.డి.ఎస్.) ఆంధ్రప్రదేశ్ సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్, 2001గా మార్పు చేయబడిన సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్, 1860 క్రింద చట్టబద్దంగా నమోదు చేయబడిన ఒక సామాజిక సేవా సంస్థ. ఇది ఆదివాసీల సమగ్ర అభివృద్ధి ప్రధానలక్ష్యంగా 1985లో ఏర్పాటు చేయబడింది. ఈ సంస్థ 18 మంది సర్వసభ్య సభ (జనరల్ బాడీ)ను కలిగి వుంది. 7గురితో కూడిన ఒక కార్యనిర్వాహక వర్గం (బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్) యొక్క మార్గదర్శకత్వం క్రింద ఎగ్జిక్యూటివ్ డైరక్టరు (E.D.) మరియు కొంతమంది కార్యనిర్వాహక సిబ్బంది (సెక్రటేరియట్) ద్వారా పరిపాలన మొత్తం కొనసాగుతుంది.


**సాధారణ సభ (జనరల్ బాడి) సభ్యులు :**

1. వి.వి.ఎన్. సింహారావు
2. ఎమ్. ముత్యాలు
3. వి. కృష్ణారెడ్డి
4. యు. గాంధిబాబు
5. పి. రాజమ్మ
6. ఎస్. శాంతమ్మ
7. ఎమ్. లక్ష్మిదేవి
8. ఎమ్. రాముడు
9. బి. నాగేశ్వరరావు
10. పి. భూబమ్మ
11. సి.హెచ్. ముత్తమ్మ
12. కె. తులసమ్మ
13. వి. సూర్యప్రకాశరావు
14. జి. బుల్లెమ్మ
15. రమణి
16. ఎస్. సుభాని
17. పి. కనకమ్మ
18. కె.ఎస్.ఎస్.ఆర్. సూర్యనారాయణ

**పాలక మండలి (ఎగ్జిక్యూటివ్ కమిటీ) :**

| వ.సం. | పేరు | హోదా | వృత్తి |
|---|---|---|---|
| 1. | వి.వి.ఎన్. సింహారావు | ప్రెసిడెంట్ | సోషల్ వర్కర్ |
| 2. | మోసం ముత్తయ్య | వైస్-ప్రెసిడెంట్ | వ్యవసాయదారుడు |
| 3. | వల్లా కృష్ణారెడ్డి | సెక్రటరి | వ్యవసాయదారుడు |
| 4. | ఉండవల్లి గాంధీబాబు | డైరక్టర్ | సోషల్ వర్కర్ |
| 5. | పులి రాజమ్మ | మెంబర్ | గృహిణి |
| 6. | సోడె శాంతమ్మ | మెంబర్ | సోషల్ వర్కర్ |
| 7. | మడివి లక్ష్మి | మెంబర్ | సోషల్ వర్కర్ |

**1.3 నిర్వాహక సిబ్బంది :** తమ స్థాయిని బట్టి స్వతంత్రంగా విధాన నిర్ణయాలను గైకొని, అమలు జరుపగలిగిన కొంతమంది నిర్వాహక బృందం విధి నిర్వహణలో కార్యనిర్వాహక కార్యదర్శి (Director)కి అవసరమైన సహాయ సహాకారాలను అందిస్తుంది. మొత్తం 85 మంది సిబ్బంది మరో 25 మంది స్వచ్ఛంద సేవా కార్యకర్తలు ఉన్నారు. వీరంతా క్షేత్రస్థాయి నుండి సంస్థలోని ఉన్నత స్థాయి వరకూ ఆయా వ్యక్తులు / విభాగాలకు అప్పగింపబడిన బాధ్యతల ఆధారంగా, సంస్థ సమర్ధవంతంగా పనిచేయడానికి పూర్తి కృషి చేస్తుంటారు.




సంస్థ కార్యనిర్వహక కార్యదర్శి (Director) స్థాయి తరువాత, పూర్తిగా ఆదివాసీ (లబ్ధిదార్ల) మహిళలతో ఏర్పాటు కాబడిన నాట్‌వాన్ సంఘం సంస్థ కార్యకలాపాలకు సంబంధించిన విధాన నిర్ణయాలన్నింటిలోనూ కీలకపాత్ర నిర్వహిస్తుంది. దీని ద్వారా టార్గెట్ గ్రూపు అవసరాలు, ఆకాంక్షలు, అభిష్టాల సాధనకు ఒక పూర్తి హామి లభిస్తుంది. బయటి వారెవరో చేసే నిర్ణయాలపై కాకుండా పూర్తిగా ప్రజాస్వామ్య పద్ధతిలో, లబ్ధిదార్ల భాగస్వామ్యం ముఖ్యంగా మహిళల ప్రాతినిధ్యంతో వాస్తవికతకు అద్దంపట్టే విధంగా, విధాన నిర్ణయాలు మొత్తం గైకొనబడతాయి. వీరిని సరియైన దిశలో నడిపించడానికి, మేథోపరమైన సలహాలు, మార్గదర్శకత్వం నెరపడంలో విజ్ఞుల బృందం మార్గ నిర్దేశక పాత్రను పోషిస్తుంది. క్షేత్ర స్థాయిలో గ్రామ సంఘాలు, గ్రామప్రజలు, ప్రజా సమూహాలు కార్యక్రమాల అమలుకు ప్రధానబాధ్యత వహించి, లక్ష్య సాధనకు శాయశక్తుల కృషి చేస్తాయి.

అన్ని స్థాయిల్లోనూ ఆయా వ్యక్తులు / సమూహాల / సంఘాలకు అవసరమైనంత మేరకు స్వయం ప్రతిపత్తి, విధాన నిర్ణయాలను గైకొనే స్వేచ్ఛ మరియు బాధ్యతలు అప్పగించబడి ఉంటాయి. అన్ని స్థాయిల్లోనూ సంపూర్ణమైన పారదర్శకత, ప్రజాస్వామిక సూత్రాల అమలుకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. లింగ వివక్షత, పక్షపాతాలకు ఏ రూపంలోనూ తావులేకుండా అనేక పద్ధతులు / జాగ్రత్తలను సంస్థ తీసుకుంటుంది. మొత్తం మీద సంస్థ యాజమాన్యం కొరకు ఒక సమగ్రమైన మానవ వనరుల నిర్వహణావిధానం (Human Resource Policy) అమలు జరుగుతుంది. దీన్ని ఎప్పటికప్పుడు పునఃసమీక్షించాలనే ఉద్దేశ్యంతో పాలకమండలి జనవరి 1, 2010న మరోసారి పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులతో ఆమోదించింది.

దీనిలో సిబ్బంది ఎంపిక, నియామకంనకు సంబంధించిన చట్టబద్ధమైన నియమ నిబంధనలు, ప్రాధాన్యతలు స్పష్టంగా నిర్దేశించబడి ఉన్నాయి. క్షేత్ర స్థాయి అనుభవము, విద్యార్హతల ఆధారంగా స్థానిక యువతకు ముఖ్యంగా ఆదివాసీ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఉద్యోగుల సామర్థ్యాలు, ప్రావీణ్యత, అందుకు తగిన పారితోషకం, పదోన్నతి, సంక్షేమం, ఆర్థిక లావాదేవీలు, విధి నిర్వహణా బాధ్యతలు, రవాణా, వసతి సదుపాయాలు, వస్తు సామాగ్రి కొనుగోలు, వాటి నిర్వహణ, సెలవులు, పదవీ విరమణ, ఆరోగ్య సదుపాయాలు, సంస్థ అంతర్గత సమావేశాలు, చర్చలు, నివేదికలు, మొదలైన వాటిన్నింటికీ సంబంధించి స్పష్టమైన విధి విధానాలు హెచ్.ఆర్. విధానంలో పొందుపర్చబడ్డాయి. వీటి ప్రకారం పరిపాలన మొత్తం ఏ ఆటంకం లేకుండా, పారదర్శకంగా కొనసాగుతుంది.




**సిబ్బంది**

| | |
|---|---|
| అకౌంటెంట్స్ | 4 |
| కంప్యూటర్ ఆపరేటర్ | 1 |
| ప్రోగ్రామ్ కోఆర్డినేటర్స్ | 14 |
| క్లస్టర్ కోఆర్డినేటర్స్ | 31 |
| డాక్యుమెంటేషన్ ఇన్‌చార్జ్ | 2 |
| హాస్పిటాల్టి ఇన్‌చార్జ్ | 1 |
| ఇంజనీర్లు | 2 |
| సోషల్ మొబలైజర్స్ | 3 |
| ఏక్టివిస్ట్స్ & వాలంటరీలు | 13 |
| హెల్త్ ఉమెన్ (ఆర్.ఎమ్.పి.ఎస్) | 10 |
| డాక్టర్లు | 2 |
| కన్సల్‌టెంట్స్ | 22 |
| వాలంటీర్లు (నాన్ పెయిడ్) | 25 |

**ఆర్థిక నిర్వహణ :** ఆర్థిక వ్యవహారాల నిర్వహణకు ఒక ఆర్థిక సంఘం ఉంటుంది. అలాగే సంస్థలో ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు ఫైనాన్స్ (యూనిట్ మేనేజర్) ఉంటారు. చాలా వరకూ నిర్ణయాలు సంస్థ కార్యదర్శి, యూనిట్ మేనేజర్, సంబంధిత ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ల ఉమ్మడి నిర్ణయాలు, సమన్వయంపై కొనసాగుతాయి. అలాగే ఫైనాన్స్ యూనిట్టు చట్టబద్దంగా అవసరమైన అన్నిరకాల వ్యవస్థల (Systems)ను / పద్దతులను ఖచ్చితంగా అమలుపరుస్తుంది.

**విరాళాల సేకరణ :** ఒక స్వచ్ఛంద సేవా సంస్థ (NGOs)కు చట్టబద్దంగా ఉండవలసిన అర్హతలన్నీ సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం, విదేశీ విరాళాల సేకరణ (FCRA) చట్టాల క్రింద అర్హత మొదలైనవన్నీ సంస్థ కలిగి వుంది. ఎప్పటికప్పుడు అవసరమైన ఆడిట్ ప్రక్రియను క్రమం తప్పక పూర్తి చేస్తుంది. సంస్థ నిబద్ధత, నమ్మకాల ఆధారంగా వివిధ జాతీయ, అంతర్జాతీయ స్థాయి విరాళ సంస్థలు, దాతలు ముందుకు వచ్చి సంస్థ కృషికి నిరంతర తోడ్పాటును అందిస్తున్నాయి.


## గత 5 సం॥లలో సేకరించిన నిధుల చిత్రపటం





## గత 5 సం॥లలో సేకరించిన నిధులు మరియు ఖర్చుల వివరాలు

| సంవత్సరము | స్వదేశీ నిధులు రూపాయలు | విదేశీ నిధులు రూపాయలు | మొత్తం నిధులు రూపాయలు | ఖర్చు రూపాయలు |
|---|---|---|---|---|
| 2008-09 | 32,30,317 | 41,17,281 | 73,47,598 | 70,95,997 |
| 2009-10 | 59,05,145 | 99,06,307 | 1,58,11,452 | 1,44,70,960 |
| 2010-11 | 19,65,931 | 1,72,82,697 | 1,92,48,628 | 2,08,04,775 |
| 2011-12 | 52,01,808 | 2,60,98,511 | 3,13,00,319 | 2,80,791,30 |
| 2012-13 | 28,36,687 | 2,08,35,613 | 2,36,72,300 | 2,58,41,524 |

**గత 5సం॥ల్లో దేశీ, విదేశీ నిధుల నిష్పత్తుల చిత్రపటం**




**గత 5 సం॥ల ఆదాయవ్యయాల చిత్రపటం**




**సంస్థకు ఆర్థిక సహాకారం అందిస్తున్న దాతల వివరాలు :**

| **స్వదేశీ దాతల జాబితా** (Local Funders) | **విదేశీ దాతల జాబితా** (Foreign Funders) |
|---|---|
| నాబార్డ్ (NABARD, Hyderabad) | ఏక్షన్ ఎయిడ్ (Action aid) |
| రాజీవ్ విద్యా మిషన్ (Rajeev Vidya Mission, Khammam) | అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ డెవలప్‌మెంట్ – యు.ఎస్.ఎ. (Association of Indian Development (AID) - USA) |
| కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (Confederation of Indian Industries (CII), Haryana) | ఆశా ఫర్ ఎడ్యుకేషన్ (Asha for Education, USA) |
| ఎయిడ్ ఎట్ ఏక్షన్ (Aid at action Hyderabad) | సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ (Centre for people's Forestry) |
| ఏ.పి.ఏ.ఆర్.డి (APARD, Hyderabad) | కేర్ ఇండియా (CARE India) |
| డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటి (Deccan Development Society, Hyderabad) | గ్రామ్య రిసోర్సు సెంటర్ ఫర్ ఉమెన్ (Gramya Resource Centre for Women) |
| డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ డిపార్ట్‌మెంట్ (District Water and Sanitation Department, Khammam) | సింగ్ ఫౌండేషన్, యు.ఎస్.ఎ. (Singh Foundation, USA) |
| మినిస్ట్రి ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (Ministry of Rural Development, Hyderabad) | అమెరికన్ జేవిష్ వరల్డ్ సర్వీసెస్, యు.ఎస్.ఎ. (American Jewish World Services (AJWS), USA) |
| | టైడ్స్ ఫౌండేషన్, శాన్‌ఫ్రాన్సిస్కో (Tides Foundation, Sanfransisco) |
| | ఐడియల్ సెంటర్ ఫర్ సోషల్ జస్టీస్ Ideal Center for Social Justice (CSJ) |
| | టి.డి.హెచ్. – నెదర్లాండ్స్ TDH - Netherlands |

## 2013 సంవత్సరానికి ఉత్తమ సంస్థగా ఎంపిక

ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఆగష్టు 15న జిల్లాలో ఉత్తమ సేవలను అందిస్తున్న సంస్థను ఎంపికచేసి ఇచ్చే అవార్డు (పురస్కారాన్ని)ను 2013 సంవత్సరానికిగానూ వ్యవసాయక సాంఘిక అభివృద్ధి సంస్థకు ప్రధానం చేసింది. రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ రామిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా అవార్డు ప్రధానం జరిగింది. జిల్లా కలెక్టరు, సూపరిండెంటెండ్ ఆఫ్ పోలీసు మరియు ఇతర అధికారులు అవార్డు ప్రధానోత్సవంలో పాల్గొన్నారు. అవార్డు ప్రధానోత్సవం సందర్భంగా ప్రభుత్వ అధికారులు, ఆదివాసీలకు సంస్థ అందిస్తున్న సేవలను అభినందించడంతో పాటు, భవిష్యత్తులో తమ నుండి అవసరమైన సహాయ సహాకారాలన్నింటినీ పూర్తి స్థాయిలో అందిస్తామని హామి ఇచ్చారు. ఇది మిగిలిన సంస్థలకు ఆదర్శం కావాలని, మరింత మంది ఆదివాసీ యువతను, ముఖ్యంగా బాలికలు, మహిళలను సాధికారితవైపు సంస్థ నడిపించగలగాలనే ఆకాంక్షను వారు వ్యక్తం చేసారు.



# కార్యక్రమాలు




మహిళా దినోత్సవం



యాక్షన్ ఎయిడ్ టీం ఆర్.బి.సి. సందర్శన



సబ్ కలెక్టర్ చేతుల మీదుగా కుట్టుమిషన్ల పంపిణీ




ఐ.డి.పి.లకు రేషన్ పంపిణీలో పాల్గొన్న స్థానిక ఎం.ఎల్.ఎ.






ఫ్రీ స్కూల్‌ను ప్రారంభిస్తున్న యాక్షన్ ఎయిడ్ & టి.డి.హెచ్ ప్రతినిధులు



గోదావరి నదీతీరంలో కాలుష్యంపై అవగాహన సదస్సు



ఐ.డి.పి. గ్రామంలో సమావేశం

# కార్యక్రమాలు



వాటర్‌షెడ్ పనులు



నాయకత్వంపై మహిళలకు శిక్షణ



ఐ.డి.పి. పిల్లలకు పోషకాహార కేంద్రాలు



వరద బాధితులకు రేషన్ పంపిణి




ఆరోగ్య శిబిరం



ఎఫ్.ఆర్.ఎ.పై గ్రామస్థాయి సమావేశం



ఎన్.ఆర్.ఇ.జి.ఎ.లో మేట్లకు శిక్షణ



ఆదివాసీ రైతులకు విత్తనాల పంపిణీ

# కార్యక్రమాలు



వాటర్‌షెడ్ కమిటీ అధ్యక్షురాలితో చర్చిస్తున్న సి.జి.ఎం. & ఎ.జి.ఎం.



కమిటీకి చెక్కు అందిస్తున్న నాబార్డు చీఫ్ జనరల్ మేనేజరు (సి.జి.ఎం.)



వాటర్‌షెడ్ పనుల వల్ల బావిలో పెరిగిన నీరు



ఫామ్ పాండ్ క్రింద వరి సాగు



వాటర్‌షెడ్ పనుల్లో గ్రామస్థులు



గట్లువేసే పని (బండింగ్ వర్క్)



వర్మీ కంపోస్టు



ఆదాయాభివృద్ధి కార్యక్రమం

# కార్యక్రమాలు



వాటర్‌షెడ్ పనులను పర్యవేక్షిస్తున్న ప్రోగ్రాం మేనేజరు



స్టాల్‌ను సందర్శిస్తున్న నాబార్డు బృందం





గ్రామాలను సందర్శించి, రైతులతో చర్చిస్తున్న నాబార్డు బృందం







మొక్కల పంపిణీ



పాఠశాలలో కిచెన్ గార్డెన్ పెంపకం

# కార్యక్రమాలు



కార్యక్రమాలను సమీక్షిస్తున్న యాక్షన్ ఎయిడ్ బృందం



సంఘీభావ కమిటీ సమావేశం




సమస్యలను వివరిస్తున్న కమిటీ సభ్యురాలు




సంఘీభావ కమిటీతో చర్చిస్తున్న జిల్లా కలెక్టరు




కమిటీ సమావేశం



పిల్లలతో టి.డి.హెచ్. బృందం




'బాలికా సంరక్షణ కాంపెయిన్'లో సంతకం చేస్తున్న జిల్లా కలెక్టరు




బాలికా సంరక్షణ కొరకు ర్యాలీ

# కార్యక్రమాలు



ఐ.టి.డి.ఎ.పి.ఒ.కు స్థానిక సమస్యలను వివరిస్తున్న సంస్థ డైరక్టరు




వాటర్ ఫిల్టర్స్‌పై శిక్షణనిస్తున్న యాక్షన్ ఎయిడ్ టీం




సంస్థలోని ఆరోగ్య కార్యకర్తలలో సామర్థ్యాల పెంపునకు శిక్షణ




ప్రథమచికిత్సపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం



కోళ్ళ పెంపకంనకు సహాయం పొందిన ఒంటరి మహిళలు



స్థానికంగా లభ్యమయ్యే ఆకులతో ప్లేట్లు, కప్పుల తయారిపై శిక్షణ



ఆరోగ్య శిబిరం



ఎఫ్.ఆర్.ఎ.పై పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు